ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

హైదరాబాద్

: fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

7-7-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 157 పేజీలు: 10+4 వెల: 6.50

విద్వేష ప్రసంగాలు, నేరాలపై సెలక్ట్ కమిటీ 2

రాజ్యసభ మూడు సీట్లకు నోటిఫికేషన్ 5

కొండచరియలు విరిగిపడి పలువురు దుర్మరణం

వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం

మహారాష్ట్రలో భారీ వర్షాలు, 10 మంది మృతి

## కాశ్మీర్‌లో క్లౌడ్‌బరస్ట్

ముంబయి నుంచి జమ్మూ దాకా వరదలు





జమ్మూకాశ్మీర్‌లోని కిశ్త్‌వాడ్‌లో బురదలో చిక్కుకున్న వాహనాలు

### ఉగ్రరూపంలో ప్రవహిస్తున్న నదులు

**శ్రీనగర్ / ముంబయి,జులై 6:** జమ్మూకశ్మీర్‌లో అటు ప్రకృతి విపత్తు ఒక విలయంగా మారింది. దోడాకిశ్త్‌వాడ్ పరిధిలో కురుస్తున్న ఎడతెరిపి లేని భారీ వర్షాల కారణంగా చీనాబ్ నది ఉగ్రరూపం దాల్చింది. రాంబన్ జిల్లాలోని బగ్లిహార్ డ్యామ్ ప్రమాదకర స్థాయికి చేరుకోవడంతో అధికారులు సోమవారం ఈ ప్రాజెక్టుకు సంబంధించిన మూడు గేట్లను ఎత్తివేసి నీటిని కిందకు విడుదల చేశారు. గతే దాది పహల్గాం ఉగ్రదాడి తర్వాత సింధు జలాల >>2



ముంబయి-పుణే హైవేపై విరిగిపడిన కొండచరియలు



పాడి రైతులకు నెలకు 2 సార్లు

## పేమెంట్

డెయిరీ పరిశ్రమలో సరికొత్త మార్పులు: మంత్రి శ్రీహరి

**హైదరాబాద్, జులై 6, ప్రభాతవార్త:** పాడి రైతులకు ఇక నుంచి 15 రోజులకోసారి బిల్లులు చెల్లించేలా కృషి చేస్తామని పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని వెల్లడించారు. విజయ డెయిరీని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌పట్టణంలో తెలంగాణపాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన షాద్‌నగర్ పాల శీతలీ కరణకేంద్రం 60సంవత్సరాల స్వర్ణోత్సవాల్లో పాల్గొని >>2

యుద్ధ విమానాలతో ప్రధాని మోడీకి

## స్వాగతం

అత్యున్నత గౌరవం ప్రదర్శించిన ఇండోనేసియా ప్రభుత్వం

జకార్తాలో స్వయంగా స్వాగతించిన అధ్యక్షుడు సుబియాంటో



జకార్తాలో ప్రధానిమోడీకి స్వాగతం పలుకుతున్న అధ్యక్షుడు సుబియాంటో

**జకార్తా, జులై 6:** మూడుదేశాలపర్యటనలో భాగంగా తొలి దేశంగా ప్రధానిమోడీ ఇండోనేషియాలోకి ప్రవేశించగానే యుద్ధ విమానాలతో స్వాగతం పలికారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలను ప్రధాని మోడీ విమానం నుంచి వీక్షించారు. ప్రస్తుతం ఈజెట్ రక్షణగా వస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. రాజధాని జకార్తాకు చేరుకున్న మోడీకి ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో స్వయంగా స్వాగతం పలికారు. దీంతో ఇరు దేశాల మధ్య ఉన్న సన్నిహిత ద్వైపాక్షిక సంబంధాలను మరోసారి చాటిచెప్పారు. మోడీ ప్రయాణిస్తున్న ప్రత్యేక విమానం ఇండోనేషియా గగనతలంలోకి ప్రవేశించిన క్షణం నుంచి ఆ దేశ వైమానిక దళానికి చెందిన యుద్ధ విమానాలు ప్రత్యేక ఎస్కార్ట్‌ను అందించాయి. భారత ప్రధాని విమానాన్ని జకార్తా వరకు భద్రతా పరిరక్షణతో వెంట తీసుకెళ్లడం ద్వారా ఇండోనేషియా ప్రభుత్వం అత్యున్నత గౌరవాన్ని ప్రదర్శించింది. విమానాశ్రయంలో ఏర్పాటు చేసిన స్వాగత >>2

# పర్యాటకం పరుగులు

అంతర్జాతీయ స్థాయిలో ఫ్యూచర్ సిటీ అటవీ భూముల అభివృద్ధి

టూరిస్టు కేంద్రంగా తారామతి-బారాదరి

దుర్గం చెరువు మరింత అభివృద్ధికి చర్యలు

వికారాబాద్ వీరభద్రస్వామి ఆలయానికి యాదాద్రి తరహా కమిటీ

అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ ఆదేశం



సోమవారం పర్యాటకశాఖ సమీక్షలో సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జులై6:** తెలంగాణలో తలపెట్టిన పర్యాటక అభివృద్ధిప్రాజెక్టులకు సంబంధించి నిర్దేశించుకున్న పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డి బోధి పెవిలియన్‌లో పర్యాటక శాఖ పైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష చేశారు. హైదరాబాద్ కోర్ అర్బన్ ఏరియా పరిధిలో ఉన్న అటవీ శాఖ భూములను పర్యాటక శాఖతో కలిసి ఎకో టూరిజాన్ని అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు. తారామతి బారాదరిని టూరిజం ప్లేస్‌గా మరింతగా అభివృద్ధి చేయాలని చెప్పారు. దుర్గం చెరువును పూర్తి స్థాయి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. మంజీరా, దిల్ కుషా గెస్ట్‌హౌస్‌లను ఆధునీకరించాలని చెప్పారు. టూరిజం హబ్ డెవలప్మెంట్ పథకం కింద వికారాబాద్‌ను అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. వికారాబాద్‌లో వీరభద్రస్వామి దేవాలయాన్ని అభివృద్ధి చేయాలి.. యాదాద్రి తరహాలో టెంపుల్‌కి కమిటీ ఏర్పాటు చేయాలని చెప్పారు. క్యూర్ పరిధిలో ఉన్న అటవీ శాఖ భూములను పర్యాటక శాఖతో కలిసి ఎకో టూరిజంగా అభివృద్ధి చేయాలని చెప్పారు. గుర్రంగూడ ఎకోపార్క్ తరహాలో నగరంలో ఎకో పార్క్‌లు తీర్చి దిద్దాలని చెప్పారు. ఫ్యూచర్ సిటీలో ఉన్న అటవీ భూములను అంతర్జాతీయస్థాయిలో తీర్చిదిద్దాలి, అర్బన్ ఫారెస్ట్ తరహాలో ఏర్పాట్లు చేయాలని అన్నారు. అర్బన్ ఫారెస్ట్ ప్రాజెక్ట్‌లకోసం స్పెషల్ ఆఫీసర్‌నుఏర్పాటు చేసుకొని పనులను ముమ్మరం చేయాలి. పురానాపూల్ హెరిటేజ్ బ్రిడ్జిలను అభివృద్ధి చేసి పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. బ్రిడ్జిలపైన పర్యాటకుల కోసం ఏర్పాట్లు చేయాలి. అవకాశం ఉంటే ట్రాఫిక్ మళ్లించి పర్యాటకులకు అవకాశం కల్పించాలని పేర్కొన్నారు. డిసెంబరులో నిర్వహించే గ్లోబల్ ఇన్వెస్ట్మెంట్ సమ్మిట్‌పైన కసరత్తు ప్రారంభించాలి. సమ్మిట్ కోసం డిపార్ట్మెంట్‌ల మధ్య సమన్వయం కోసం కమిటీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశానికి సీఎం సలహాదారు రామకృష్ణా రావు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, టూరిజం స్పెషల్ సిఎస్ వాణి ప్రసాద్, టూరిజం కార్పొరేషన్ ఎండీ గౌతమి తదితరులు హాజరయ్యారు.

## డిఎస్‌పి భీంరెడ్డి అరెస్టు

రిమాండుకు తరలింపు



డిఎస్‌పి భీంరెడ్డిని అరెస్టు చేసి తరలిస్తున్న పోలీసులు

**హైదరాబాద్, జులై 6 ప్రభాతవార్త:** ఆదాయానికి మించి ఆస్తులు కలిగిన కేసులో ఎసిబికి పట్టుబడ్డ పోలీసు కంప్యూటర్స్ విభాగం డిఎస్‌పి సంకిరెడ్డి భీంరెడ్డి ఎట్టకేలకు అరెస్టయ్యారు. ఈ నెల రెండవ తేదీన భీంరెడ్డి ఇంటితో పాటు 16 చోట్ల ఎసిబి అధికారులు దాడులు చేయడంతె లిసిందే. ఈ సమయంలో ఆయన వద్ద 200 కోట్ల రూపాయలకు పైగా అక్రమాస్తులు పట్టుబడం విదితమే. అయితే ఇదే సమయంలో భీంరెడ్డి వున్నట్లుంది తీవ్ర అస్వస్తతకు లోనవడంతో >>2



# ఒప్పందమా! యుద్ధమా?

ఇప్పటికీ చర్చల ద్వారానే పరిష్కారం ఆశిస్తున్నా..

9.1 కోట్ల మంది ఇరాన్ ప్రజలకు హాని చేయకూడదనే భావిస్తున్నా.. : అమెరికా అధ్యక్షుడు ట్రంప్

**వాషింగ్టన్, జులై 6:** అమెరికాతో ఇరాన్ ఒప్పందం చేసుకోకపోతే మిషన్ పూర్తి చేస్తామంటూ అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ మరోసారి ఇరాన్‌కు తీవ్ర హెచ్చరికలు చేసారు. ఓపక్క ఇరాన్‌లో దివంగత సుప్రీం లీడర్ అయొతుల్లా ఖొమైనీ అంత్యక్రియల ప్రక్రియ కొనసాగుతున్న తరుణంలో ట్రంప్‌చేసిన హెచ్చరికలు ఇరాన్‌కు ఆగ్రహాన్ని రప్పించాయి.అమెరికాఇరాన్ మధ్య శాంతి ఒప్పందంపై చర్చలు కొనసాగుతున్న వేళ ట్రంప్ ఇరాన్‌కు తీవ్ర హెచ్చరిక చేశారు. ఇరాన్ ఒప్పందానికి అంగీకరించకపోతే అమెరికా మిషన్‌ను పూర్తిచేస్తుంది. అంటూ స్పష్టం చేశారు. అయితే తాను ఇప్పటికీ చర్చల ద్వారానే సమస్యకు పరిష్కారం కోరుకుంటున్నానని కూడా వెల్లడించారు. ట్రంప్ మాట్లాడుతూ ఒప్పందం జరిగినా, జరగకపోయినా చివరికి గెలిచేది అమెరికానే అని అన్నారు. అయితే 9.1 కోట్ల మంది ఇరాన్ ప్రజలకు ఎలాంటి హాని జరగకూడదనే ఉద్దేశంతో తాను ఒప్పందానికే ప్రాధాన్యత ఇస్తున్నానని చెప్పారు. ఇరాన్ ఇప్పటికే కొన్ని అంశాల్లో అమెరికాకు హామీలు ఇచ్చిందని, వాటిని తప్పనిసరిగా అమలు చేయాల్సిందేనని ట్రంప్ పేర్కొన్నారు. అలాగే చర్చల ప్రక్రియలో భాగంగా ఇరాన్ వద్ద ఉన్న అధిక స్థాయిలో శుద్ధి చేసిన యురేనియాన్ని కూడా అమెరికా స్వాధీనం చేసుకుంటుందని ఆయన వ్యాఖ్యానించారు. ఇటీవల ఇరాన్‌పై చేపట్టిన చర్యల ఫలితంగానే అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు తగ్గాయని ట్రంప్ అన్నారు. ఇరాన్‌పై అమెరికా చూపిన కఠిన వైఖరి కారణంగా చమురు ధరలు ఉద్రిక్తతలకు ముందున్న స్థాయికంటే కూడా తగ్గాయని పేర్కొన్నారు. ఇరాన్‌లో ప్రభుత్వ మార్పు తీసుకురావాలన్న ఉద్దేశం తమకు లేదని ట్రంప్ స్పష్టం చేశారు. చర్చల ద్వారా పరస్పర అంగీకారంతో శాంతియుత పరిష్కారం సాధించడమే తమ ప్రధాన లక్ష్యమని మరోసారి వెల్లడించారు. ప్రస్తుతం ఇరాన్ అణు కార్యక్రమం, ప్రాంతీయ భద్రత వంటి కీలక అంశాలపై అమెరికాఇరాన్ మధ్య దౌత్య చర్చలు కొనసాగుతున్నాయి. ఇదే సందర్భంగా రష్యాఉక్రెయిన్ యుద్ధంపైనా ట్రంప్ స్పందించారు. రష్యా అధ్యక్షుడు, ఉక్రెయిన్ అధ్యక్షుడు ఇద్దరూ యుద్ధాన్ని >>2



సోమవారం హైదరాబాద్‌లో ఎస్‌ఎల్‌బిసి ప్రాజెక్టుపై ఉన్నతస్థాయి సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

## ఎస్‌ఎల్‌బిసి టన్నెల్ రెండేళ్లలో పూర్తి

కార్మికుల భద్రతలో ఎలాంటి రాజీలేదు

4.01 లక్షల ఎకరాలకు సాగునీరు

డిండి ప్రాజెక్టు, బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కూడా సకాలంలో నిర్మాణం: నీటిపారుదల మంత్రి ఉత్తమ్

**హైదరాబాద్, జులై 6:** దక్షిణ తెలంగాణ రైతుల దశాబ్దాల కల అయిన ఆలిమినేటి మాధవరెడ్డి శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ ప్రాజెక్టును జూన్-2028 నాటికి తప్పకుండా పూర్తి చేస్తామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. అదే సమయంలో టన్నెల్ పనుల్లో పాల్గొంటున్న కార్మికుల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండబోదని ఆయన తేల్చిచెప్పారు. సోమవారం రోజున డాక్టర్ బి.ఆర్.అంబెడ్కర్ సచివాలయంలో ఎస్‌ఎల్‌బిసి ప్రాజెక్టుపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించిన మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం అవసరమైన నిధులు, భూసేకరణ, సాంకేతిక అనుమతులు, పరిపాలనా అనుమతులను వేగంగా పూర్తి చేసి పనులు నిరంతరాయంగా సాగేందుకు అన్ని చర్యలు తీసుకుంటోందని తెలిపారు. టన్నెల్‌తో పాటు డిండి ప్రాజెక్టు, బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు, కాలువల >>2

## తీరం దాటిన వాయుగుండం

పలు జిల్లాల్లో మోస్తరు వర్షాలు



గంటకు 60 కిలోమీటర్ల వేగంగా ఈదురు గాలులు

**హైదరాబాద్, జులై 6, ప్రభాతవార్త:** బంగాళాఖాతంలో కొనసాగుతున్న వాయుగుండం తీరం దాటింది. గడిచిన ఆరు గంటలలో గంటకు 12 కిలోమీటర్ల వేగంతో పశ్చిమ వాయువ్య దిశగా కదిలిన వాయుగుండంఒడిశాలోని బాలాసోర్ వద్ద వాయుగుండం >>2

## ఏదీ 'సన్న' బోనస్?

2 సీజన్లకు రూ.1,800 కోట్ల బకాయిలు

ఆందోళనలో రైతాంగం



**హైదరాబాద్, జులై 6, ప్రభాతవార్త:** తెలంగాణలో గత రెండు యాసంగి సీజన్లలో రైతులు పండించిన సన్న రకం ధాన్యం నిమిత్తం చెల్లించాల్సిన బోనస్ ఇప్పటికీ పెండింగ్‌లో ఉండటంతో రైతాంగం తీవ్ర ఆందోళనలో >>2

## మత్తు 'కొరియర్'లు!

కొన్ని కంపెనీలు డ్రగ్స్ మాఫియాతో చెట్టపట్టాల్




మాదకద్రవ్యాలు, స్టెరాయిడ్స్ డోర్ డెలివరీ చేస్తున్న వైనం

కొరవడిన ప్రభుత్వ నియంత్రణ

గతంలో మావోయిస్టులతో కుమ్మక్కు

**హైదరాబాద్, జులై 6 ప్రభాతవార్త:** సరుకు రవాణాలో కీలక భూమిక వహించే కొరియర్ కంపెనీలలో కొన్ని దారి తప్పుతున్న వైనం పోలీసులకు సవాల్‌గామారింది. దేశ వ్యాప్తంగా వందల సంఖ్యలో కొరియర్ కంపెనీలు డ్రగ్స్ స్మగ్లింగ్ కేరాఫ్‌గా మారుతుండడం సంచలనం రేపుతోంది. జంట నగరాలు, శివార్లలో కొన్ని కొరియర్ కంపెనీలు >>2



సోమవారం జకార్తా విమానాశ్రయంలో ప్రధాని మోడీకి స్వాగతం పలుకుతున్న ప్రవాసభారతీయులు

# యుద్ధ విమానాలతో ప్రధాని మోడీకి స్వాగతం

>> కార్యక్రమంలో ఇరు దేశాల ఉన్నతాధికారులు, దౌత్య ప్రతినిధులు కూడా పాల్గొన్నారు. ప్రధాని మోడీ పర్యటన సందర్భంగా భారత్ ఇండోనేషియా ద్వైపాక్షిక సంబంధాలు, వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ సహకారం, సముద్ర భద్రత, ఇండోపసిఫిక్ ప్రాంతీయ సహకారం వంటి కీలక అంశాలపై చర్చలు జరిగే అవకాశం ఉంది. ఈ పర్యటన ద్వారా భారత్ఇండోనేషియా వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత బలోపేతం అవుతుందని ఇరు దేశాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి. ప్రధాని మోడీ పర్యటనలో పలు కీలక ఒప్పందాలు కుదిరే అవకాశమున్నట్లు దౌత్య వర్గాలు భావిస్తున్నాయి.

# టన్నెల్ రెండేళ్లలో పూర్తి

>> నిర్మాణాన్ని ఒకే సమగ్ర ప్రాజెక్టుగా భావించి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఉత్తమ్ ఆదేశించారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో టన్నెల్ పనులు పునఃప్రారంభించిన తర్వాత ఇప్పటికే అర కిలోమీటర్‌కు పైగా పురోగతి నమోదైందని తెలిపారు. దేవరకొండ వైపు నుంచి పనులు సంతృప్తికరంగా కొనసాగుతున్నాయని, శ్రీశైలం వైపు కూడా అన్ని భద్రతా ప్రమాణాలు పాటిస్తూ పనులు సాగుతున్నాయని చెప్పారు.టన్నెల్ పనులను మరింత వేగవంతం చేసేందుకు మూడు అత్యాధునిక ఆర్మ్ బూమర్ యంత్రాలు ముంబై పోర్టుకు చేరాయని, ఈ నెలాఖరులో పనుల ప్రదేశానికి చేరుకుని నిర్మాణ వేగాన్ని మరింత పెంచనున్నాయని వెల్లడించారు. ఎస్ఎల్‌బిసి ద్వారా శ్రీశైలం జలాశయం నుంచి 40 టిఎంసి నీటిని తరలించి 4.01 లక్షల ఎకరాలకు సాగునీరు, 618 ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాలకు సురక్షిత తాగునీరు, అలాగే పారిశ్రామిక అవసరాలకు నీటి సరఫరా అందుతుందని మంత్రి వివరించారు. ఈ ప్రాజెక్టుకు సవరించిన పరిపాలనా అనుమతి వ్యయం సుమారు రూ.12,718 కోట్లు అని తెలిపారు. యంత్రాల రవాణా, కస్టమ్స్ అనుమతులు, సాంకేతిక సిబ్బంది నియామకం వంటి అంశాల్లో ఎలాంటి ఆలస్యం జరగకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.డిండి ప్రాజెక్టు, నక్కలగండి రిజర్వాయర్, పెండ్లిపాకల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, కాలువల నెట్‌వర్క్ పూర్తయితేనే ఎస్ఎల్‌బిసి పూర్తి ప్రయోజనాలు రైతులకు అందుతాయని మంత్రి తెలిపారు. భూసేకరణ పరిహారాన్ని రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.హై లెవల్ కెనాల్, లో లెవల్ కెనాల్, ఉదయ సముద్రం ఎత్తిపోతల పథకం, కాలువల సామర్థ్య పెంపు పనులపైనా సమీక్ష నిర్వహించిన మంత్రి, అవసరమైన చోట కాలువలను విస్తరించి భవిష్యత్తులో అదనపు నీటి ప్రవాహాలను సురక్షితంగా మోయగల విధంగా రూపకల్పన చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో నీటిపారుదల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఈ. శ్రీధర్, టన్నెల్ నిపుణుడు కల్నల్ పరిక్షిత్ మెహ్రా, ఇంజినీర్ఇన్‌చీఫ్ (జనరల్) వి. రమేష్‌బాబు, అధికారులు,నిర్మాణ సంస్థలప్రతినిధులు పాల్గొన్నారు.

# ఒప్పందమా! యుద్ధమా?

>> ముగించాలని కోరుకుంటున్నారని తెలిపారు. యుద్ధానికి త్వరలోనే పరిష్కారం లభించే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం కాల్పులు కొనసాగుతున్నప్పటికీ, అంతర్జాతీయ మధ్యవర్తిత్వంతో జరుగుతున్న చర్చలు సానుకూల ఫలితాల దిశగా సాగుతున్నాయని ట్రంప్ పేర్కొన్నారు.

# విద్వేష ప్రసంగాలు, నేరాలపై సెలక్ట్ కమిటీ

## చైర్మన్‌గా మంత్రి పొన్నం, 13 మంది సభ్యులు

### వివిధ అంశాలపై 20 జాయింట్ కమిటీలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూలై6:** రాష్ట్ర ప్రభుత్వం 21 అసెంబ్లీ కమిటీలను ఏర్పాటు చేసింది. ఈమేరకు సెలెక్ట్ కమిటీ చైర్మన్‌గా రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యవహరించనున్నారు. తెలంగాణ విద్వేష ప్రసంగాలు, విద్వేష నేరాలను పరిశీలించే ఈ కమిటీలో అన్ని పార్టీలకు చెందిన 13 మంది సభ్యులు(లక్ష్మీ కాంతరావు, మధుసూదన్‌రెడ్డి, రాజేశ్‌రెడ్డి, కవ్వంపల్లి సత్యనారాయణ, దానం నాగేందర్, కొవా లక్ష్మీ, మానిక్‌రావు, రామారావు పవార్, అబ్దుల్లా బలాల, కూనంనేని సంబశివరావు) ఉన్నారు. సబార్టినేట్ లెజిస్టేషన్ జాయింట్ కమిటీకి కడియం శ్రీహరి చైర్మన్‌గా ఎంపికయ్యారు. మరో 10 మంది సభ్యులుగా నియామకం అయ్యారు. 11 మందితో కూడిన అమినిటీస్ కమిటీకి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నేతృత్వం వహించనున్నారు. ఎస్సీ సంక్షేమం కమిటీ చైర్మన్‌గా మేడిపల్లి సత్యంను ఎంపిక చేశారు. 11 మందితో కూడిన సభ్యుల బృందం ఈ కమిటీ విధుల్లో పాలుపంచుకోనుంది. 11 మంది సభ్యులతో కూడిన ఎస్టీ వెల్‌ఫేర్‌కు పాయం వెంకటేశ్వర్లు, 11 మంది సభ్యులతో కూడిన బీసీ వెల్‌ఫేర్‌కు మకన్ సింగ్ రాజ్ ఠాకూర్ చైర్మన్లుగా నియామకం అయ్యారు. 11 మంది సభ్యులతో కూడిన లైబ్రరీ కమిటీకి మట్టా రాగమయి చైర్‌పర్సన్‌గా వ్యవహరించనున్నారు. 11 మంది సభ్యులతో కూడిన మహిళా సంక్షేమ కమిటీకి చిట్టెం పర్ణికారెడ్డి చైర్‌పర్సన్‌గా, 11 మంది సభ్యులతో కూడిన మైనారిటీ సంక్షేమ కమిటీకి లక్ష్మీకాంతారావు చైర్మన్‌గా నియామకం అయ్యారు. 11 మంది సభ్యులతో కూడిన వైల్డ్‌లైఫ్ ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ కమిటీ చైర్మన్‌గా, రూల్స్ కమిటీ చైర్మన్‌గా స్పీకర్ వ్యవహరించనున్నారు. 7 మంది సభ్యుల కూడిన పిటీషన్స్, ప్రివిలేజ్ కమిటీలకు చైర్మన్‌గా డిప్యూటీ స్పీకర్ వ్యవహరించనున్నారు. అస్యూరెన్స్ కమిటీ చైర్మన్‌గా పి.సంజీవరెడ్డి, ఎథిక్స్ కమిటీ చైర్మన్‌గా రేవూరి ప్రకాశ్‌రెడ్డి వ్యవహరించనున్నారు. శాసనమండలిలో పిటీషన్స్, ప్రివిలేజ్ కమిటీలకు చైర్మన్‌గా డిప్యూటీ చైర్మన్ వ్యవహరించనున్నారు. అస్యూరెన్స్ కమిటీ చైర్మన్‌గా కె.శంకర్, రూల్స్ కమిటీ చైర్మన్‌గా మండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి, ఎథిక్స్ కమిటీ చైర్మన్‌గా మహేశ్‌కుమార్‌గౌడ్ నియామకం అయ్యారు. ఈ మేరకు అసెంబ్లీ కార్యదర్శి ఆర్.తిరుపతి, మండలి కార్యదర్శి డాక్టర్ నరసింహాచార్యులు సంయుక్తంగా ఉత్తర్వులు జారీ చేశారు.

# నెలకు 2 సార్లు పేమెంట్

>> మాట్లాడుతూ పాడి రైతులకు బిల్లులు సకాలంలో చెల్లించే విషయంలో ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్కతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వారికి రుణాలు, ఇతర సౌకర్యాల విషయంలో ఇప్పటికే బ్యాంకులతో చర్చలు జరిపినట్లు వెల్లడించారు. బయట కనిపించే లాభాల కంటే లోపల ఉండే కష్టాలు ఎక్కువ అని, అటువంటి పాడి రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని తేల్చిచెప్పారు. వారు తలెత్తుకొని జీవించేలా పాడి పరిశ్రమను తీర్చిదిద్దుతామన్నారు. రాష్ట్రంలో రోజుకు మరో 25 లక్షల లీటర్ల పాల అవసరం ఉందని చెప్పారు. భవిష్యత్ తరాలకు నాణ్యమైన పాలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోందన్నారు. దేశవ్యాప్తంగా విజయ డెయిరీ ప్రస్తుతం ఐదో స్థానంలో నిలవడం గర్వకారణం. రాష్ట్రంలోనే పాల ఉత్పత్తిని పెంచి ఇతర రాష్ట్రాల నుంచి పాలు కొనుగోలు చేసే పరిస్థితిని పూర్తిగా నివారిస్తామని పేర్కొన్నారు. పాడి పరిశ్రమ రంగంలో సమూల మార్పులు తీసుకొస్తాం అని మంత్రి వాకిటి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి, తెలంగాణ లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ చైర్మన్ చరణ్ కౌశిక్ యాదవ్, పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ డాక్టర్ గోపి, తెలంగాణ డెయిరీ డెవలప్‌మెంట్ మేనేజింగ్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భీంరెడ్డి అరెస్టు

>> ఎసిబి అధికారులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. మరుసటి రోజు కూడా ఆయన ఆరోగ్యం కుదుట పడక పోవడంతో ఎసిబి అధికారులు అరెస్టు చేయడానికి బదులు సిఆర్‌పిసి 41 కింద నోటీసులు ఇచ్చి వెనుదిరిగారు. ఎసిబి అధికారు ల తీరు విమర్శలకు తావివ్వగా అనారోగ్యంతో వున్న అధికారిని అరెస్టు చేయడం సబబుకాదని ఎసిబి అధికారులు సమర్థించుకున్నారు. దీని తరువాత గత మూడు రోజులుగా భీం రెడ్డి వద్ద లభించిన ఆస్తుల్లో కొన్ని ఇతరులకు బినామీగా వున్నట్లు తేలడంతో వారిని ఎసిబి అధికారులు విచారించారు. దీని తరువాత సోమవారం సాయంత్రం ఆయనను అరెస్టు చేసి నాంపల్లిలోని ఎసిబి కార్యాలయానికి తరలించి అక్కడ కొంతసేపు విచారించారు. అనంతరం భీం రెడ్డికి వైద్య పరీక్షలు నిర్వహించి ఆ తరువాత ఎసిబి కోర్టుల న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచారు. ఈ కేసును విచారించిన న్యాయమూర్తి భీం రెడ్డికి రెండు వారాల రిమాండు విధించారు. అనంతరం ఆయనను చంచల్‌గూడ జైలుకు రిమాండుకు తరలించారు.

## వారం - వర్జ్యం

07-07-2026, మంగళవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
నిజ జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, పునర్వసు కార్తె
సప్తమి మ.1.20
ఉత్తరాభాద్ర సా.4.19
వర్జ్యం : తె.4.07–తె.5.41,
దు.ఉ.8.17–ఉ.9.09, 2)రా11.59–రా.12.51
శుభసమయం : ఉ.9.30–10.15
రాహుకాలం – మ.3.00–4.30

## వార్తాఫలం

**మేషం:** నూతన ప్రయత్నాలలో పురోగతి సాధిస్తారు. సంఘంలో ప్రత్యేకమైన గుర్తింపు పొందుతారు. వస్త్రలాభం కలదు.

**వృషభం:** భూవివాదాలు తీరి లబ్ధి పొందుతారు. కొన్ని ఆర్థిక కారణాల వల్ల గృహ నిర్మాణ కార్యక్రమాలకు ఆటంకం కలుగుతుంది.

**మిథునం:** ముఖ్యమైన వ్యవహారాలలో ఎదురైన ఆటంకాలను అధిగమిస్తారు. పెట్టుబడుల విషయాలలో నిదానం అవసరం.

**కర్కాటకం:** కళలు, రాజకీయ రంగాలలోని వారికి విదేశీ పర్యటనలు ఉంటాయి. విందు, వినోదాలలో పాల్గొంటారు. వస్త్రలాభం.

**సింహం:** ఇంట్లో శుభకార్యాల ప్రస్తావన ఉంటుంది. కొత్త పెట్టుబడులకు అనుకూలం. వాహనాలు కొనుగోలు చేస్తారు.

**కన్య :** విద్యారంగా పురోభివృద్ధి బాగుంటుంది. నూతన వైద్య, విధానములు అనుకూల ఫలితములను ఇస్తాయి.

**తుల :** వృత్తి సంబంధమైన వ్యవహారాలలో ఒత్తిడి అధికం అవడం వల్ల శరీరం అలసటకు గురౌతుంది. బంధువుల కలయిక.

**వృశ్చికం:** బ్యూటీపార్లర్‌లు నడిపే వారికి అనుకూలంగా ఉంటుంది. ఎదుటి వారి విషయాలలో జోక్యం చేసుకోవద్దు.

**ధనుస్సు:** నూతన వ్యక్తులు పరిచయమై మాట సహాయం అందిస్తారు. ఈ రోజు మరిన్ని అనుకూల ఫలితాలు సాధిస్తారు.

**మకరం:** అవసరమైన సమచారము కొరకు ధనమును, పాత పరిచయములను ఉపయోగిస్తారు. వాహనాలు కొనుగోలు.

**కుంభం:** శత్రువర్గం ఎంతగానో ఇబ్బంది పెడతారని మీరు భావిస్తారు. కాని దైవాను గ్రహం వలన మీ ఊహ వాస్తవికతకు దూరం అవుతుంది.

**మీనం:** ఆర్థిక వ్యవహారాలలో పురోగతిని సాధిస్తారు. గృహనిర్మాణ ఆలోచనలు కలిసి వస్తాయి. స్పెక్యులేషన్ కలిసి వస్తుంది.

– శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



సోమవారం కురిసిన భారీ వర్షాలకు పుణే జిల్లాలో చెదిరిపోయిన రైల్వేట్రాక్

# కాశ్మీర్‌లో క్లౌడ్‌బరస్ట్

>> ఒప్పందాన్ని నిలిపివేసిన నేపథ్యంలో, మునుపెన్నడూ లేని విధంగా డ్యామ్ గేట్లను తెరవడం ఇప్పుడు సర్వత్రా ఆసక్తి రేకెత్తిస్తోంది. జమ్మూకశ్మీర్‌లోని కిశ్త్‌వాడ్ ప్రాంతంలో ఒక్కసారిగా మేఘ విస్ఫోటం సంభవించడంతో ఊహించని రీతిలో ఆకస్మిక వరదలు ముంచెత్తాయి. కొండచరియలు విరిగిపడటంతో రహదారులన్నీ బురదమయంగా మారాయి. ఈ ప్రకృతి ప్రకోపానికి కిశ్త్‌వాడ్‌లో నిర్మాణంలో ఉన్న 540 మెగావాట్ల భారీ జలవిద్యుత్ ప్రాజెక్టు సైట్ తీవ్రంగా దెబ్బతింది. కొండల నుంచి దూసుకొచ్చిన భారీ రాళ్లు, మట్టి పెళ్లల కింద ప్రాజెక్టుకు చెందిన అనేక వాహనాలు, మిల్లులు, ఇతర యంత్రాలు పూర్తిగా కూరుకుపోయాయి. ఎన్డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, భారత ఆర్మీ సిబ్బందితో పాటు స్థానిక పోలీసులు రంగంలోకి దిగారు. భారీ యంత్రాల సహాయంతో బురదను తొలగించేందుకు రెస్క్యూ ఆపరేషన్‌ను ముమ్మరం చేశారు. బాధితులకు, పర్యాటకులకు తక్షణ సహాయం అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కంట్రోల్ రూమ్, హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేసింది. ప్రాణ, ఆస్తి నష్టాలకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది ఈ వరద విపత్తుల నడుమ సింధు జలాల ఒప్పందం పై భారత్ తన కఠిన వైఖరిని మరోసారి స్పష్టం చేసింది. సరిహద్దు ఉగ్రవాదానికి పాకిస్తాన్ శాశ్వతంగా, నమ్మదగిన రీతిలో స్వస్తి పలికే వరకు 1960 నాటి ఈ ఒప్పందం సస్పెన్షన్ లోనే ఉంటుందని విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తేల్చి చెప్పారు.

**ముంబయి,థాణె,రాయ్‌గడ్‌ప్రాంతాల్లో జల విలయం**

భారీ వర్షాలు మహారాష్ట్రను కుదిపేస్తున్నాయి. ముంబై, పుణె, థానే, రాయగడ్ ప్రాంతాలు వానలకు అతలాకుతలం అవుతున్నాయి. భారీవర్షాలకు సోమవారం తెల్లవారుజామున కొండచరియలు విరిగిపడి ఇద్దరు ప్రాణాలు కోల్పోగా ఒకరు గల్లంతయ్యారు. ఎడతెరిపి లేని వానలతో పుణె జిల్లా మావల్ తహసీల్‌లోని పటాన్‌లో ఈరోజు తెల్లవారుజామున 4:25 గంటలకు పలు ఇళ్లపై కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ప్రమాదంలో సుమారు 30 నుంచి 35 మంది గ్రామస్థులు శిథిలాల కింద చిక్కుకుపోయారు. బాధితుల్లో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు మరణించగా, మరొకరి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. బాధితులనునందు టికోన్ (60), మోలి టికోన్ (30), అనితా టికోన్ (55)గా పోలీసులు గుర్తించారు. సమాచారం అందుకున్న జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టింది. శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోంది. రాష్ట్రంలో వర్షాల కారణంగా ఇప్పటివరకు 10 మంది ప్రాణాలు కోల్పోగా వారిలో ఒక్క ముంబైలోనే 8 మంది వివిధ ఘటనల్లో మృతిచెందారు. బాధితుల్లో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు మరణించగా, మరొకరి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. బాధితులను నందు టికోన్ (60), మోలి టికోన్ (30), అనితా టికోన్ (55)గా పోలీసులు గుర్తించారు. రాష్ట్రంలో వర్షాల కారణంగా ఇప్పటివరకు 10 మంది ప్రాణాలు కోల్పోగా వారిలో ఒక్క ముంబైలోనే 8 మంది వివిధ ఘటనల్లో మృతిచెందారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ స్పందిస్తూ కొండచరియలు విరిగిపడ్డాయని, సహాయక చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ ఘటనతో ముంబైపుణె ఎక్స్‌ప్రెస్‌వే, పాత ముంబైపుణె హైవేపై భారీగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడిందని ఆయన వెల్లడించారు. సుమారు 100 టన్నుల శిథిలాలు ఒక్కసారిగా ముంబైపుణె ఎక్స్‌ప్రెస్‌వేపై పడ్డాయని పేర్కొన్నారు. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడిందని.. ఇప్పటివరకు దాదాపు 70 శాతం శిథిలాలను తొలగించినట్లు సీఎం వివరించారు. పుణె నుంచి ముంబైకి వెళ్లే ట్రాఫిక్ కోసం ఒక లేన్‌ను తిరిగి తెరిచామని, రాబోయే కొన్ని గంటల్లో ఎక్స్‌ప్రెస్‌వే పూర్తిస్థాయిలో పనిచేస్తుందని ఆయన వెల్లడించారు.

# ఏదీ 'సన్న' బోనస్?

>> కొట్టుమిట్టాడుతున్నారు. క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ చెల్లింపులు ఇంకా చాలా మంది రైతులకు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ విధంగా గత రెండు యాసంగికి సీజన్లకు సంబంధించి రైతులకు రూ. 700 నుండి దాదాపు రూ. 1,800 కోట్ల మేర బోనస్ బకాయిలు ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. నిధులు విడుదల కాకపోవడంతో ఈ జాప్యం జరుగుతోందని సమాచారం. గత యాసంగికి సంబంధించి రూ.1,159 కోట్ల బోనస్ ఇప్పటివరకు చెల్లించలేదు. తాజాగా ముగిసిన యాసంగిలో దాదాపు 14 లక్షల టన్నుల సన్న ధాన్యాన్ని కొనుగోలు చేసింది. ఇందుకుగాను రైతులకు రూ.700 కోట్లు బోనస్ చెల్లించాల్సి ఉన్నది. సన్న ధాన్యం కొనుగోలు చేసి రెండు నెలలు గడుస్తున్నా, ఇప్పటివరకు రైతులకు నయాపైసా బోనస్ చెల్లించలేదు. దీంతో రెండు సీజన్లకు కలిపి బోనస్ బకాయిలు సుమారు రూ.1,800 కోట్లకు చేరాయి. వానకాలం నుంచి అన్ని రకాల సన్నాలకు బోనస్ ఇవ్వకూడదని, ఎంపిక చేసిన కొన్ని రకాలను మాత్రమే కొనుగోలు చేయాలని నిర్ణయించడంతో రైతులు మరింత అయోమయానికి గురవుతున్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్ (వానాకాలం సాగు) విషయంలో ప్రభుత్వం బోనస్ వర్తింప చేసేందుకు గాను విధివిధానాలు మారుస్తూ, నిర్దేశిత ఎనిమిది సన్న వరి రకాలకే అవకాశం ఇస్తూ ఇప్పటికే నిర్ణయం తీసుకుంది. ఇప్పటి వరకూ 33 రకాల సన్న రకం ధాన్యానికి ఈ బోనస్ వర్తింప చేసిన ప్రభుత్వం వాటిల్లో కోత పెట్టి ఎనిమిది రకాలకే పరిమితం చేయడం పట్ల రైతాంగంలో అసంతృప్తి నెలకొని ఉంది. ఇందుకు గాను వరి సాగులో పారదర్శకత కోసం ప్రభుత్వం కొత్తగా ప్రత్యేకమైన మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ నిబంధనల ప్రకారం, కేవలం 7 అధికారిక సన్న రకాల వడ్లను పండించి, కొనుగోలు కేంద్రాల్లో విక్రయించిన రైతులకు మాత్రమే బోనస్ అందుతుంది. ఈ విధంగా సన్న రకం ధాన్యానికి బోనస్ చెల్లింపలు చేయకుండా వాటి నిబంధనలను మరింత కఠిన తరం చేస్తుండటంతో రైతుల్లో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా సోమవారం పార్లమెంటులో ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న స్పీకర్ ఓం బిర్లా, రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ తదితరులు

# మత్తు 'కొరియర్'లు!

>> డ్రగ్స్ మాఫియాతో చేతులు కలిపి మాదకద్రవ్యాల వ్యసనపరులకు, జింలలో శిక్షణ పొందేందుకు వచ్చే యువతకు నిషిద్ధ స్టెరాయిడ్స్ ఇంజక్షన్లు డోర్ డెలివరీ చేస్తున్న వైనాన్ని పోలీసులు ఇటీవల మూడుసార్లు రట్టుచేశారు. ఇటీ వల తరచూ వెలుగుచూస్తున్న నేరాల ప్రక్రియలో కొరియర్ సంస్థలు ఏకంగా డ్రగ్స్ మాఫియాకు అండగా వుంటూ విదేశాల నుంచి మాదకద్ర వ్యాలను హైదరాబాద్ సహ దేశంలోని అనేక నగరాలకు పంపిణీ చేస్తున్న తీరు పోలీసు విభాగాలను కలవర పరుస్తోంది. కొరియర్ కంపెనీలపై సర్కారీ విభాగాల నియంత్రణ పూర్తిగా కొరవడింది. దేశ వ్యాప్తంగా వున్న వేలాది కొరియర్ కంపెనీలు ఇదివరకటితో పోలిస్తే ప్రస్తుతం మంచి లాభాలు గడిస్తున్నాయని సర్కారీ గణాంకాలు చెబుతున్నాయి. అయితే ఇదంతా నాణానికి ఒకవైపు మాత్రమే. అభివృ ద్ధి వున్న చోట ఏదో ఒక రూపంలో అసాంఘీక శక్తుల నుంచి ప్రమాదం పొంచి వుంటుందన్నట్లుగానే కొన్ని కొరియర్ కంపెనీల మూలంగా ఇ ప్పుడు దేశంలోని అనేక చోట్ల స్మగర్లు, నేరగాళ్లు, మాదకద్రవ్యాల క్రయ విక్రయదారులు నిత్యం పండగ చేసుకుంటునారంటే అతిశయోక్తి కాదు. కొరియర్ కంపెనీలు ఏర్పాటు చేయాలంటే ప్రభుత్వంలోని పలు విభాగాల అనుమతి తప్పనిసరి. ఇందులో పోలీసు, రవాణా విభాగాలది కీలక పాత్రగా వుంటోంది. అయితే నిబంధనలకు లోబడి అనుమతులు పొందుతున్న అనేక కొరియర్ కంపెనీలు ఆ తరువాత అధిక లాభాలా కోసం అడ్డదారులు తొక్కుతూ స్మగ్లింగ్ బాటపడుతున్నాయి. ఇతర ప్రాంతాల విషయం అలావుంచితే ఒక్క హైదరాబాద్‌లోనే వందల సంఖ్యలో కొరియ ర్ కంపెనీలు వున్నాయి. ఈ కంపెనీల్లో కొన్ని అయితే కేవలం విదేశాలకు సరుకులను ఎగుమతి, దిగుమతి చేయడం వరకే పరిమితం కాగా ఇం కొన్ని దేశీయ రంగం వరకే సేవలు అందిస్తున్నాయి. ఇదంతా బాగానే వున్నా కొన్ని కొరియర్ కంపెనీలు కొన్నేళ్లుగా తప్పుడు పనులకు పాల్పడు తూ సర్కారీ వ్యవస్థలకు సవాల్‌గా మారుతున్నాయి. ఉమ్మడి ఎపి హయాంలో 2008లో నల్లగొండ, రంగారెడ్డి కేంద్రంగా కొన్ని ట్రాన్స్‌పోర్టు కంపెనీలు ఏకంగా తుపాకులు, రాకెట్ లాంచర్లతో పాటు వీటి విడి భాగాలను మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గడ్ రాష్ట్రాల నుంచి హైదరాబాద్‌కు సాధారణ సరుకుల రూపంలో దిగుమతి చేసుకుని వాటిని కర్నూలులోని నల్లమల అడవుల్లో మావోయిస్టులకు తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. అప్పట్లో ఈ ఘటన దేశ వ్యాప్తంగా సంచలనం రేపింది. పోలీసులు ఈ వ్యవహారాన్ని చేధించేసరికే నక్సలైట్లకు కొన్ని రాకెట్ లాంచర్లు, పెద్ద సంఖ్యలో తుపాకులు చేరిపోయాయి. ఇందులో కొన్ని రాకెట్ లాంచర్లు, తుపాకులను తదనంతరం జరిగిన ఎన్‌కౌంటర్ల సమయాల్లో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన తరువాత ట్రాన్స్‌పోర్టు, కొరియర్ కంపెనీలకు పోలీసులు కఠినమైన మార్గదర్శకాలను జారీ చేశారు. తరువాత కూడా చాలా సందర్భాలలో ట్రాన్స్‌పోర్టు, కొరియర్ కంపెనీలలో స్మగ్లింగ్ వస్తువులు పట్టుబడ్డాయి. దీని తరువాత అనేకసార్లు కొరియర్ కంపెనీలు డ్రగ్స్, స్టెరాయిడ్స్ ఇంజక్షన్లను డోర్ డెలివరీ చేస్తూ పట్టుబడ్డాయి. ఇందులో ముఖ్యమైనది గోవా కేంద్రంగా సాగుతున్న డ్రగ్స్ వ్యాపారంలో కొందరు స్మగ్లర్లు హైదరాబాద్‌లోని తమ కస్టమర్లకు డార్క్ వెబ్ అనే సైట్ ద్వారా మాదకద్రవ్యాలను కొరియర్ కంపెనీల ద్వారా సరఫరా చేయడం సంచలనం రేపింది. హైదరాబాద్‌తో పాటు దేశంలోని అనేక నగరాలలో డ్రగ్స్ మాఫియా కార్యకలాపాలు నిర్వహిస్తున్న మాదకద్రవ్యాల మాఫియాకు నైజీరియాతో పాటు ఆఫ్రికా దేశాలకు చెందిన అంతర్జాతీయ డ్రగ్స్ డాన్‌ల అండదండలున్నట్లు అనేకమార్లు వెలుగు చూసింది. గతంలో నైజీరియాకు చెందిన కెల్విన్ మార్కన్సన్ అలియాస్ కెల్విన్ ఆఫ్రికా దేశాల నుంచి కొకైన్, ఎల్ఎస్‌డి వంటి ఘాటైన మత్తు పదార్థాల దిగుమతికి మూడు కొరియర్ కంపెనీలను వాడుకున్నాడు. ఈ కంపెనీలు పేరొందినవి కావడం, వీటి ద్వారా వచ్చే సరుకులను ఎవరూ తనిఖీ చేయక పోవడం, పట్టించుకోక పోవడంతో కెల్విన్ హైదరాబా ద్‌కు డ్రగ్స్ మాఫియా సామ్రాజ్యంగా మార్చేశాడు. దీని తరువాత డచ్ నేరగాడు కమింగా సైతం డ్రగ్స్ సరఫరాకు కొరియర్ కంపెనీలను వాడుకున్నాడు. వీరిద్దరు పట్టుబడిన తరువాత కొంతకాలం కొరియర్ కంపెనీల నుంచి డ్రగ్స్ స్మగ్లింగ్ ఆగినా తిరిగి ఇటీవల మళ్లీ పెరిగిపోయిందని తాజా ఘటనలు చెబుతున్నాయి. కొ రియర్ కంపెనీలపై సర్కారీ నియంత్రణ పూర్తిగా కొరవడడం వల్లే చాలా వరకు కంపెనీలు అక్రమ మార్గాల వైపు మళ్లుతున్నాయి. వీటిపై ఇక నైనా కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది.

# వాయుగుండం

>> తీరం దాటినట్లు భారత వాతావరణ శాఖ వెల్లడించింది. ఆదివారం అర్ధరాత్రి తెల్లవారితే సోమవారం నాడు తీరం దాటిన ఈ వాయుగుండం 24 గంటల్లో పశ్చిమ వాయువ్య దిశగా ఉత్తర ఒడిశా, దక్షి ణ జార్ఖండ్, ఉత్తర ఛత్తీస్‌ఘడ్ మీదుగా పయనిస్తున్నట్లు తెలిపింది. వాయుగుండం ప్రభావంతో తెలంగాణలోని కొన్ని జిల్లాలలో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఈదురు గాలులకు వీలుందని తెలియచేసింది. గంటకు 40 కిలోమీటర్ల నుంచి 50 కిలోమీటర్ల వేగంగా ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపారు. అల్పపీడనం, నైరుతి రుతుపవనాల ప్రభావంతో తెలంగాణలో మరో మూడు రోజుల పాటు వర్షాలు కొనసాగే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది. పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. నైరుతి రుతుపవనాల ఉత్తర పరిమితి 22 ఎన్/60 ఇ, 22 ఎన్/65 ఇ, జామ్‌నగర్, ఉదయ్‌పూర్, అజ్మీర్, ఝున్‌ఝును, హిసార్, భటిండా – 32.5 ఎన్/70 ఇ గుండా కొనసాగుతోంది. రాబోయే 3 రోజుల్లో నైరుతి రుతుపవనాలు ఉత్తర అరేబియా సముద్రం, గుజరాత్‌లోని మరికొన్ని ప్రాంతాలు, హర్యానా, పంజాబ్‌లలో మిగిలిన ప్రాంతాలతో పాటు రాజస్థాన్‌లోని మరికొన్ని ప్రాంతాలకు మరింత ముందుకు విస్తరించడానికి వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి. అలాగే దక్షి ణ జార్ఖండ్ – దానిని ఆనుకుని ఉన్న ఉత్తర అంతర్గత ఒడిశాపై ఉన్న వాయుగుండం గత 6 గంటల్లో గంటకు 15 కిలోమీటర్ల వేగంతో పశ్చిమవాయవ్య దిశగా కదిలింది. ఇది సోమవారం ఉదయం 08:30 గంటల సమయానికి అదే ప్రాంతంలో 22.7 ఇఅక్షాంశం, 85.1 ఇ రేఖాంశం వద్ద కేంద్రీకృతమై ఉంది. అంటే, రూర్కెలా (ఒడిశా)కు ఉత్తరఈశాన్యంగా 60 కి.మీ, రాంచీ (జార్ఖండ్)కి దక్షిణనైరుతిగా 70 కి.మీ, జష్‌పూర్ నగర్ (ఛత్తీస్‌గఢ్)కు తూర్పు ఆగ్నేయంగా 100 కి.మీ, డాల్టన్‌గంజ్ (జార్ఖండ్)కు ఆగ్నేయంగా 180 కి.మీ దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఇది 24 గంటల్లో జార్ఖండ్, ఉత్తర ఛత్తీస్‌గఢ్, దానిని ఆనుకుని ఉన్న తూర్పు మధ్యప్రదేశ్ మీదుగా దాదాపు వాయవ్య దిశగా కదిలే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది.

# ప్రభుత్వ విప్ కార్యాలయాలను ప్రారంభించిన స్పీకర్ ప్రసాద్ కుమార్, చైర్మన్ సుఖేందర్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూలై6:** శాసనసభ విప్ వేముల వీరేశం, శాసనమండలి విప్ లు అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్‌ల కార్యాలయాలను సోమవారం అసెంబ్లీ భవన సముదాయంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ప్రారంభించి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అసెంబ్లీ మీడియా ఎడ్వైజరీ కమిటీ నూతన కార్యాలయాన్ని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ ముదిరాజ్ ప్రారంభించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, ప్రజాప్రతినిధులు, మండలి కార్యదర్శి డాక్టర్ వి. నరసింహా చార్యులు, శాసనసభ కార్యదర్శి రేండ్ల తిరుపతి, అధికారులు పాల్గొన్నారు.

# అయోధ్య రామమందిర ట్రస్టు తాత్కాలిక కార్యదర్శిగా కృష్ణమోహన్

**అయోధ్య,జులై 6:** అయోధ్య రామమందిర్ విరాళాల చోరీ దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించడంతో శ్రీ రామజన్మభూమి క్షేత్ర ట్రస్ట్ కీలక నిర్ణయం తీసుకుంది. విరాళాలు కాజేసిన నిందితులు పట్టుబడేంత వరకు పదవిలో కొనసాగబోనని జనరల్ సెక్రటరీ చంపత్ రాయ్, కోశాధికారి అనిల్ మిశ్రాలు సమర్పించిన రాజీనామాను ట్రస్ట్ ఆమోదించింది. అనంతరం ట్రస్టీ సభ్యుల్లో ఒకరైన మధ్యంతర కార్యదర్శిగా కృష్ణ మోహన్‌ను నియమించింది. త్వరలోనే సంస్థాగత సమీక్ష అనంతరం తాత్కాలిక కోశాధికారి పేరును కూడా వెల్లడిస్తామని ట్రస్టీ తెలిపింది. ఉత్తరప్రదేశ్ అయోధ్యలోని రామ జన్మభూమి కాంప్లెక్స్‌లో సోమవారం శ్రీ రామజన్మభూమి క్షేత్ర ట్రస్ట్ మూడుగంటలకు పైగా సమవేశమైంది.

చంపత్ రాయ్, అనిల్ మిశ్రాల రాజీనామాలను ఆమోదించిన ట్రస్టీ తాత్కాలిక కార్యదర్శిగా కృష్ణ మోహన్‌ను నియమించింది. అనంతరం ట్రస్ట్ కోశాధికారి స్వామీ గోవింద్ దేవ్ గిరి మీడియాతో మాట్లాడుతూ రామ మందిర్ విరాళాల చోరీ ఘటన తమ సంఘాన్ని తీవ్రంగా బాధించిందని చెప్పారు. రామమందిర్ విరాళాల చోరీ మమ్మల్ని చాలా బాధించింది. పెద్దమొత్తం కాజేశారా చిన్న మొత్తమా అనేది రెండో విషయం. అంతకంటే ముఖ్యంగా అలాంటి పవిత్రమైన చోట విరాళాల చోరీ జరగడం మమ్మల్ని క్షోభకు గురిచేస్తోందని గోవిద్ దేవ్ గిరి ఆవేదన వ్యక్తం చేశారు.



# నాంపల్లి క్రిమినల్ కోర్టులో అగ్నిప్రమాదం

## అర్ధరాత్రి చెలరేగిన మంటలు

**హైదరాబాద్ జులై 6, ప్రభాతవార్త :** హైదరాబాద్ మహానగరంలో ఇటీవల వరుస అగ్ని ప్రమాదాలు గుబులు పెట్టిస్తున్నాయి. తాజాగా అత్యంత రద్దీగా ఉండే నాంపల్లి క్రిమినల్ కోర్టు ప్రాంగణంలో అగ్నిప్రమాదం జరిగింది. సోమవారం తెల్లవారుజామున కోర్టు భవనం మూడో అంతస్తులో ఉన్న ఒక ప్రాపర్టీ రూమ్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఇది గమనించిన సిబ్బంది వెంటనే అప్రమత్తమై అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. హుటాహుటిన అక్కడకు చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది రెండు ఫైరింజన్ల సాయంతో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అగ్నిమాపక సిబ్బంది వేగంగా స్పందించి, ఇతర అంతస్తులకు మంటలు వ్యాపించకుండా అదుకోవడంతో పెనుప్రమాదం తప్పిందని అధికారులు తెలిపారు. మంటలు పక్కన ఉన్న ఇతర గదులకు, కోర్టు రికార్డురూమ్‌లకు వ్యాపించకుండా సిబ్బంది సకాలంలో స్పందించి, తీవ్రంగా శ్రమించి మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చారు. అర్ధరాత్రి సమయం కావడంతో కోర్టులో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని, ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని అధికారులు ఊపిరిపీల్చుకున్నారు.కాగా, షార్ట్‌సర్క్యూట్ కారణంగానే అగ్నిప్రమాదం సంభవించి ఉంటుందని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ఈ ప్రమాదంలో కోర్టుకు సంబంధించిన ఏవైనా కీలకమైన పత్రాలు, ఫైళ్లు ఏమైనా కాలిబూడిదయ్యాయనే విషయం ఇంకా తెలియాల్సి ఉంటుంది. ఆస్తి నష్టం ఎంత మేరకు జరిగిందనే అంశాలపై అధికారులు విచారణ చేపట్టనున్నారు.

## సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసు..

# విచారణకు అల్లు అర్జున్ వర్చువల్‌గా హాజరు

## 29కి వాయిదా

**హైదరాబాద్, జులై 6, ప్రభాతవార్త:** నగరంలోని సంధ్య థియేటర్ వద్ద 2024 డిసెంబరు నాలుగవ తేదీన రాత్రి వేళ పుష్ప 2 సినిమా విడుదల సందర్భంగా ప్రీమియర్ షోలో జరిగిన తొక్కిసలాట ఘటనపై సోమవారం నాంపల్లి కోర్టులో విచారణ జరిగింది. ఈ కేసులో ఏ11 నిందితుడుగా వున్న టాలీవుడ్ నటుడు అల్లు అర్జున్ సోమవారం నాటి విచారణకు నేరుగా హాజరు కావాల్సి వున్నా షూటింగ్ నేపథ్యంలో ముంబయి నుంచి వర్చువల్‌గా హాజరయ్యారు. అల్లు అర్జున్ వర్చువల్ హాజరుకు నాంపల్లి కోర్టు అంగీకరించింది. కాగా ఇదే కేసులో మిగతా నిందితుల్లో కొందరు కోర్టు అనుమతితో గైర్హాజర్ అవగా మిగతా వారు కోర్టులో హాజరై సంతకాలు చేశారు. నాటి తొక్కిసలాట ఘటనలో ఒక మహిళ చనిపోగా ఆమె మైనర్ కుమారుడు ఇప్పటికీ చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతుండడం తెలిసిందే. ఈ బాలుడికి టాలీవుడ్ పెద్దలతో పాటు అల్లు అర్జున్ కుటుంబం వైద్యం అందిస్తుండడం విదితమే. ఈ కేసులో 23 మందిపై చిక్కడపల్లి పోలీసులు ఛార్జిషీట్ దాఖలు చేయగా 500 పేజీల ఛార్జిషీట్ కాపీలను కోర్టుకు పబ్లిక్ ప్రాసిక్యూటర్ అందజేశారు. దీనిపై నాంపల్లి కోర్టులో ట్రయల్ విచారణ సాగుతోంది. సోమవారం నాటి విచారణ తరువాత తదుపరి విచారణను కోర్టు జులై 29 తేదీకి వాయిదా వేసింది. ఈ కేసులో గత నెల 22వ తేదీన జరిగిన విచారణలోనూ అల్లు అర్జున్ షూటింగ్ కారణంగా వర్చువల్‌గా హాజరవగా, తాజా విచారణకు ఆయన ఇదే రీతిన హాజరయ్యారు.

# బహ్రెయిన్‌లో నిజామాబాద్ వాసి సముద్రంలో మునిగి మృతి

**హైదరాబాద్, జులై 6, ప్రభాతవార్త:** గల్ఫ్‌లోని బహ్రెయిన్‌లో నిజామాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి సముద్రంలో మునిగి చనిపోయాడు. ఆదివారం జరిగిన ఈ ఘటన సోమవారం వెలుగు చూసింది. వివరాలు ఇలావున్నాయి. నిజామాబాద్ జిల్లాకు చెందిన తోట శ్రీనివాస్ (48) 2019 నవంబర్ నెల నుంచి బహ్రెయిన్‌లోని ఏంఎసీ కంపెనీలో ప్రాజెక్టు డిపార్ట్‌మెంట్‌లో ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం ఉదయం సహచరులతో కలిసి బహ్రెయిన్‌లోని దుర్రత్ అల్ బహ్రెయిన్ బీచ్‌కు సరదాగా గడిపేందుకు వెళ్లాడు. సహచరులతో కలిసి అతను సముద్రం నీటిలో కొంసేపు గడిపిన తరువాత అలలు ఒక్కసారిగా తీరానికి రావడంతో శ్రీనివాస్ నీటిలో మునిగిపోయాడు. విషయం తెలిసిన వెంటనే అతను పనిచేసే కంపెనీ అధికారులు, స్థానక సర్కారీ విభాగాలకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు మెరైన్ సిబ్బంది, కోస్ట్ గార్డ్ సిబ్బంది గాలించగా ఐదు గంటల అనంతరం శ్రీనివాస్ శవం లభ్యమయింది. శ్రీనివాస్ మృతదేహాన్ని స్థానిక పోలీసులు పోస్టుమార్టం చేయించి భద్రపరిచారు. దీనిపై నిజామాబాద్‌లోని అతని కుటుంబ సభ్యులకు సమాచాచాఆరం అందించారు. దీంతో నిజామాబాద్‌లోని అతని ఇంటివద్ద విషాధచాయలు నెలకొన్నాయి. శ్రీనివాస్ మృతదేహం స్వదేశానికి రప్పించేలా చర్యలు తీసుకోవాలని అతన కుటుంబీకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.




# జింద్-సోనిపట్ మధ్య తొలి హైడ్రోజన్ రైలు

## 17న ప్రధాని మోడీ చేతుల మీదుగా ప్రారంభం

**న్యూఢిల్లీ, జులై 6:** దేశంలో తొలి హైడ్రోజన్ రైలు పట్టాలెక్కనుంది. ఇందుకు ముహూర్తం ఖరారైంది. రూట్ సైతం అధికారులు ఫిక్స్ చేసారు. ప్రధాని మోడీ ఈ రైలును ప్రారంభించనున్నారు. ఇప్పటి వరకు డీజిల్, విద్యుత్ రైళ్లు నడుస్తుండగా హైడ్రోజన్‌తో నడిచే తొలి రైలు అందుబాటులోకి రాబోతోంది. బింద్ నుంచి సోనిపట్ మధ్య నడవనుంది. ఈ రైలు ప్రారంభం అయిన తరువాత దశల వారీగా విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే వందేభారత్, వందేభారత్ స్లీపర్, అమృత్ భారత్ రైళ్లకు ఆదరణ పెరుగుతోంది. రెండో వందేభారత్ స్లీపర్ ను ముంబాయి నుంచి బెంగళూరు మధ్య నడిపేందుకు రైల్వే శాఖ సిద్ధం అయింది. ఈ నెల 17న ఈ రైలును ప్రారంభించే ఆలోచన చేస్తున్నారు. కాగా, 75 కిలోమీటర్ల ప్రారంభ వేగంతో నడుస్తుంది. రీసెర్చ్, డిజైన్, స్టాండర్డ్ సంస్థ తొలి హైడ్రోజన్ శక్తితో నడిచే రైలు డిజైన్‌ను రూపొందించింది. ఈ రైలు గరిష్ఠంగా గంటకు 110 నుంచి 140 కిలోమీటర్ల వేగంతో నడుస్తుంది. హైడ్రోజన్ ఫర్ హెరిటేజ్ ఇన్నోవేషన్ కింద హైడ్రోజన్ పవర్‌తో నడిచే 35 రైళ్లను నడపాలని రైల్వే భావిస్తోంది. ప్రతి రైలుకు దాదాపు 80 కోట్లు ఖర్చు అవుతోంది.కాగా, గ్రౌండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కోసం అదనంగా 70కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనా వేస్తోంది. హెరిటేజ్, హిల్‌స్టేషన్స్ రూట్స్‌లో ఈ రైళ్లను నడిపేందుకు ప్రణాళికలు రచిస్తోంది. చెన్నైలో తయారు చేస్తున్న రైలును జింద్‌కు తీసుకువచ్చాక ట్రయల్ రన్ నిర్వహిస్తున్నారు. అన్నీ అనుకూలిస్తే ఈ నెల 17న ఈ రైలు పట్టాలెక్కనుంది. ఈ రైలులో సుమారుగా 27 హైడ్రోజన్ సిలిండర్లను అమర్చారు. రైలులో ముందస్తు చర్యల్లో భాగంగా ఫైర్ డిటెక్టర్లను కూడా అమర్చారు.

# భారత్‌కు ఇరాన్ కృతజ్ఞతలు

## ఖమేనీ అంత్యక్రియల్లో పాల్గొన్న భారత ప్రతినిధి బృందానికి ప్రశంసలు

**న్యూఢిల్లీ/టెహ్రాన్, జులై 6:** ఇరాన్ అత్యున్నత నాయకుడు అయతొల్లా సయ్యద్ అలీ ఖమేనీ అంత్యక్రియల్లో భారత ప్రతినిధి బృందం పాల్గొనడంపై ఇరాన్ భారత్‌కు కృతజ్ఞతలు తెలిపింది. ఈ సందర్భంగా భారత ప్రభుత్వం, ప్రజలు చూపిన సంఘీభావం రెండు దేశాల మధ్య ఉన్న చారిత్రక, సాంస్కృతిక, మానవీయ బంధాలకు ప్రతీకగా నిలిచిందని భారతదేశంలోని ఇరాన్ రాయబార కార్యాలయం పేర్కొంది. గత శుక్రవారం బీహార్ గవర్నర్ లెఫ్టినెంట్ జనరల్ (రిటైర్డ్) సయ్యద్ అతా హస్నైన్, కేంద్ర విదేశాంగ శాఖ సహాయమంత్రి పవిత్ర మార్గరెటా నేతృత్వంలోని భారత అధికార ప్రతినిధి బృందం టెహ్రాన్‌లో ఖమేనీకి నివాళులర్పించింది.
అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్త వైమానిక దాడుల్లో ఫిబ్రవరిలో ఖమేనీ హత్యకు గురైన విషయం తెలిసిందే. ఇక కాంగ్రెస్ సీనియర్ నేత సల్మాన్ ఖుర్షీద్, జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, పీడీపీ అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీతోపాటు సిక్కు, హిందూ, ముస్లిం, క్రైస్తవ మత పెద్దలు కూడా అంత్యక్రియల్లో పాల్గొని ఖమేనీకి నివాళులర్పించారు. తన సోషల్‌మీడియా పోస్టులో భారత ప్రభుత్వం, ప్రజలకు ఇరాన్ రాయబార కార్యాలయం ధన్యవాదాలు తెలిపింది. భారత నాయకులు, ప్రజలు ప్రదర్శించిన సానుభూతి, స్నేహపూర్వక వైఖరిని ఇరాన్ ప్రజలు ఎన్నటికీ మరచిపోరని పేర్కొంది.
ఇదిలా ఉండగా, ఖమేనీ అంతిమయాత్ర సోమవారం ఉదయం టెహ్రాన్‌లో ప్రారంభమైంది. ప్రభుత్వ కథనం ప్రకారం.. ఈ అంతిమయాత్ర 10 నుంచి 12 గంటల పాటు కొనసాగనుండగా, దేశ ఆధునిక చరిత్రలోనే అతిపెద్ద ప్రజాసమీకరణగా అధికారులు పేర్కొన్నారు. జాతీయ పతాకంతో కప్పిన ఖమేనీ శవపేటికతోపాటు ఫిబ్రవరి 28న జరిగిన వైమానిక దాడిలో మరణించిన ఆయన కుటుంబసభ్యుల శవపేటికలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో తరలించారు. మార్గమంతా నల్ల దుస్తులు ధరించిన వేలాదిమంది ప్రజలు అంతిమయాత్రలో పాల్గొని నివాళు లర్పించారు. కొందరు శవపేటికను తాకేందుకు ప్రయత్నించగా, మరికొందరు ఆశీర్వాదంగా భావిస్తూ ప్రార్థనలు చేసారు.

### అంత్యక్రియలకు 13 దేశాలు దూరం!

### అమెరికా ఒత్తిళ్లతో జంకుతున్న చిన్నదేశాలు

**న్యూఢిల్లీ :** అమెరికా నుంచి వస్తున్న దౌత్యపరమైన ఒత్తిడుల కారణంగా ఇరాన్ దివంగత నేత అయోతొల్లాఖమేనీ అంత్యక్రియలకు 13 దేశాలు దూరంగా ఉన్నాయి. ఇరాన్ మీడియా కథనాల ప్రకారమే అమెరికా ఈ దేశాలను ఒత్తిడి చేసి హాజరుకావద్దని ఆదేశాలు జారీచేయడం వల్లనే రాలేకపోతున్నాయని కథనాలు వచ్చాయి. వాటిలో మూడు తూర్పు యూరోప్ దేశాలు, ఐదు ఆఫ్రికా దేశాలు, రెండు పర్షియల్ గల్ఫ్ అరబ్‌దేశాలు, మరో రెండు తూర్పు ఆసియా దేశాలు ఈ అంత్యక్రియలకు హాజరు కావడంలేదు. ఈ అంత్య క్రియలకు హాజరైతే ఆయా దేశాలతో అమెరికా ద్వైపాక్షిక సంబంధాలు దెబ్బతింటాయని అమెరికా దౌత్యవేత్తలు హెచ్చరిస్తూ వచ్చారు. అంతేకాకుండా ఆ దేశాలకు అమెరికా అభివృద్ధి సహాయక నిధులను కూడా నిలిపివేస్తుందన్న హెచ్చరికలు వెల్లాయి. 13 దేశాలు అమెరికా ఒత్తిడి కారణంగా హాజరుకావడం లేదు. ఇతర ఆర్మేనియా, తజికిస్తాన్ వంటి దేశాలు టెహ్రాన్‌లోని గ్రాండ్ మసీదు మషా ల్లాలో ఖమేనీ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అమెరికా ఇప్పటికీ శాంతి ఒప్పందంపై ఇరాన్‌కు హెచ్చరికలు చేస్తూనే ఉంది. అంత్య క్రియల సందర్భాన్ని పురస్కరించుకుని తాత్కాలిక విరామం ఇచ్చామని చర్చలు కూడా నిలిపివేసినట్లు ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే 11వ తేదీ నుంచి మళ్లీ ఇస్లామాబాద్‌లో ఇరాన్, అమెరికాల మధ్య చర్చలు జరగనున్నాయి.



# రక్షణ, అంతరిక్ష రంగాల్లో తెలంగాణ యువత సత్తా చాటాలి

## జెపిఎన్‌సిఇ, ఎన్‌సిసి కేడెట్ యాదయ్యను అభినందించిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, జులై 6, ప్రభాతవార్త:** రక్షణ, అంతరిక్ష పరిశోధనలు, అత్యాధునిక శాస్త్ర సాంకేతిక రంగాల్లో తెలంగాణ యువత మరింత ముందుకు రావాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే శక్తి యువతలోనే ఉందని, ప్రతిభ, క్రమశిక్షణ, అంకితభావం ఉంటే ప్రపంచ స్థాయి అవకాశాలను కూడా అందిపుచ్చుకోవచ్చని ఆయన ఉద్బోధించారు. మహబూబ్‌నగర్‌కు చెందిన జయ ప్రకాశ్ నారాయణ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి, ఎన్‌సిసి క్యాడెట్ కె. యాదయ్య భారత వాయుసేనకు చెందిన బెంగళూరులోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఏరోస్పేస్ మెడిసిన్ లో నిర్వహించిన ప్రతిష్టాత్మక 'సతత శయనాను సంధానం' కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసిన సందర్భంగా హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆయనను ప్రత్యేకంగా అభినందించారు.
ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా వేలాది మంది యువతలో అత్యంత కఠినమైన ఎంపిక ప్రక్రియ ద్వారా ఎంపికైన కొద్దిమంది అభ్యర్థుల్లో యాదయ్య ఒకరిగా నిలవడం తెలంగాణకు గర్వకారణమన్నారు. ఇది వ్యక్తిగత విజయం మాత్రమే కాదని, రాష్ట్ర యువత సామర్థ్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. యాదయ్య విజవంతంగా ముగించిన ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని భారత వాయుసేనకు చెందిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఏరోస్పేస్ మెడిసిన్, ఐసిఎంఆర్ సెంటర్ ఫర్ అడ్వాన్స్ రిసెర్చ్ ఇన్ స్పేస్ సైకాలోజీ, ఎన్ఐఎం హెచ్ఎఎస్ఎస్ సంయుక్తంగా నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో జెపిఎన్‌సిఇ చైర్మన్ కె.ఎస్. రవికుమార్, ప్రిన్సిపాల్ డా. పి. కృష్ణమూర్తి, సాయి తేజ, ఈఈఈ విభాగాధిపతి వెంకటేష్,జగదీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

## ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ

# రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ ధర్నాలపై పోలీసు దాడులు, అక్రమ కేసులు

**హైదరాబాద్, జులై 6, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పాఠశాల విద్య సమస్యలు పరిష్కారం చేయాలని, పెండింగ్ స్కాలర్ షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్స్ విడుదల చేయాలని,ఫీజుల నియంత్రణ చట్టం తీసుకుని రావాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్ ధర్నాలకూడా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపు ఇస్తే ప్రభుత్వం పోలీసులతో దాడులు చేసి అక్రమ కేసులు పెడుతోందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటి అధ్యక్షకార్యదర్శులు ఎస్ రజనీకాంత్, టి.నాగరాజు ఆరోపించారు. విద్యార్థులపై సంగారెడ్డి, మహబాద్, ములుగు, కరీంనగర్, ఖమ్మం జిల్లాలోని కలెక్టరేట్ సందర్భంగా పోలీసులు తీవ్ర నిర్బంధం ప్రయోగించారని తెలిపారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో పోలీసులు అత్యుత్సాహంతో విద్యార్థి నాయకులను అరెస్టు చేసి అక్రమ కేసులు బనాయించి, వివిధ సెక్షన్లు పెట్టి కేసులు నమోదు చేసి బైండోవర్ చేశారనీ ఆవేదన చెందారు. ప్రజాపాలన పేరుతో ప్రజాస్వామ్య పరిరక్షణ మా ధ్యేయం అన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదు, ఇచ్చిన హామీలను అమలు చేయమంటే కేసులు, నిర్బంధం ప్రయోగిస్తుందనీ అన్నారు. కార్పొరేట్ తరహాలో రెండు జతలు యూనిఫామ్ ఇస్తామని యూనిఫామ్ ఇవ్వలేదని చెప్పారు. ఇంటర్ విద్యార్థులకు 2 నెలలు గడుస్తున్నా పాఠ్యపుస్తకాలు ఇవ్వలేదనీ ఆరోపించారు. రూ 10,800 కోట్లు పెండింగ్ స్కాలర్ షిప్స్ ఇవ్వకుండా, జీ.వో.నం. 7,8,9 తెచ్చి ఫీజులు పథకం ఎత్తివేయాలని కుట్రలు చేస్తోందనీ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఫీజులు నియంత్రణ చేయకుండా లక్షలాది రూపాయలు దండుకుంటున్న కనీసం స్పందించడం లేదు, మౌలికసదుపాయాలు లేక, మధ్యాహ్నం భోజనంలో నాణ్యత లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడు తున్న కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించడం లేదనీ అన్నారు. ఈ సమస్యలు పరిష్కారం చేస్తామని, తానే విద్యాశాఖ మంత్రిని అని ప్రకటించిన రేవంత్ రెడ్డి పట్టించుకోకుండా వ్యవరిస్తున్నారని వారు అన్నారు. తక్షణమే రాష్ట్ర వ్యాప్తంగా అక్రమంగా అరెస్ట్ చేసిన ఎస్ఎఫ్ఐ నాయకులను భేషరతుగా విడుదల చేసి అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. నిర్బంధం ప్రయోగిస్తే మరింతగా రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థిరంగ సమస్యలపై పోరాడతామని తెలిపారు. అక్రమకేసులు, అరెస్టులు, నిర్బంధాలను మేధావులు, ప్రజాస్వామిక వాదులు, విద్యార్థులు ఖండించాలని పిలుపు నిచ్చారు.

## ఆస్తి పంపకాల వివాదం..

## కుటుంబ కలహాలతో మనస్తాపం

# భార్యకు విడియోకాల్ చేస్తూ ఆత్మహత్య

**ఉమ్మడి వరంగల్ జిల్లా బ్యూరో, జులై 6, ప్రభాతవార్త:** హన్మకొండ జిల్లా కాజీపేట వద్ద రాజేశ్‌నాయక్ (45) అనే డాక్యుమెంట్ రైటర్ ఆదివారం రాత్రి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. భార్యకు విడియో కాల్‌చేసి తాను బలవన్మరణానికి పాల్పడుతున్న విషయాన్ని లైవ్‌లో చూపిస్తూ ఆయన ఈ దారుణానికి ఒడిగట్టారు. ఘటన జిల్లావ్యాప్తంగా సంచలం రేకెత్తించింది. ఘటన పూర్తి వివరాలిలా ఉన్నాయి. మృతుడు రాజేశ్‌నాయక్ (45) వరంగల్ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో డాక్యుమెంట్ రైటర్. కాజీపేట రైల్వేస్టేషన్ సమీపంలో నివాసం ఉంటున్నాడు. ఆస్తి పంపకాల విషయంలో భార్య, తల్లిదండ్రులు, కుటుంబసభ్యుల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. దీంతో ఆదివారం రాత్రి భార్యతో తీవ్రవాగ్వాదం జరగడంతో మనస్తాపం చెందిన రాజేశ్‌నాయక్ ఇల్లు వదిలి బయటకువచ్చాడు. రైల్వేట్రాక్ వద్దకు చేరుకుని భార్యకు విడియో కాల్ చేసి, ఆత్మహత్య చేసుకుంటున్నట్లు లైవ్‌లో చూపించి రైలుకింద పడ్డారు. తొలుత ఆమె దీనిని బెదరింపుగానే భావించింది. రాజేశ్ రాత్రంతా ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు వెతకగా, సోమవారం ఉదయం మృతదేహం లభ్యమైంది. జీఆర్పీ పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ తర్వాత సంస్థాగత పదవులు

## ఇందిరా భవన్‌లో జిల్లా ఒబిసి అబ్జర్వర్లకు రాష్ట్ర స్థాయి శిక్షణ శిబిరం

**హైదరాబాద్, జులై 6, ప్రభాతవార్త :** ప్రత్యేక ఓటర్ల జాబితా సమగ్ర సవరణ అనంతరం టిపిసిసి ఒబిసి విభాగంలో సుమారు పది వేల వరకు సంస్థాగత పదవులు కల్పించే దిశగా పార్టీ కార్యాచరణ రూపొందిస్తోందని టిపిసిసి ఒబిసి విభాగం చైర్మన్ వీర్లపల్లి శంకర్ ప్రకటించారు. హైదరాబాద్‌లోని ఇందిరా భవన్‌లో ఒబిసి రాష్ట్ర కన్వీనర్ డాక్టర్. కేతూరి వెంకటేష్ అధ్యక్షతన తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఒబిసి విభాగం ఆధ్వర్యంలో నూతనంగా నియమితులైన జిల్లా ఒబిసి అబ్జర్వర్లకు రాష్ట్ర స్థాయి ఒక్క రోజు శిక్షణ శిబిరం సోమవారం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి ఒబిసి విభాగం కన్వీనర్ జూలూరు ధనలక్ష్మి, రాష్ట్ర ఒబిసి నాయకులు రాజేష్ షామీర్‌పేట్ (రాష్ట్ర అబ్సర్వర్ కోఆర్డినేటర్), అలోక్ నాథ్, అరుణ్ కుమార్ గౌడ్, మేకల వీరన్న యాదవ్,బెండే శ్రీకాంత్, ముత్తినేని రవి కుమార్, చరణ్ గౌడ్, సుధాకర్, తదితరలు నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వీరపల్లి శంకర్ మాట్లాడుతూ,ఎస్ఐఆర్ కార్యక్రమం పూర్తయిన వెంటనే తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఒబిసి విభాగాన్ని గ్రామం నుంచి రాష్ట్ర స్థాయి వరకు పటిష్టం చేసే భారీ సంస్థాగత నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు. గ్రామ, మండల, నియజకవర్గం,జిల్లా, రాష్ట్ర స్థాయిలలో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి, అధ్యక్షులు, చైర్మన్లు, ఉపాధ్యక్షులు, కోఆర్డినేటర్లు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, సభ్యులు తదితర అన్నిరకాల హోదాలను భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. ఒబిసిల అభ్యున్నతి కోసం అంకితభావంతో పనిచేయాలనే ఆసక్తి ఉన్న కార్యకర్తలు, యువత, సామాజిక సేవకులకు ఈ కమిటీలలో ప్రాధాన్యం కల్పిస్తామని తెలిపారు. ఎస్ఐఆర్ కార్యక్రమం పూర్తైన అనంతరం రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తి కలిగిన కార్యకర్తల వివరాలను జిల్లా ఒబిసి అబ్జర్వర్ల ద్వారా సేకరించి, అర్హత, సేవాభావం, చురుకుదనం ఆధారంగా కమిటీల్లో బాధ్యతలు అప్పగించనున్నట్లు స్పష్టం చేశారు.రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గం నుంచి హాజరైన జిల్లా ఒబిసి అబ్జర్వర్లకు సంస్థాగత నిర్మాణం, బాధ్యతలు, సమన్వయం, సభ్యత్వ నమోదు, క్షేత్రస్థాయి కార్యాచరణ, ఒబిసి ల సంక్షేమ కార్యక్రమాలపై సమగ్ర అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అన్ని జిల్లాల ఒబిసి అబ్జర్వర్లు పాల్గొని విజయవంతం చేశారు.

# రియాద్‌కు నేరుగా రోజువారీ విమాన సర్వీసులు

## ఫ్లైదీల్‌కు స్వాగతం పలికిన అంతర్జాతీయ విమానాశ్రయం అధికారులు




హైదరాబాద్-రియాద్ విమాన సర్వీసుకు స్వాగతం పలుకుతున్న అధికారులు

**శంషాబాద్ జులై 6, ప్రభాతవార్త :** జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ (జిహెచ్ఐఎల్), సాదియా గ్రూప్‌కు చెందిన వేగంగా అభివృద్ధి చెందుతున్న తక్కువ ధరల విమానయాన సంస్థ ఫ్లైదీల్ తొలి హైదరాబాద్-రియాద్ విమాన సర్వీసుకు ఘన స్వాగతం పలికింది. ఈ సర్వీస్‌తో ఫ్లైదీల్ భారతీయ విమానయాన మార్కెట్‌లో అధికారికంగా ప్రవేశించింది. హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న తొలి విమానానికి జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ సీఈఓ కదిర్ కదిరవన్, జీహెచ్ఐఏఎల్‌కు చెందిన ఇతర సీనియర్ అధికారులు, ఫ్లైదీల్ చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ లాయిడ్‌జో మిస్కిట్టా, ఫ్లైదీల్ హెడ్ ఆఫ్ ఎయిర్‌పోర్ట్ ఆపరేషన్స్ అబ్దుల్‌రహ్మాన్ అల్‌రషీద్ హాజరై స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జీఎంఆర్ సిఇఒ కదిర్ కదిరవన్ మాట్లాడుతూ.. ఈ పరిణామం హైదరాబాద్ విమానాశ్రయాన్ని అభివృద్ధి చెందుతున్న అంతర్జాతీయ విమానయాన కేంద్రంగా మరింత బలోపేతం చేయడంతో పాటు, భారత్- సౌదీ అరేబియా మధ్య వైమానిక అనుసంధానాన్ని మరింత విస్తరించనుందని ప్రపంచ విమానయాన రంగం వేగంగా మారుతున్న పరిస్థితులు, ఇంధన సంబంధిత సవాళ్ల మధ్య కూడా హైదరాబాద్ విమానాశ్రయం తన వ్యూహాత్మక దూరదృష్టి, స్థిరత్వాన్ని మరోసారి చాటుకుంది. సాదియా గ్రూప్‌కు చెందిన వేగంగా అభివృద్ధి చెందుతున్న తక్కువ ధరల విమానయాన సంస్థ ఫ్లైదీల్‌ను కొత్త ఎయిర్‌లైన్ భాగస్వామిగా చేర్చుకోవడం ద్వారా, భారత్‌కు కీలకమైన అంతర్జాతీయ ప్రవేశ ద్వారంగా తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకుంది. ఫ్లైదీల్ ఎయిర్‌బస్ ఎ320 విమానాలతో రియాద్- హైదరాబాద్- రియాద్ మార్గంలో వారానికి ఏడు రోజులూ (రోజువారీ) సర్వీసులను నిర్వహించనుందని తెలిపారు. భారతీయ మార్కెట్‌లో తొలి అడుగు వేస్తున్న ఫ్లైదీల్‌కు హైదరాబాద్‌లో స్వాగతం పలకడం మాకు ఎంతో ఆనందంగా ఉంది. రియాద్‌కు ఈ కొత్త నేరుగా విమాన సర్వీస్ మా ఎయిర్‌లైన్ భాగస్వామ్య నెట్‌వర్క్‌లో మరో కీలక చేరుకున్నట్లు తెలిపారు. ఇది మా మధ్యప్రాచ్య కనెక్టివిటీని గణనీయంగా బలోపేతం చేయడంతో పాటు, ప్రపంచ స్థాయి విమానయాన కేంద్రంగా హైదరాబాద్ విమానాశ్రయానికి పెరుగుతున్న ప్రాధాన్యతను ప్రతిబింబిస్తుందని తెలిపారు.

# బండి భగీరథ్ బెయిల్‌పై హైకోర్టులో ముగిసిన వాదనలు

## తీర్పు రిజర్వ్

**హైదరాబాద్, జులై 6, ప్రభాతవార్త:** మైనర్ బాలికపై లైంగిక దాడి ఘటనకు సంబంధించి పేట్‌బషీరాబాద్ పోలీసుస్టేషన్‌లో నమోదైన పోక్సో కేసులో అరెస్టయి చర్లపల్లి జైల్లో రిమాండులో ఉన్న బండి భగీరథ్ బెయిల్ పిటిషన్‌పై హైకోర్టులో వాదనలు ముగిశాయి. దీనిపై తీర్పును న్యాయస్థానం రిజర్వ్ చేసింది. పోక్సో కేసులో అరెస్టయి నెలన్నరకుపైగా జైల్లో వున్న బండి భగీరథ్ వారంరోజుల క్రితం తనకు బెయిల్ మంజూరు చేయాలని హైకోర్టును కోరడం తెలిసిందే. తనపై నమోదైన పోక్సో కేసు రాజకీయ కుట్రలో భాగమని, తాను అమాయకుడినని, ఎలాంటి తప్పు చేయలేదని అతను పేర్కొనడం విదితమే. అక్రమంగా నమోదైన కేసులో తనకు వెంటనే బెయిల్ మంజూరు చేయాలని అతను కోరగా దీనిపై గత బుధవారం మొదలైన విచారణ ఇప్పటివరకు రెండుసార్లు జరగగా సోమవారం ఉదయం మరోసారి హైకోర్టు విచారించింది. రెండవ దఫా విచారణ గత శుక్రవారం జరగగా ఇందులో పోలీసులు కౌంటర్ దాఖలు చేశారు. బండి భగీరథ్ అమాయకుడు కాదని, నిందితుడని, ఈ కేసులో అతను నేరం చేశాడనడానికి ఆధారాలు వున్నాయని పోలీసులు వెల్లడించారు. ఈ కేసులో అతనికి బెయిల్ ఇస్తే సాక్ష్యాలు తారుమారయ్యే ప్రమాదం వుందని, బాధితురాలిని బెదరించే వీలుందని పోలీసులు తెలిపారు. మొదట ఇది చిన్న కేసుగా అనుకున్నా బాధితురాలి వాంగ్మూలం తరువాత ఆధారాలు పక్కాగా వుండంతో పోక్సో కేసుగా మార్చినట్లు పోలీసులు వెల్లడించారు. కాగా తాజా విచారణలో బాధితురాలి తరపు న్యాయవాది హైకోర్టుకు హాజరై వాదనలు వినిపించారు. ఈ కేసులో నిందితుడు కేంద్రమంత్రి తనయుడని, మైనర్ బాలికపై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడని, ఈ సమయంలో అతనికి బెయిల్ ఇవ్వడం సరైంది కాదని ఆయన వాదించారు. ఈ కేసులో ఇంకా సాక్షులను విచారించాల్సి వుందని, ఈ తరుణంలో బెయిల్ లభిస్తే నిందితుడు వారిని ప్రభావితం చేసే వీలుందని బాధితురాలి తరపు న్యాయవాది తెలిపారు. నిందితుడు జైల్లో వున్న సమయంలోనే ఈ కేసు విచారణ సవ్యంగా, పారదర్శకంగా జరుగుతుందని ఆయన కోర్టుకు తెలిపారు. ఇరుపక్షాల వాదనలు విన్న హైకోర్టు న్యాయమూర్తి బండి భగీరథ్ బెయిల్‌పై తీర్పును రిజర్వ్ చేశారు.


# 'హార్పిక్' ఇంజక్షన్‌తో భర్త ప్రాణం హరించింది..

## నిజామాబాద్‌లో దారుణం.. నిందితుల అరెస్టు

**హైదరాబాద్, జులై 6, ప్రభాతవార్త:** నిజామాబాద్‌లో దారుణం వెలుగు చూసింది. వివాహేతర సంబంధం కారణంగా భర్తను ఓ మహిళ కిరాతకంగా చంపేసింది. ఈ క్రమంలో మొదట.. భర్తను భవనం పైనుంచి కిందకు తోసి, ఆ తరువాత ఏమీ ఎరగనట్లు ఆస్పత్రిలో చేర్పించి అక్కడ బాత్‌రూంలో వాడే హార్పిక్ లిక్విడ్‌ను నరాల్లో ఇంజక్షన్ చేసి దారుణంగా చంపింది. ఇందుకు తన ప్రియుడు, అతని స్నేహితుడి సహకారం తీసుకుంది. అయితే ఈ ఘటనపై పోలీసులు విచారించి అందరు నిందితులను కటకటాల్లో నెట్టారు. వివరాలు ఇలా వున్నాయి. నిజామాబాద్‌లోని న్యాల్కల్‌కు చెందిన ప్రశాంత్ ఉద్యోగం కోసం గల్ఫ్ దేశం దుబాయ్‌కి వెళ్లగా ఇక్కడ అతని భార్య మరొకరితో వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఇటీవలే ప్రశాంత్ దుబాయ్ నుంచి తిరిగి రాగా తన భార్య భాగోతం తెలుసుకుని బుద్ధిగా మసలుకోవాలని హెచ్చరించాడు. అయితే ఈ మాటలు పట్టించుకోని ఆమె తన ప్రియుడు, అతని స్నేహితుడితో కలిసి భర్తను చంపాలని నిర్ణయించుకుంది. అక్కడ ప్రశాంత్ మద్యం పార్టీలో వుండగా భార్య వచ్చింది. అనంతరం భవనం పైనుంచి ప్రశాంత్‌ను వారు కిందకు తోసేశారు. ఈ ఘటనలో ప్రశాంత్ తీవ్రంగా గాయ పడగా వెంటనే ఆస్పత్రికి తరలించారు. ప్రభుత్వ ఆస్పత్రి నుంచి మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు ఆస్పత్రికి ప్రశాంత్‌ను తరలించిన భార్య అక్కడ ఎవరికి అనుమానం రాకుండా గ్లూకోజ్ బాటిల్‌లో హార్పిక్ లిక్విడ్‌ను ఇంజక్షన్‌లో ఎక్కించింది. దీంతో ప్రశాంత్ ఆస్పత్రిలో చనిపోయాడు. మొదట ఈ ఘటన ప్రమాదంగానే భావించిన పోలీసులు ఆ తరువాత అనుమానం చెంది వారిని విచారించగా అసలు విషయం బయటపడింది. దీంతో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టుచేసి రిమాండుకు తరలించారు.

# ఎసిబి వలలో చేర్యాల తహశీల్దార్

## రూ.70వేలు లంచం తీసుకుంటుండగా పట్టుబడిన వైనం



లంచం తీసుకుంటుండగా పట్టుబడిన తహశీల్దార్ దిలీప్‌నాయక్

**చేర్యాల, జులై 6, ప్రభాతవార్త:** చేర్యాల మండల తహశీల్దారు రూ.70వేలు లంచం తీసుకుంటుండగా ఏసిబి అధికారులు పట్టుకున్నారు. సోమవారం చేర్యాల తహశీల్దారు కార్యాలయంలో ఏసిబి అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. చేర్యాల మండలంలోని నాగపురి గ్రామ పరిధిలోని ఓ సర్వే నెంబర్లలోని మొత్తం 30 గుంటల భూమికి సంబంధించిన 11 నాలా కన్వర్షన్ దరఖాస్తులను ప్రాసెస్ చేసి అధికారిక అనుమతులు మంజూరు చేయడానికి తహసీల్దార్ లంచం డిమాండ్ చేసినట్లు తెలిపారు. ఈ దరఖాస్తుల్లో ఇప్పటికే 8 దరఖాస్తులు ప్రాసెస్ చేయగా మిగిలిన ప్రక్రియ పూర్తి చేయడానికి రూ.70 వేల లంచం కోరినట్లు విచారణలో తేలిందని తెలిపారు. ఫిర్యాదుదారుడు జూన్ 28న ఏసిబి అధికారులను సంప్రదించడంతో పక్కా ప్రణాళికతో ఏసీబీ అధికారులు ఉచ్చుపన్ని తహసీల్దార్ కార్యాలయంలోనే సోమవారం రూ.70 వేల లంచం స్వీకరిస్తున్న సమయంలో దాడి చేసి పట్టుకున్నారు. అనంతరం ఆయన వద్ద నుంచి లంచం నగదును స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగిగా తన విధులను నిజాయితీగా నిర్వర్తించాల్సిన తహసీల్దార్ అధికారిక పనిని చేయడానికి అక్రమంగా లంచం డిమాండ్ చేసి స్వీకరించడం ద్వారా అవినీతికి పాల్పడినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. ఈ కేసులో తహసీల్దార్‌ను అరెస్టు చేసి హైదరాబాద్‌లోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరచనున్నట్లు వెల్లడించారు.

వార్త

అనేక విత్తనాలను విత్తడం ద్వారా ఏ విధంగా నేల సారవంతమౌతుందో అలాగే రకరకాల విషయాలను పరిశీలించడం ద్వారా మనసు వికసిస్తుంది.

- జెఫర్సన్

# అడుగంటుతున్న భూగర్భజలాలు!


నీటిని నీలి బంగారం అంటారు. వాస్తవంగా చెప్పాలంటే అసలు బంగారం కన్నా నీలి బంగారమే అత్యంత విలువైనది. గొంతు తడారిపోతున్న వ్యక్తికి కావల్సింది గుక్కెడు నీళ్లే తప్ప బండెడు బంగారం కాదు. దేశంలో ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో భూగర్భమట్టాలు దిగజారిపోతున్నాయి. యేటేటా భూగర్భజలాల వినియోగం పెరిగిపోతుందనేందుకు ఊహించని రీతిలో పెరిగిపోతున్న బోరుబావుల సంఖ్యనే ఉదహరించవచ్చు. భూగర్భజలాల వాడకం దాదాపు ఎనభైశాతం వ్యవసాయానికి, పదిహేను శాతం పరిశ్రమలకు, తాగునీటి అవసరాలు తీర్చుకోవడానికి వినియోగించుకుంటున్నారు. వినియోగం నానాటికీ తీవ్రస్థాయిలో పెరుగుతున్నప్పటికీ ఆ మేరకు భూగర్భజలాల భర్తీకి గట్టిప్రయత్నాలు జరగకపోవడంతో మట్టాలు భారీగా పడిపోతున్నాయి. ఈసారి పసిఫిక్ మహాసముద్రంలో బలపడుతున్న సూపర్ ఎల్‌నినో కారణంగా వాతావరణ సంక్షోభంతో భారత్‌లో నీటి సమస్య తీవ్రరూపం దాల్చే పరిస్థితులు ఏర్పడబోతున్నట్లు వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. సూపర్ ఎల్‌నినోగా మారడం అత్యంత ప్రమాదకరంగా అంచనాలు వేస్తున్నారు. దేశంలో నైరుతి రుతుపవనాలను అడ్డుకొని వర్షపాతాన్ని బాగా తగ్గించే అవకాశాలు ఉన్నట్లు చెబుతున్నారు. ఈ పరిస్థితులు వచ్చే యేడాదిలోనూ కొనసాగుతాయని అంచనా వేస్తున్నారు. మొత్తం మీద ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం బాగాపడిపోయే ప్రమాద సంకేతాలు అయితే వెలువడుతున్నాయి. భారతదేశం సాగులో యాభైరెండు శాతానికిపైగా వర్షాధారం మీదనే ఆధారపడి ఉంది. ఈ పరిస్థితుల్లో రుతుపవనాల ప్రభావం ఎల్‌నినోతో తగ్గుముఖం పట్టడంతో వ్యవసాయ రంగం ప్రమాదంలో పడుతుందనే హెచ్చరికలు వెలువడుతున్నాయి. భారత్‌లో 1951 నుంచి ఎల్‌నినో ఏర్పడిన సంవత్సరాల్లో దాదాపు అరవైశాతం లోటుతోనో లేక సాధారణం కన్నా తక్కువ వర్షపాతం నమోదై వ్యవసాయరంగంపై ప్రభావం చూపింది. ఈ యేడాది చివరినాటికి బలమైన ఎల్‌నినో ఏర్పడనున్నట్లు చెబుతున్నారు. 1950 నుంచి ఇప్పటి వరకు ప్రపంచంలో 1982, 1991, 1997, 2015లలో సూపర్ ఎల్‌నినోలు వచ్చాయి. నైరుతిలో భారత్ తక్కువ వర్షపాతం నెలకొంటుందని, తూర్పు, పడమర, గాలి వలయం తేమతో కూడిన గాలి పైకి వెళ్లకుండా అణచివేయడంతో అటు నైరుతి రుతుపవనాల ప్రభావం తగ్గి వర్షపాతం పడిపోతుందని చెబుతున్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టిపెట్టాలని రైతులకు పాలకపెద్దలు సూచనలు ఇస్తున్నారు. ప్రపంచంలో ఎక్కడలేని విధంగా దాదాపు మూడువందల కిలో ఘనపు మీటర్ల మేర భూగర్భజలాలను భారత్‌లో వినియోగించుకుంటున్నారు. దేశంలో ఆరువేల ఐదువందల డెబ్బైరెండు భూగర్భజలాల బ్లాకులుండగా వీటిలో మూడోవంతు బ్లాకుల్లో అవసరానికి మించి భూగర్భజలాలను తోడేస్తున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే మిగతా బ్లాక్‌ల పరిధిలోకి చేరుకొని దేశంలో భూగర్భజలాలు మరింత అడుగంటిపోయే ప్రమాదం ఉంది. భారత్‌లో బోరుబావుల సంఖ్య ఇప్పటికీ గత ఏడు దశాబ్దాల్లో 180 రెట్లకుపైగా పెరిగింది. ఇంకా పెరుగుతూనే ఉంది. వీటివల్ల సన్నకారు, చిన్నకారు రైతులు లాభపడిన మాట వాస్తవమే అయినా నీటి సంరక్షణ పద్ధతులు పాటించకుండా నానాటికీ బోరుబావుల మీదనే అధికంగా ఆధారపడే పరిస్థితి అనేక అనర్థాలకు దారితీస్తుందని భూగర్భశాస్త్ర నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భూగర్భజలాలను వృధా చేయడం నానాటికీ పెరిగిపోతున్నది. పంజాబ్‌లో డెబ్బైశాతం, రాజస్థాన్‌లో అరవైశాతం, కర్ణాటక, తమిళనాడుల్లో నలభైశాతం పైగా భూగర్భజలాలు వాడుతున్నారు. ముఖ్యంగావిద్యుత్ సబ్సిడీలు ఉచితంగా ఇస్తున్న రాష్ట్రాల్లో నీటి వినియోగం తారాస్థాయికి చేరుకున్నదనే చెప్పొచ్చు. ఇదే పరిస్థితి కొనసాగితే మరో రెండు దశాబ్దాల్లో దేశవనరుల్లో అరవైశాతానికిపైగా హరించుకుపోతాయని గతంలో ప్రపంచబ్యాంకు నివేదిక హెచ్చరించింది. దేశంలో అధిక శాతం జిల్లాలో భూగర్భజలాలు తాగుయోగ్యమైనవి కావని కేంద్రం అంగీకరించడం కలవరపరిచే పరిణామం. గతంలో పార్లమెంటులోనే ఒక ప్రశ్నకు సమాధానం చెబుతూ ప్రభుత్వం తెలిపిన వివరాల ప్రకారం 254 జిల్లాల్లో భూగర్భజలాల్లో ఇనుము, 224 జిల్లాల్లో ఫ్లోరైడ్, 162 జిల్లాల్లో క్షారత, 34 జిల్లాలోని భూగర్భజలాలల్లో పాషాణం స్థాయి అధిక శాతంలో ఉన్నదనే విషయం వెలుగుచూసింది. రాజస్థాన్, కర్ణాటక, గుజరాత్ రాష్ట్రాల్లో పరిస్థితి మరింత తీవ్రంగా ఉంది. ముఖ్యంగా పాషాణం లాంటిలోహాలను భూగర్భ జలాల నుంచి తొలగించడం కష్టంగా మారిందని అధికార వర్గాలే అంగీకరిస్తున్నాయి. ఇక కొన్ని పరిశ్రమలు ప్రధానంగా శీతల పానీయాలు, మద్యం తయారీ కంపెనీలు భారీ స్థాయిలో భూగర్భజలాలను వినియోగించుకుంటున్నాయి. దేశవ్యాప్తంగా మున్సిపాలిటీల్లో కూడా వాడకం పెరిగిపోతున్నది. పాలకుల్లో చిత్తశుద్ధి, ప్రజల్లో అవగాహన లోపించిన కారణంగా భూగర్భజలాలసమస్య రోజురోజుకు తీవ్రరూపం దాలుస్తుందనే విమర్శలను కొట్టి వేయలేం. సూపర్ ఎల్‌నినో కారణంగా భూగర్భ జలాల సమస్య మరింత పెరిగే అవకాశాలున్నాయి. దేశవ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలు పడరానిపాట్లు పడుతున్నారు. దాహం తీర్చుకునేందుకు అందుబాటులో ఉన్న కలుషితనీరు తాగి రోగాల బారిన పడుతున్నారు. స్వాతంత్య్రం వచ్చి ఎనిమిది దశాబ్దాలు కావస్తున్నా ఇప్పటికీ ప్రజలందరికీ కనీస అవసరమైన గుక్కెడు స్వచ్ఛమైన మంచినీరు అందించలేని దురదృష్టపు పరిస్థితుల్లో ఉన్నాం.

ఓరిమికి అపారమైన శక్తి ఉంది. దండించే అధికారం ఉన్నా దండించకపోవడం నిజమైన ఓర్మి.



ఎమ్.కె. గాంధీ

కృతజ్ఞత అన్నది గొప్పగా అలవర్చుకున్న గుణాల ఫలం. దీనిని మనం మోటు మనుషులలో చూడలేం. అంత నాజూకైంది.



శామ్యూల్ జాన్సన్

## ప్రజావాక్కు



### డిజిటల్ ట్రాకింగ్ అవసరం

నగరాల్లోని హోటళ్లు, రెస్టారెంట్లలో తరచూ వెలుగుచూస్తున్న ఆహార భద్రతా ఉల్లంఘనలు ప్రజారోగ్యంపై తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. గడువు ముగిసిన ఆహార పదార్థాలవినియోగం, అపరిశుభ్రమైన వంటగదులు, పురుగుల సమస్య, కృత్రిమ రంగుల వాడకం వంటి ఘటనలు వినియోగదారుల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెడుతున్నాయి. లాభాల కోసం ప్రాథమిక పరిశుభ్రత ప్రమాణాలను విస్మరించడం ఏమాత్రం సమర్థనీయం కాదు. ఆహార నాణ్యతలో చిన్న నిర్లక్ష్యంకూడా తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీసే అవకాశం ఉంది. అప్పుడప్పుడు నిర్వహించే ఆకస్మిక తనిఖీలతో మాత్రమే ఈసమస్యకు శాశ్వత పరిష్కారం లభించదు. ఆహార భద్రతాశాఖ నిరంతర పర్యవేక్షణ, శాస్త్రీయ నమూనా పరీక్షలు, డిజిటల్ ట్రాకింగ్ వ్యవస్థలను మరింత బలోపేతం చేయాలి. ప్రతి హోటల్, రెస్టారెంట్ బయట పరిశుభ్రత రేటింగ్‌ను స్పష్టంగా ప్రదర్శించడం తప్పనిసరి చేయాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### పెరిగిన ఫీజుల భారం

విద్యార్థుల భవిష్యత్తుకు విద్య ఎంతో ముఖ్యమైనది. విద్య మన సమాజ అభివృద్ధికి పునాది. అయితే ఇటీవలికాలంలో పెరుగుతున్న ఫీజులు మధ్యతరగతి దిగువమధ్య తరగతి తల్లిదండ్రులకు ఆర్థిక భారంగా మారుతున్నాయి. పిల్లలకు మంచి విద్య అందించాలనే ఆశతో కుటుంబాలు తమ సామర్థ్యానికి మించి ఖర్చు చేయాల్సివస్తోంది. నాణ్యమైన విద్య అందరికీ అందుబాటులో ఉండాలంటే ఫీజుల విషయంలో సమతుల్యత అవసరం. విద్యాసంస్థలు, ప్రభుత్వం, తల్లిదండ్రులు కలిసి విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ముందుకు సాగాలి. సామాజిక బాధ్యతలో భాగంగాకార్పొరేట్ విద్యాసంస్థలు ఫీజుల భారం తగ్గించే దిశగా ఆలోచించాల్సిన అవసరం ఉంది. విద్య హక్కుగా అందరికీ చేరేలా తగిన నియంత్రణలు, సహాయక చర్యలు అవసరం.

- ఎన్. కృష్ణ, హైదరాబాద్

### బెదరింపులు ఆపాలి

కొందరు రాజకీయ నాయకుల, ప్రజా ప్రతినిధుల, రాజకీయ అండతో, పలుకుబడితో భూమి కబ్జాలు, రోడ్లు ఆక్రమించి, ప్రజలను బెదరించి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. ఇలా చేయడంవల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వీరిపై పోలీస్ శాఖ ద్వారా కౌన్సిలింగ్ చేయాలి.

-కె. శ్రీనివాస్, వరంగల్

### సమన్వయంతో పనిచేయాలి

ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితులు, యుద్ధ వాతావరణాలు నెలకొన్నప్పటికీ భారత్ అభివృద్ధిపథంలో స్థిరంగా ముందుకు సాగుతోందని నీతి ఆయోగ్ సమావేశంలో ప్రధానమంత్రి పేర్కొనడం ఆశాజనక పరిణామం. వికసిత భారత్‌లక్ష్య సాధనలో ఆర్థిక సంస్కరణలు, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు, యువత సాధికారత, మహిళల భాగస్వామ్యం, సహకార సమాఖ్య వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తాయని ఆయన స్పష్టం చేశారు. ఈ దిశగా కేంద్రం, రాష్ట్రాలు సమన్వయంతో పనిచేస్తే దేశం ప్రపంచ వేదికపై మరింత బలంగా నిలబడగలదు. మహిళల ఆధ్వర్యంలోని అభివృద్ధే వికసిత భారత్‌కు పునాదిగా మారుతుందని ప్రధాని చెప్పిన మాటల్లో గొప్ప దూరదృష్టి కనిపిస్తోంది. వ్యవసాయం, వ్యాపారం, శాస్త్రసాంకేతిక రంగాలు, నవీన ఆవిష్కరణలలో మహిళలు విశేష ప్రతిభ కనబరుస్తున్నారు. మహిళ ఆర్థికంగా, సామాజికంగా ఎదిగితే కుటుంబం బలపడుతుంది.

- ఎం.నారాయణస్వామి, మహబూబ్‌నగర్‌జిల్లా

### ప్రమాదకరంగా రోడ్డు ప్రయాణాలు

వాతావరణ మార్పులతో ఇటీవల కాలంలో తీవ్రమైన ఈదురు గాలులతో కూడిన వర్షాలు పడుతుండడంతో గ్రామీణ రోడ్ల వెంట ప్రయాణాలు ప్రమాదకరంగామారుతున్నాయి. తరుచుగా చెట్ల కొమ్మలు విరిగి రోడ్లపై పడుతుండడం, విద్యుత్ స్తంభాలు విరిగి పడుతుండడంతో కరెంట్ తీగలు తెగి రోడ్లు ప్రమాదకరంగా మారుతున్నాయి. గ్రామస్థాయిలో అధికారులు వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండి ఇలాంటి పరిస్థితులలో వెంటనే రోడ్లపై ఉన్న చెట్లను తొలగించే విధంగా చర్యలు చేపట్టాలి. విద్యుత్ శాఖవారు విద్యుత్ వైర్లు తెగిన చోట ప్రమాదాలు జరగకుండా తగిన హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి మరమ్మత్తులుచేయాలి. వానాకాలంలో రోడ్లవెంట ప్రమాదాలు జరగకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి.

- టి. యోగేందర్, నల్లగొండ జిల్లా

### ఫోన్లలోనే..మానవ సంబంధాలు

నేడు సమాజంలో మనుషులు అవసరం ఉంటేనే ఫోన్లు చేస్తున్నారు. నేరుగా కలుస్తున్నారు. అవసరం లేకుంటే అర సంవత్సరం అయినా అర్సుకోరు ఎలాఉన్నారు. పరిస్థితులు ఏంటి అని. అంత సమయంలేని జీవితం గడుపుతున్నారు మరి సమాజం. కేవలం అవసరం ఉంటేనే గుర్తుకొస్తారా? కొంచెం సమయం కూడా కేటాయించలేకపోతున్నారు. భవిష్యత్తులో కేవలం మెసేజ్‌లు మాత్రమే చేస్తారేమో అని భయమేస్తుంది.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# ప్రశ్నార్థకంగా మారుతున్న ప్రయాణికుల భద్రత!

ప్రభుత్వాల ఈ.విపాలసీ ఫలితంగా పరిశ్రమకూ, ఔత్సాహికులైన కొనుగోలు దారులకు అందుబాటులో ఉన్న ప్రోత్సాహకాలు, రాయితీల నేపథ్యంలో భారీ మొత్తంలో ఇ.విలు రోడ్ల పైకి వస్తున్నాయి. ఐతే ఆశ్చర్యకరంగా వాటిని నిరంతరం ఉపయోగించడానికి అవసరమైన మేరకు రీచార్జ్ చేయడానికి కావలసిన సంఖ్యలో ఫ్యూయల్ ఫిల్లింగ్ స్టేషన్లు లేకపోవడం వాటి వినియోగానికి ప్రధాన అవరోధంగా మారుతున్నది. విద్యుచ్ఛక్తి వాహనాల కొనుగోలుకు ఆర్థిక సదుపాయాన్ని సమకూరుస్తున్న ప్రైవేట్ ఫైనాన్సర్‌లు కొనుగోలుదారులు వాయిదాలను చెల్లించనప్పుడు రిమోట్ ద్వారా బ్యాటరీ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను హ్యాక్ చేసి ఇ.విలను లాక్ చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఒక వేళ అదే నిజమైతే ఇలాంటి సాంకేతికత ఉగ్రవాదులు, దేశద్రోహుల చేతుల్లోకి వెళ్తే ప్రయాణీకుల భద్రతతోపాటు దేశ భద్రతకు పెనుప్రమాదం వాటిల్లుతుందనే ఉద్దేశంతో వీటికి సంబంధించిన కొన్ని యాప్‌లను డిజిటల్ ప్లాట్‌ఫాంల నుండి బ్లాక్ చేయాలని ఆదేశాలు జారీచేయడం కోసం కేంద్ర ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు నేషనల్ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి.



డాక్టర్ నీలం సంపత్

ఆధునిక మానవులు సాధిస్తున్న అద్భుతమైన సాంకేతిక ప్రగతి, ప్రతిఫలంగా అభివృద్ధిలో అప్రతిహతంగా ముందుకు సాగుతున్న ఆటోమొబైల్ రంగ పరిశ్రమ, కోట్ల సంఖ్యలో రహదారులపై శరవేగంగా పరుగులు పెడుతున్న రకరకాల చిన్నా, పెద్ద వాహనాల మూలంగా కార్బన్ మోనాక్సైడ్ కాలుష్యంతో భూతాపం పెరుగుతోంది. సదరు వాహనాల వినియోగం కోసం సాంప్రదాయ శక్తి వనరులైన బొగ్గు, పెట్రోలియం లాంటి శిలాజ ఇంధనాల నిల్వలు రోజు రోజూ అడుగంటి పోతున్నవి. ఈ పరిస్థితులు ఇలాగే కొనసాగితే సాంప్రదాయ శక్తి వనరుల కొరతతో ఆటోమొబైల్ రంగం అంతరించిపోయే ప్రమాదమున్నది. ఫలితంగా దేశ ఆర్థికాభివృద్ధికి ఇరుసుగా కొనసాగుతున్న ఉపరితల రవాణా రంగం పెను ప్రమాదంలో చిక్కుకోక తప్పదు. తదనంతర పరిణామాల నేపథ్యంలో దేశ ప్రజల మనుగడే ప్రశ్నార్థకంగా మారుతుంది. ఈ విపత్తు నుండి దేశ ప్రజలను కాపాడడానికి ప్రభుత్వం శిలాజ ఇంధనాలైన బొగ్గు, పెట్రోలియం ఉత్పత్తుల వినియోగానికి ప్రత్యామ్నాయంగా సాంప్రదాయేతర శక్తి వనరులైన సోలార్, విండ్ పవర్, హైడల్ పవర్, టైడల్ పవర్‌లను, బయోగ్యాస్, బయోమాస్ తదితర పునరుత్పాదక ఇంధన వనరులను వినియోగించాలనే లక్ష్యంతో ఇంధన విధానాన్ని రూపొందించి ముందుకు సాగుతున్న వైనం అభినందనీయమే. ఆధునిక మానవాళి నడవడిక, దైనందిన వ్యవహార శైలి ఫలితంగా భారీ మొత్తంలో వాహనాల వినియోగం కారణంగా కార్బన్ మోనాక్సైడ్ లాంటి విషవాయువులతో భూతాపం ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతోంది. తద్వార సౌకర్యవంతమైన ఆధునిక మానవ జీవనానికి ఊపిరులూదాల్సిన రవాణా రంగం పర్యావరణ విచ్ఛిత్తికి కారణంగా మారుతూ మానవాళి మనుగడను ప్రశ్నార్థకంగా మారుస్తున్నది. ఈనేపథ్యంలో ఐక్యరాజ్యసమితి పర్యావరణ పరిరక్షణ కోసం 17 సుస్థిరతతో కూడిన అభివృద్ధి లక్ష్యాలను గుర్తించి వాటి సాధన ప్రపంచ దేశాల బాధ్యతగా నిర్దేశించిన వైనం బహిరంగ రహస్యమే. ఉపరితల రవాణా రంగంలో పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగం, వ్యయ నియంత్రణ, కాలుష్య నివారణ, పర్యావరణ పరిరక్షణ లాంటి చతుర్ముఖ వ్యూహంతో ముందుకు సాగుతున్న మన దేశం నేషనల్ ఎలక్ట్రికల్ బస్ కార్యక్రమాన్ని ప్రారంభించి అందులో భాగంగా వివిధ కార్పొరేట్ సంస్థల నుండి టెండర్లను ఆహ్వానించింది. సదరు కేంద్ర ప్రభుత్వ పథకంలో భాగంగా టెండర్‌ని దేశంలో కమర్షియల్ ఇ.విల తయారీలో దాదాపు గుత్తాధికారిగా కొనసాగుతున్న జై భారత్ మారుతి సంస్థ (జె.బి.యమ్) సంస్థ దక్కించుకుంది. అందులో భాగంగా సెప్టెంబర్ 2023 లోనే తెలంగాణ రాష్ట్ర రవాణాశాఖకు పది సంవత్సరాల కాలపరిమితి తో 500 ఎలక్ట్రికల్ బస్సులను పంపడం గమనార్హం. సదరు బస్సులను టి.జి.యస్.ఆర్. టి.సి రాష్ట్రంలోని వివిధ బస్‌డిపోలకు పంపించడం గమనార్హం. ఆ క్రమంలో కరీంనగర్ రీజియన్‌కు 104 ఇ.వి.బస్సులు కేటాయించడం జరిగింది. ఒప్పందంలో భాగంగా ఇ.వి బస్సులను సమకూర్చడం, వాటికి డ్రైవర్లను నియామకం చేయడం, నిర్వహణలో అవసరాన్ని బట్టి తగు రిపేర్లు చేయించడం జె.బి.యమ్ సంస్థ బాధ్యతయే. ఇక తెలంగాణ రాష్ట్ర రవాణాశాఖ కండక్టర్లను నియామకం చేసుకుని ప్రయాణికుల నుండి రోజువారీ రెవెన్యూని వసూలు చేస్తుంది. తెలంగాణ రాష్ట్ర రవాణాశాఖ కిలోమీటర్‌కి రూ. 39.80 ల చొప్పున జె.బి.యమ్ యాజమాన్యానికి



చెల్లించాల్సిందే. ఎలక్ట్రిక్ వాహనాల పనితీరుని ప్రశ్నార్థకంగా మారుస్తూ వాహనాలలో ప్రయాణిస్తున్న వారిని ప్రమాదాలకు గురిచేస్తున్నది నాణ్యత లేని విదేశీ బ్యాటరీలేననేది నిపుణుల వాదన. వాహనాలు ప్రయాణాలు చేసేటప్పుడు మొరాయించడం, అగ్నికి ఆహుతవడం, భద్రతతో కూడిన ఛార్జింగ్ నియమ నిబంధనల పట్ల స్పష్టత లేకపోవడం, ఛార్జింగ్ సదుపాయాల కొరత, ఛార్జీ చేసేటప్పుడు కనెక్టర్ల సమస్యలతో పేలి పోవడం లాంటి ప్రమాద ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో నిన్నటికి నిన్న కరీంనగర్ డిపోకు చెందిన ఎలక్ట్రిక్ బస్సు ఒకటి తిమ్మాపూర్ దగ్గర క్షణాలలో కాలి బూడిదయ్యింది. రెండు మూడు రోజుల వ్యవధిలో మరో బస్సు స్థానిక బస్‌డిపో ఆవరణలోనే ఛార్జ్ చేస్తున్న సమయంలో అగ్నికి ఆహుతైంది. పై రెండు ఘటనల్లో అదృష్టవశాత్తూ ప్రాణ నష్టం జరగలేదు. ఈ దుర్ఘటనలు జరిగిన తక్షణమే తెలంగాణ రాష్ట్రంలో జె.బి.యమ్ సంస్థ టి.జి.ఆర్.టి.సి కి సమకూర్చిన 500 ఇ.వి లను తాత్కాలికంగా నిలుపుదల చేస్తూ రవాణాశాఖ ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది. మరో వైపు సదరు దురదృష్టకర సంఘటనలపై శాఖాపరమైన సమగ్ర దర్యాప్తుకు ఆదేశాలను ఇస్తూనే చైనా బ్యాటరీ టెక్నికల్ టీమ్ నేతృత్వంలో టి.జి.యస్.ఆర్.టి.సి ఇంజనీర్లబృందం జతగా నిలిపివేసిన 500 ఇ.వి.లలో 150 బస్‌లను తనిఖీచేసి అవి లోపరహితంగా వంద శాతం ఫిట్‌గా ఉన్నాయని ప్రకటించి వాటిని వాడుకలోకి తీసుకురావడం జరిగింది. ఇక మిగతా 350 ఇ.వి.ల నాణ్యతాపరంగా ఫిట్‌గా ఉన్నాయని తేలిన తర్వాతనే వాటిని రవాణాశాఖ ఉపయోగిస్తుందేమో! ఒక వేల అవి కూడా నాణ్యత పరంగా ఫిట్‌గా ఉన్నాయని తేలితే ఇ.విలు దగ్ధం కావడానికి కారణాలేమిటో మరింతలోతుగా, మరో కోణంలో అధ్యయనం కొనసాగించక తప్పదు. అధ్యయనాలు, ఫలితాలు ఎలా ఉన్నా ప్రస్తుతం ప్రజల ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని ఇ.విలలో ప్రయాణాలు చేయక తప్పదు. రాష్ట్ర రహదారుల పై భారీ మొత్తంలో వాహనాలు విడుదల చేస్తున్న కాలుష్య నివారణ చర్యల్లో భాగంగా తెలంగాణ ప్రభుత్వం ఎలక్ట్రిక్ వాహనాలను కొనుగోలు చేస్తున్న వారికి రోడ్ ట్యాక్స్, రిజిస్ట్రేషన్ ఛార్జీల మినహాయింపు, ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేక డిస్కౌంట్ మరిన్ని ప్రోత్సాహకాలు, వాయిదాల పద్ధతిలో ఋణ సదుపాయాల కల్పనలతోపాటు ధర ఎక్కువైనా సదరు వాహనాలు ఇస్తున్న మైలేజీ ఆర్థికంగా ఆకర్షణీయంగా ఉంటున్న నేపథ్యంలో వాటికి డిమాండ్ పెరుగుతోంది. డిమాండ్‌కి సరిపడా విద్యుచ్ఛక్తి వాహనాలనుఉత్పత్తి చేయడం కోసం బడా బడా ఆటోమొబైల్ పరిశ్రమలతోపాటు చిన్నచిన్న స్టార్టప్‌లకు సైతం ప్రభుత్వం అవసరమైనప్రోత్సాహకాలను, రాయితీలను అందిస్తున్న క్రమంలో కొంతమంది ఉత్పత్తి దారులు లాభాలకోసం ఇ.విల తయారీలో నాణ్యత లేని బ్యాటరీలను ఉపయోగిస్తున్న కారణంగా వారు ఉత్పత్తి చేస్తున్న ద్విచక్ర విద్యుత్ వాహనాలు ప్రమాదాల పాలిట బడుతున్నవనేది నిపుణుల నిశ్చితాభిప్రాయం. స్వదేశంలో బ్యాటరీల తయారీ అంతంత మాత్రంగానే జరుగుతుండడం వాటి తయారీకి సంబంధించి రీసెర్చ్ జరగక పోవడం, అధిక శాతం బ్యాటరీలను చైనా తదితర విదేశాలనుండి దిగుమతి చేసుకోవాల్సి వస్తుంది. ఏదేమైనా ప్రభుత్వాల ఈ.విపాలసీ ఫలితంగా పరిశ్రమకూ, ఔత్సాహికులైన కొనుగోలు దారులకు అందుబాటులో ఉన్న ప్రోత్సాహకాలు, రాయితీల నేపథ్యంలో భారీ మొత్తంలో ఇ.వి లు రోడ్ల పైకి వస్తున్నాయి. ఐతే ఆశ్చర్యకరంగా వాటిని నిరంతరం ఉపయోగించడానికి అవసరమైన మేరకు రీచార్జ్ చేయడానికి కావలసిన సంఖ్యలో ఫ్యూయల్ ఫిల్లింగ్ స్టేషన్లు లేకపోవడం వాటి వినియోగానికి ప్రధాన అవరోధంగా మారుతున్నది. విద్యుచ్ఛక్తి వాహనాల కొనుగోలుకు ఆర్థిక సదుపాయాన్ని సమకూరుస్తున్న ప్రైవేట్ ఫైనాన్సర్‌లు కొనుగోలు దారులు వాయిదాలను చెల్లించనప్పుడు రిమోట్ ద్వారా బ్యాటరీ మేనేజ్ మెంట్ సిస్టమ్‌ను హ్యాక్ చేసి ఇ.విలను లాక్ చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఒక వేల అదే నిజమైతే ఇలాంటి సాంకేతికత ఉగ్రవాదులు, దేశద్రోహుల చేతుల్లోకి వెళ్తే ప్రయాణీకుల భద్రతతోపాటు దేశ భద్రతకు పెనుప్రమాదంవాటిల్లుతుందనే ఉద్దేశంతో వీటికి సంబంధించిన కొన్ని యాప్‌లను డిజిటల్ ప్లాట్ ఫాంల నుండి బ్లాక్ చేయాలని ఆదేశాలు జారీచేయడం కోసం కేంద్ర ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు నేషనల్ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. ●

# వ్యాధులు కాదు.. నిర్లక్ష్యమే అసలు వైరస్!

ఫిరోజ్ ఖాన్

ప్రతి వర్షాకాలం కేవలం పచ్చదనాన్నే కాదు.. ప్రజారోగ్యానికి ఒక హెచ్చరికను కూడా తీసుకొస్తుంది. మనల్ని అనారోగ్యానికి గురిచేస్తున్నది నిజంగా వైరస్‌లేనా? లేక వాటికి అనుకూల పరిస్థితులను సృష్టిస్తున్న మన నిర్లక్ష్యమా? వర్షాలు సహజం, కానీ వాటి వెంట ప్రతి ఏడాది డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా, కలరా, టైఫాయిడ్, గ్యాస్ట్రోఎంటరైటిస్ వంటి వ్యాధులు పునరావృతం కావడం కేవలం ప్రకృతి ప్రభావం మాత్రమే కాదు, ప్రజారోగ్య నిర్వహణ, పారిశుధ్యం, పర్యావరణ పరిరక్షణ, పౌర బాధ్యత వంటి అంశాలతో ముడిపడి ఉన్న సంక్లిష్ట వాస్తవం. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం, ఇటీవలి సంవత్సరాల్లో ప్రపంచవ్యాప్తంగా డెంగ్యూ కేసులు చారిత్రాత్మక స్థాయికి చేరుకున్నాయి. భారత ప్రభుత్వ నేషనల్ సెంటర్ ఫర్ వెక్టర్ బోర్న్ డిసీజెస్ కంట్రోల్ గణాంకాలు కూడా ప్రతి వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా కేసులు గణనీయంగా పెరుగుతున్న ధోరణిని సూచిస్తున్నాయి ఇదే సమయంలో అంతర్జాతీయ వైద్య పరిశోధనా పత్రిక 'ది లాన్సెట్ ప్లానెటరీ హెల్త్'లో ప్రచురితమైన అధ్యయనాలు కూడా వాతావరణ మార్పులు వెక్టర్‌బోర్న్ వ్యాధుల భౌగోళిక విస్తరణను ప్రభావితం చేస్తున్నాయని సూచిస్తున్నాయి. కాబట్టి వ్యాధులను కేవలం వైద్య సమస్యగా కాకుండా, ప్రజారోగ్య నిర్వహణకు సంబంధించిన సామాజిక సవాలుగా చూడాల్సిన అవసరం ఉంది. సీజనల్ వ్యాధుల నివారణలో బాధ్యతను ఒకే వర్గంపై మోపడం వాస్తవ పరిస్థితిని పూర్తిగా ప్రతిబింబించదు. స్థానిక సంస్థలు డ్రైనేజీ నిర్వహణ, చెత్తతొలగింపు, యాంటీ లార్వా చర్యలు, ఫాగింగ్, తాగునీటి భద్రత, ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు వంటి అంశాలను సకాలంలో అమలుచేయాల్సిన బాధ్యత కలిగి ఉన్నాయి. మరోవైపు, ప్రతి కుటుంబం ఇంటి పరిసరాల్లో నీరు నిల్వకాకుండాచూడడం, కూలర్లు, పూల కుండీలు, పాత టైర్లు, నీరు నిలిచే పాత్ర లను తరచూ శుభ్రం చేయడం వంటి చర్యలు తీసుకోవడం కూడా అంతే అవసరం. భారత వైద్య పరిశోధనా మండలి, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మలేరియా రీసెర్చ్ అధ్యయనాల ప్రకారం, డెంగ్యూ వ్యాప్తి చేసే 'ఈడిస్ ఈ జిప్టి' జాతి దోమలు ఇంటి ఆవరణలో నిల్వ ఉండే స్వచ్ఛమైన నీటిలోనే ఎక్కువగా వృద్ధి చెందుతున్నాయి. అందువల్ల ప్రభుత్వంచర్యలు తీసుకోవడం మాత్రమే సరిపోదు, ప్రజల భాగస్వామ్యం కూడా విజయానికి కీలకం. ప్రభుత్వం, ప్రజలు అనే భాగస్వామ్య దృక్పథమే ప్రజారోగ్యానికి బలమైన రక్షణ. సీజనల్ వ్యాధుల అసలు ప్రభావం ఆసుపత్రిగోడల వద్ద ఆగిపోదు. అది కుటుంబాల ఆదాయం, పిల్లల చదువు, ఉపాధి, జీవనోపాధిపై కూడా ప్రత్యక్ష ప్రభావం చూపుతుంది. ప్రతివర్షాకాలం మనకు ఒకే పాఠాన్ని గుర్తు చేస్తుంది. వ్యాధులు ఒక్కసారిగా పుట్టవు. వాటికి అనుకూల పరిస్థితులు క్రమంగా ఏర్పడతాయి. అందువల్ల ప్రజారోగ్య విజయాన్ని ఆసుపత్రుల్లోని పడకల సంఖ్యతో కాకుండా, వ్యాధులు రాకముందే చేపట్టిన నివారణ చర్యలతో కొలవాలి. ●

# నూతన మార్పునకు నాంది పలికే సంస్కరణలు



నాదెండ్ల శ్రీనివాస్

తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ విద్యా వ్యవస్థ సంక్షోభంలో పడింది అనడానికి ప్రభుత్వం ఇటీవల విద్యారంగంలో మార్పులు తీసుకురావడానికి చేపడుతున్న నిర్ణయాలే నిదర్శనం. 1,441 పాఠశాలలను మూసివేసి 2026-27 యూడైస్ లెక్కల నుండి తొలగించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మరో 640 పాఠశాలల్లో కేవలం ఉపాధ్యాయులు మాత్రమే ఉండి, ఒక్కవిద్యార్థి కూడా లేకపోవడంతో అందులో పనిచేస్తున్న ఉపాధ్యాయులను వేరే పాఠశాలలకు డిప్యుటేషన్‌పై పంపించి వాటిని కూడా త్వరలో మూసివేయాలని నిర్ణయించింది. దీనితో ప్రభుత్వ విద్య పట్ల పాలక వర్గాలకు ఉన్న శ్రద్ధ ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు. రాష్ట్రంలో 26 వేలకు పైగా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. 2024-25 విద్యా సంవత్సరంలో 2,081 జీరో ఎన్రోల్మెంట్ పాఠశాలలు ఉన్నట్టు తేలగా, ప్రస్తుతానికి 1,441 స్కూళ్లను మూసివేయడంతో పాటు, మిగిలిన 640పాఠశాలలను మూసివేస్తే ప్రభుత్వ పాఠశాలల సంఖ్య 24వేలలోపే పరిమితం కానుంది. గ్రామాలలో పాఠశాలలు మూతపడటం వల్ల పేద, దళిత, గిరిజన, వెనుకబడిన వర్గాల పిల్లలు విద్యకు దూరమయ్యే ప్రమాదంఉంది. ప్రభుత్వ పాఠశాలలను మూసివేయడం కంటే వాటిని పునరుద్ధరించే దిశగా ప్రభుత్వం ఆలోచన చేయాలి. తెలంగాణ సర్కార్ ఏడాదిన్నర క్రితం తెలంగాణ విద్యా కమీషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ కమీషన్ తన అధ్యయనంలో రాష్ట్రంలో విద్యా వెనుకబాటును స్పష్టంగా గుర్తిస్తూ నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించింది. అదే సమయంలో ప్రస్తుతం విద్యా రంగం ఎదుర్కొంటున్న సవాళ్లను, సమస్యలను సమగ్రంగా అధ్యయనం చేసి ప్రజల నుంచి వచ్చిన సమాచారాన్ని క్రోడీకరించి విద్యారంగం వెనుకబాటు నుండి బాగు చేయడానికి పలు సిఫార్సులు కూడా చేసింది. కేంద్రంలో ఎన్డీఏ సర్కార్ రూపొందించిన నూతన విద్యా విధానం 2020లోని అశాస్త్రీయ విధానాలను తిరస్కరించాలని, ఉచిత నిర్బంధ విద్య బోధనను 18ఏళ్ల వరకు పెంచాలనే సిఫార్సులు వీటిలో అత్యంత అవసరమైనవి. బడి బయట ఉన్న పిల్లల నుండి అసలు బడి అంటే ఏంటో తెలియని వారి సంఖ్యను కూడా వాస్తవాల రూపంలో వెలుగులో తెచ్చింది. ఈవాస్తవాలే ఇప్పటి ప్రభుత్వానికి కంటగింపుగా మారాయి. 100 మంది విద్యార్థులలో 26 మంది మాత్రమే ప్రభుత్వ బడులలో చేరుతున్నారని సగానికి ఎక్కువ మంది ప్రైవేట్ పాఠశాలల్లో చేరుతున్నారని, ప్రభుత్వ రంగంలో 36 శాతం ఏకోపాధ్యాయ బడులు కాగా, 86శాతం బడులలో అన్ని తరగతుల విద్యార్థులను ఒకేగదిలో కూర్చోబెట్టి విద్యాబోధన జరుపుతున్నారని పేర్కొంది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేరని, కనీస సౌకర్యాలు లేవని కూడా తేల్చింది. నాణ్యమైన విద్యా బోధనలో మన స్థానం 26 అని, మూడవ తరగతి విద్యార్థులకు వారి కింది తరగతి పుస్తకం కూడా చదవలేని వెనుకబాటు తనంఉందని, ఇంకా ఉన్నత విద్యా సంస్థలకు 77శాతం కళాశాలకు న్యాక్ గుర్తింపులేకపోవడం, యూనివర్సిటీల్లో 80శాతం ఖాళీలతో భ్రష్టు పట్టించిన విషయాన్ని కుండ బద్దలు కొట్టి తెలియజెప్పింది.



ప్రీ ప్రైమరీ నుంచి ఉన్నత విద్య వరకు నాణ్యమైన విద్య కోసం సమగ్ర రోడ్ మ్యాప్ రూపొందించాలన్న తెలంగాణ విద్యా కమీషన్ లక్ష్యం విస్తృత ఆశయాన్నిప్రతిబింబించింది. దీనితో కొత్త ఆశలు రెక్కలు తొడిగాయి, విద్యా కమిషన్ చాలా శ్రమకోర్చి పూర్వ ప్రాథమిక స్థాయి నుంచి ప్లస్ టు స్థాయివరకు శ్రేష్టమైన విద్యకోసం తీసుకురావాల్సిన మార్పులను సూచిస్తూ నివేదిక సమర్పించింది. ఫీజుల నియంత్రణకు సంబంధించి నివేదిక సమర్పించింది. అయిదేళ్ళ ప్రణాళికను ఖచ్చితమైన బడ్జెట్ అంచనాలతో నివేదికను రూపొందించింది. కానీ ప్రభుత్వం ఆ నివేదికతో సంబంధం లేకుండానే ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను ప్రారంభించింది. విద్యాకమీషన్ ఇంకా ఉన్నత విద్య, ఒకేషనల్, టెక్నికల్ విద్యకు సంబంధించిన అంశాలపై చర్చలు, నివేదికలు పూర్తి చేయలేదు. అన్ని విషయాలతో సమగ్ర నివేదిక కూడా తయారుకాలేదు. ఈలోపే ప్రభుత్వం గత నెలలో తెలంగాణ విద్యా విధానం (టిఈపి) రూపొందించడానికి ప్రాజెక్ట్ మేనేజ్మెంట్ యూనిట్‌ను రూపొందించారు. ఈప్రక్రియను అంతా పరిశీలిస్తే విద్యా కమిషన్‌లో నిర్మాణ సంబంధలోపాలు, విద్యావిధాన రూపకల్పన ప్రక్రియకు సంబంధించిన లోపాలు స్పష్టంగా కనబడుతున్నాయి. దీంతో ఈ సంస్కరణల లక్ష్యం నెరవేరుతుందా అనే అనుమానం కూడా కలుగుతుంది. నేటికీ రాష్ట్ర ప్రభుత్వం ఈ నివేదిక అమలుపై స్పష్టత ఇవ్వలేదు. ఇకపోతే తెలంగాణలో పాఠశాల విద్య అంటే ప్రైవేట్ విద్య మాత్రమే అనే భావన నెలకొని ఉంది. అందులోనూ ముఖ్యంగా తల్లిదండ్రులకు టక్కునగుర్తొచ్చేదినర్సరీ, ఎల్.కె.జి, యుకెజి బోధన, ఇంగ్లీష్ మీడియం బోధన చేసే ప్రైవేట్ పాఠశాలలే. ఈ రకమైన ప్రైవేట్ బోధన మాత్రమే నిజమైన, నాణ్యమైన చదువుగా తల్లిదండ్రులు భావిస్తున్నారు. ఇలాంటి సందర్భంలో మురళి కమీషన్ ప్రభుత్వ రంగంలో కూడా నర్సరీ, ఎల్.కె.జి, యుకెజిలను బోధించే పూర్వ ప్రాథమిక విద్యను తీసుకురావాలని, నర్సరీ నుండి పి.జి వరకు ఇంగ్లీష్ మీడియంలోనే విద్య బోధన జరపాలని, అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలు, సౌకర్యాలు కలిగినట్టి తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను ఏర్పాటు చేసి అన్ని ప్రాంతాల్లో విస్తరించిప్రభుత్వ విద్యలో నాణ్యత పెంచాలని, ప్రతి తర గతికి ఒక గది నిర్మాణం చేయాలని, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మౌళిక సదుపాయాల కల్పన, నిత్యం మానిటరింగ్ కోసం జిల్లాస్థాయి పర్యవేక్షణ బోర్డు ఏర్పాటుచేయాలనడం పేద, మధ్య తరగతి విద్యార్థులకు చాలా ఉపయోగకరమే. పాఠశాల విద్యలో మరోసిఫార్సు ఆయా సొసైటీలుగా కొనసాగుతున్న గురుకుల విద్య సంస్థలను ఒకటిగా కలపడం. కుల వ్యవస్థను సుస్థిరం చేస్తున్న ఆయా కులాల గురుకులాలను కలిపి ఇంటిగ్రేటెడ్ గురుకులాలు ఏర్పాటు చేయాలనే డిమాండ్ పౌరసమాజం నుంచి వచ్చినదే. ఇక ఇంటర్మీడియట్ విద్యలో చేసిన సిఫార్సులను పరిశీలిస్తే మెజారిటీ సిఫార్సులు ప్రైవేట్ కళాశాలల, కోచింగ్ సెంటర్ల దోపిడీని అరికట్టడానికి వచ్చినవే. ప్రైవేట్ పాఠశాలల జూనియర్ కళాశాలలో ఫీజుల నియంత్రణ చట్టం రూపొందించాలని సిఫార్సు చేయడం ఆహ్వానించదగినదే. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విద్య, ఆంగ్ల మాధ్యమాన్ని బలోపేతంచేయాలి. బడుల్లో మెరుగైనమౌలిక సదుపాయాలు కల్పించాలి. పాఠశాలలను మూసివేయడం సమస్యకు ముగింపు కాదు. వాటికి పూర్వ వైభవం తీసుకురావడమే ఈ సమస్యకు పరిష్కారం. విద్యా సంస్కరణలనేవి ఆడంబరం కాకుండా నూతన మార్పుకు నాంది కావాలి. ●

# అయోధ్య ట్రస్ట్‌కు కొత్త జనరల్ సెక్రటరీ?

## చంపత్ రాయ్ రాజీనామా ఆమోదం





**అయోధ్య,జులై 6:** అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ జనరల్ సెక్రటరీ చంపత్ రాయ్ రాజీనామాను ట్రస్ట్ ఆమోదించింది. రామమందిరానికి వచ్చిన విరాళాల దుర్వినియోగం ఆరోపణల నేపథ్యంలో నెలకొన్న వివాదం మధ్య ఆయన తన పదవికి రాజీనామా చేశారు. చంపత్ రాయ్ వారసుడిగా విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) అంతర్జాతీయ ప్రధాన కార్యదర్శి బజరంగ్ బాగ్రా పేరు ప్రధానంగా వినిపిస్తోంది. చార్టర్డ్ అకౌంటెంట్‌గా, ప్రభుత్వ రంగ సంస్థ నాల్కో మాజీ అధిపతిగా పనిచేసిన బాగ్రాకు పరిపాలన, ఆర్థిక వ్యవహారాల్లో విశేష అనుభవం ఉందని, ట్రస్ట్ కార్యకలాపాలను మరింత వృత్తిపరంగా నిర్వహించేందుకు ఆయన సేవలు ఉపయోగపడతాయని వర్గాలు భావిస్తున్నాయి. ట్రస్ట్ తదుపరి దశలోకి అడుగుపెడుతున్న నేపథ్యంలో పరిపాలన, ఆర్థిక నిర్వహణ, సంస్థాగత పాలనపై పట్టు ఉన్న వ్యక్తిని బాధ్యతల్లో తీసుకురావాలన్న ఆలోచనతో ట్రస్ట్ ఉన్నట్లు సమాచారం. అయితే చంపత్ రాయ్ మాత్రం స్వచ్ఛందంగా తప్పుకుంటే తప్ప ట్రస్ట్‌గా కొనసాగుతున్నారని తెలుస్తోంది. కొత్త జనరల్ సెక్రటరీ పేరును వెంటనే ప్రకటించే అవకాశం లేదని సమాచారం. ఈనెల 19, 20 తేదీల్లో ఢిల్లీలో జరిగే వీహెచ్‌పీ ద్వైవార్షిక జాతీయ కార్యవర్గ సమావేశంలో సంస్థాగత మార్పులు, బదిలీలతో పాటు ఈ అంశంపై కూడా నిర్ణయం తీసుకునే అవకాశమున్నట్లు తెలుస్తోంది. రామ మందిర విరాళాల దుర్వినియోగంపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కఠిన వైఖరి అవలంబించగా, దర్యాప్తు చేపట్టిన ప్రత్యేక దర్యాప్తు బృందం సిట్ ప్రాథమిక నివేదిక సమర్పించింది. అనంతరం చంపత్ రాయ్‌తో పాటు ట్రస్ట్ అనిల్ మిశ్రా తమ రాజీనామాలను సమర్పించారు. ఎస్ఐటీ ప్రాథమిక నివేదిక ప్రకారం, ఆలయానికి వచ్చిన నగదు విరాళాలను లెక్కించే బాధ్యతలో ఉన్న సిబ్బంది, సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసినప్పటికీ వాటి ఫుటేజీని క్రమం తప్పకుండా పరిశీలించకపోవడాన్ని ఆసరాగా చేసుకుని నగదును అపహరించినట్లు వెల్లడైంది. ఈ ఘటనలో సుమారు రూ.7 నుంచి రూ.7.5 కోట్ల వరకు నగదు గల్లంతైనట్లు దర్యాప్తు సంస్థ గుర్తించినట్లు సమాచారం. ఈ కేసులో ఇప్పటివరకు ఎనిమిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. వారిలో చంపత్ రాయ్ డ్రైవర్ రామ్ శంకర్ యాదవ్ అలియాస్ టిన్నూ యాదవ్ కూడా ఉన్నారు. టిన్నూ యాదవ్ తనపై ఉంచిన నమ్మకాన్ని దుర్వినియోగం చేసి ఈ మోసానికి పాల్పడ్డాడని చంపత్ రాయ్ తన సన్నిహితులతో చెప్పినట్లు వర్గాలు వెల్లడించాయి. పట్టుబడే పరిస్థితి వచ్చినప్పుడు టిన్నూ యాదవ్ సమాజ్‌వాదీ పార్టీకి చెందిన ఓ నేతకు సమాచారం లీక్ చేశాడని కూడా సమాచారం. ఈ కేసులో ఇప్పటికే అరెస్టైన ఆరవ నిందితుల్లో అవినాష్ శుక్లా, అనుకల్ప్ మిశ్రా, లవ్ కుష్ మిశ్రా, మనీష్ కుమార్ యాదవ్, కరుణేశ్ పాండే, రామాశంకర్ మిశ్రా, సుభాష్ శ్రీవాస్తవ ఉన్నారు. ఇప్పటివరకు చంపత్ రాయ్, మిశ్రా, ప్రత్యేక ఆహ్వానితుడు గోపాల్ రావుపై ఎలాంటి ఎఫ్ఐఆర్ నమోదు కాలేదు. అయితే వీరిపైనా కేసు నమోదు చేయాలని కోరుతూ ఫైజాబాద్ బార్ అసోసియేషన్‌కు చెందిన అయోధ్య న్యాయవాదులు పోలీసులకు లిఖితపూర్వక ఫిర్యాదు సమర్పించారు.




## పహల్గామ్ ఉగ్రదాడి కేసు

# నిందితుడు హాఫీజ్ సయీదే!

### అనుబంధ చార్జిషీట్‌లో పేర్కొన్న ఎన్ఐఏ

### నిందితుల జాబితాలో టీఆర్ఎఫ్ సంస్థ పేరు

**న్యూఢిల్లీ, జులై 6:** పహల్గామ్ ఉగ్రదాడి కేసులో తాజాగా, పాకిస్థాన్‌కు చెందిన లష్కరే తోయిబా (ఎల్ఇటి) వ్యవస్థాపకుడు హాఫీజ్ సయీద్‌పై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) సోమవారం అనుబంధ ఛార్జిషీట్‌ను దాఖలు చేసింది. సోమవారం జమ్మూలోని ఎన్ఐఏ ప్రత్యేక కోర్టులో దాఖలు చేసిన ఈ కొత్త ఛార్జిషీట్‌లో, సయీద్, అతని అనుబంధ సంస్థ అయిన 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్' (టీఆర్ఎఫ్) పేర్లను చేర్చారు. ఈ టీఆర్ఎఫ్ సంస్థ కాశ్మీర్‌లో ఎల్ఇటికి కార్యాచరణ విభాగంగా పనిచేస్తోంది. జమ్మూలోని ఎన్ఐఏ ప్రత్యేక కోర్టులో దాఖలు చేసిన ఛార్జిషీట్‌లో, ఉగ్రవాద నిరోధక సంస్థ హాఫీజ్ సయీద్‌పై అతని 'వ్యక్తిగత హోదాలో', లష్కరేతోయిబా (ఎల్ఇటి), టీఆర్ఎఫ్ అధిపతిగా భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్), 2023, చట్టవిరుద్ధ కార్యకలాపాల (నివారణ) చట్టం, 1967 లోని వివిధ సెక్షన్ల కింద అభియోగాలు మోపింది. భారతదేశంపై యుద్ధం ప్రకటించడం, సరిహద్దు దాటి కుట్ర పన్నడం వంటి ఆరోపణలపై కూడా ఎన్ఐఏ తన ఛార్జిషీట్‌లో హాఫీజ్ సయీద్‌పై కఠినమైన సెక్షన్లను ప్రయోగించింది. డిసెంబర్ 15, 2025న దాఖలు చేసిన తన మునుపటి ఛార్జిషీట్‌లో, ఎన్ఐఏ పాకిస్తానీ ఉగ్రవాది సాజిద్ జట్‌తో పాటు, జులై 2025లో ఆపరేషన్ మహాదేవ్ సమయంలో భద్రతా దళాల చేతిలో హతమైన ముగ్గురు ఉగ్రవాదులు, అలాగే అరెస్టు చేయబడిన ఇద్దరు నిందితులను నిందితులుగా చేర్చింది. పహల్గామ్ ఉగ్రదాడిని ప్రణాళిక చేయడం, సులభతరం చేయడం, అమలు చేయడంలో నిషేధిత ఎల్ఇటి/టీఆర్ఎఫ్ ఉగ్రవాద సంస్థ పాత్రకు గాను, దానిని ఒక చట్టబద్ధమైన సంస్థగా కూడా పరిగణించి అభియోగాలు మోపింది.





# భారీ ఉగ్ర కుట్ర భగ్నం

### ఆరుగురు ఉగ్రవాదులు అరెస్టు, తుపాకులు, పెట్రోల్ బాంబులు, వాహనాలు స్వాధీనం

**న్యూఢిల్లీ, జులై 6:** పాకిస్థాన్‌కు చెందిన గ్యాంగ్‌స్టర్, ఉగ్రవాది షాజాద్ భట్టితో సంబంధం ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న రెండు మాడ్యూళ్లను ఢిల్లీ పోలీస్ స్పెషల్ సెల్ ఛేదించింది. ఢిల్లీ, పంజాబ్, ఉత్తర ప్రదేశ్‌లలో సమన్వయంతో నిర్వహించిన ఆపరేషన్‌లో ఆరుగురు నిందితులను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ దాడుల ఫలితంగా భట్టితో సంబంధం ఉన్నట్లు భావిస్తున్న ఒక ఉగ్రవాద మాడ్యూల్‌తో పాటు అక్రమ ఆయుధాల రవాణా నెట్‌వర్క్‌ను కూడా ఛేదించారు. ఈ మూడు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో దాడులు నిర్వహించిన అనంతరం ఈ ఆపరేషన్ చేపట్టారు. అరెస్టు అయిన ఆరుగురు నిందితులు ఈ నెట్‌వర్క్‌లో భాగమని, కుట్ర పూర్తి స్థాయిని నిర్ధారించడానికి, ఈ ఆపరేషన్‌తో సంబంధం ఉన్న ఇతర వ్యక్తులను గుర్తించడానికి వారిని విచారిస్తున్నామని అధికారులు తెలిపారు. దాడుల సమయంలో, ఈ నెట్‌వర్క్‌లోని సభ్యులు ఉపయోగించినట్లు ఆరోపించబడిన అనేక తుపాకులు, పెట్రోల్ బాంబులు, వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

**రాంచీ ఆర్ఎస్ఎస్ కార్యాలయంపై దాడిలో బాంబులు వాడారు:** రాంచీలోని ఆర్ఎస్ఎస్ కార్యాలయంపై ఇటీవల జరిగిన దాడిలో పెట్రోల్ బాంబులను కూడా ఉపయోగించినట్లు పోలీసు అధికారులు పేర్కొన్నారు. ఆ ఘటనకు, షాజాద్ భట్టితో సంబంధం ఉన్నట్లు ఆరోపించబడిన నెట్‌వర్క్‌కు మధ్య ఏమైనా సంబంధాలు ఉన్నాయేమో దర్యాప్తు అధికారులు పరిశీలిస్తారని పోలీసులు తెలిపారు. అయితే, అటువంటి సంబంధం ఉన్నట్లు అధికారికంగా ఎలాంటి నిర్ధారణ జరగలేదు. ఢిల్లీ పోలీసుల ప్రకారం, దర్యాప్తు ఇంకా ప్రాథమిక దశలోనే ఉంది. ఆరోపించబడిన ఉగ్రవాద, ఆయుధ సరఫరా మాడ్యూళ్ల గురించి మరింత సమాచారం సేకరించడానికి నిందితులను విచారిస్తున్నారు. దర్యాప్తు కొనసాగుతున్న కొద్దీ మరిన్ని అరెస్టులు, స్వాధీనాలు జరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

# నీరవ్ మోడీ అప్పగింతకు లైన్‌క్లియర్

### అంతర్జాతీయ కోర్టులోనూ లభించని ఊరట



**లండన్, జులై 6:** పరారీలో ఉన్న వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ, యూరోపియన్ కోర్ట్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ (ఇసిహెచ్ఆర్) నుండి ఉపశమనం పొందేందుకు చేసిన విఫల ప్రయత్నంతో సహా, యునైటెడ్ కింగ్‌డమ్‌లో తనకున్న అన్ని చట్టపరమైన మార్గాలను వినియోగించుకున్న తర్వాత, భారతదేశానికి అప్పగించబడే అవకాశం ఉంది. అధికార వర్గాల సమాచారం ప్రకారం, యుకె కోర్టులలో అప్పీళ్లను వినియోగించుకున్న తర్వాత మోడీ ఏప్రిల్‌లో ఇసిహెచ్ఆర్‌ను ఆశ్రయించారు. యూరోపియన్ కోర్టు ఆయనకు ఉపశమనం కల్పించలేదని, దీంతో ఆయన అప్పగింతను సవాలు చేయడానికి తదుపరి చట్టపరమైన మార్గాలు ఏవీ మిగల్లేదని వర్గాలు తెలిపాయి. చట్టపరమైన ప్రక్రియ వాస్తవంగా పూర్తవడంతో, మోడీని భారత అధికారులకు అప్పగించడానికి అవసరమైన పరిపాలనా లాంఛనాలను యుకె ప్రభుత్వం ప్రారంభించినట్లు సమాచారం. ఈ అప్పగింత ఇప్పుడు ఎప్పుడైనా జరగవచ్చని దౌత్య వర్గాలు సూచించాయి. 2019 మార్చి నుంచి లండన్‌లోని వాండ్స్‌వర్త్ జైల్లో నిర్బంధంలో ఉన్న నీరవ్ మోడీ, తనను భారత్‌కు అప్పగిస్తే అక్కడ తనకు హింస ఎదురవుతుందని వాదిస్తూ పలు అప్పీళ్లు దాఖలు చేశారు. అయితే ఈ వాదనలను భారత్ తరఫున సిబిఐ, ఇడి అధికారులు బలమైన ఆధారాలతో ఖండించినట్లు సమాచారం. పిఎన్‌బి మోసం కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న నీరవ్ మోడీని స్వదేశానికి తీసుకురావడం భారత్ దర్యాప్తు సంస్థలకు పెద్ద విజయంగా భావిస్తున్నారు. మోడీ భారతదేశంలో పిఎన్‌బి మోసం కేసు, మనీలాండరింగ్ దర్యాప్తు, సాక్ష్యాలను ధ్వంసం చేయడం, సాక్షులను ప్రభావితం చేశారనే ఆరోపణలతో కూడిన మరో కేసుతో సహా మూడు క్రిమినల్ కేసులను ఎదుర్కొంటున్నారు.

# అబార్షన్‌పై నిర్ణయం తల్లిదే

### విడిపోయిన భర్త అనుమతి అనవసరం

### మధ్యప్రదేశ్ హైకోర్టు సంచలన తీర్పు




**ఇండోర్, జులై 6:** వైద్యపరమైన గర్భవిచ్ఛిత్తి చట్టం, 1971 ప్రకారం, విడిపోయిన భర్త సమ్మతి లేకుండానే తన 13 వారాల గర్భాన్ని తొలగించుకోవడానికి ఒక మహిళకు మధ్యప్రదేశ్ హైకోర్టు అనుమతి మంజూరు చేసింది. హైకోర్టు ఇండోర్ బెంచ్‌లోని జస్టిస్ సందీప్ ఎన్ భట్ నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం, ఆ మహిళ తన భర్త నుండి విడిగా నివసిస్తోందని, వైవాహిక సంబంధాన్ని కొనసాగించడానికి ఇష్టపడటం లేదని పేర్కొంది. ఈ నేపథ్యంలో, రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం ఆమెకు పునరుత్పత్తి స్వేచ్ఛ హక్కు ఉంది. అందువల్ల, ఆమెకు గర్భవిచ్ఛిత్తి చేయించుకోవడానికి అనుమతివ్వాలని పేర్కొంది. గర్భంకొనసాగించాలా?లేదా అబార్షన్ చేయించుకోవాలా? అన్నది తల్లి నిర్ణయం ప్రధానమని వ్యాఖ్యానించింది. భర్తనుంచి దూరంగా ఉంటున్నందున అతని అనుమతి అవసరంలేదని పేర్కొంది. వారు మొదట విడాకుల విషయంలో ఒక అంగీకారానికి వచ్చినప్పటికీ, ఆ తర్వాత భర్త వెనక్కి తగ్గడంతో, స్థానిక కోర్టు అతనికి నోటీసు జారీ చేసింది. అయితే, అతను కోర్టు ముందు హాజరు కాలేదు. ఆ తర్వాత భార్య, తాను 13 వారాల గర్భవతి అని కోర్టుకు తెలియజేస్తూ, అబార్షన్‌కు అనుమతి కోరుతూ మధ్యప్రదేశ్ హైకోర్టు ఇండోర్ బెంచ్‌ను ఆశ్రయించింది. అయితే, భర్త తరఫున కోర్టులో ఎవరూ హాజరు కాలేదు. ఆమె వాదనలన్నీ విన్న తర్వాత, కోర్టు అబార్షన్‌కు అనుమతి మంజూరు చేసింది.

# 11న భారత్ నౌకాదళంలోకి ఐఎన్ఎస్ మహేంద్రగిరి



**న్యూఢిల్లీ, జులై 6:** భారత నౌకాదళం మరో అత్యాధునిక యుద్ధ నౌకను తన బలగాల్లోకి చేర్చుకోనుంది. స్వదేశీ సాంకేతికతతో నిర్మించిన ప్రాజెక్ట్17ఏకు చెందిన ఆరో స్టెల్త్ ఫ్రిగేట్ ఐఎన్ఎస్ మహేంద్రగిరిని ఈ నెల 11న విశాఖపట్నంలో అధికారికంగా కమిషన్ చేయనున్నారు. ఎఫ్38 పెన్నెంట్ నంబర్ కలిగిన ఈ యుద్ధ నౌకను భారత నౌకాదళానికి చెందిన వార్‌షిప్ డిజైన్ బ్యూరో రూపకల్పన చేయగా, ముంబైలోని మజగాన్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్ నిర్మించింది. తూర్పు కనుమల్లోని మహేంద్రగిరి పర్వత శ్రేణి పేరును ఈ యుద్ధనౌకకు పెట్టారు. ఈ పేరుతో భారత నౌకాదళంలో చేరుతున్న తొలి యుద్ధనౌక ఇదే కావడం విశేషం. స్వదేశీ రూపకల్పన, స్వదేశీ నిర్మాణంతో ఆధునిక యుద్ధనౌకలను అభివృద్ధి చేసే భారత నౌకాదళ లక్ష్యంలో ఇది మరో మైలురాయిగా భావిస్తున్నారు. ఐఎన్ఎస్ మహేంద్రగిరి నీలగిరి క్లాస్ లేదా ప్రాజెక్ట్17ఏలో భాగంగా నిర్మితమైంది. ఇప్పటికే సేవలందిస్తున్న శివాలిక్ క్లాస్ ఫ్రిగేట్‌లకు మరింత ఆధునిక రూపంగా వీటిని రూపొందించారు. రాడార్‌కు సులభంగా కనిపించకుండా ఉండే స్టెల్త్ సాంకేతికత, తక్కువ ఇన్‌ఫ్రారెడ్ ఉద్గారాలు వంటి ప్రత్యేకతలతో ఈ యుద్ధనౌకను అభివృద్ధి చేశారు. శత్రు రాడార్లు, క్షిపణుల గుర్తింపును తప్పించుకునే సామర్థ్యం మరింత పెరుగుతుంది.

# రాజ్యసభ మూడు స్థానాలకు నోటిఫికేషన్




**కోల్‌కత్తా,జులై 6:** పశ్చిమ బెంగాల్ లో అధికార మార్పిడి అనంతరం అనేక పరిణామాలు చోటు చేసుకుంటోన్నాయి. మాజీ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమత బెనర్జీకి ముఖ్యమంత్రి సువేందు అధికారి సారథ్యంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వంవరుస షాకులిస్తోంది. ఇప్పటికే ఈడీ, ఐటీ దాడులు జరుగుతున్నాయి. వ్యతిరేకంగా ప్రచారం చేసిన సెలెబ్రెటీలను కూడా వదలట్లేదు. కేసులు నమోదవుతున్నాయి. ఈ పరిణామాల మధ్య పశ్చిమ బెంగాల్ లో మూడు రాజ్యసభ స్థానాల భర్తీకి కేంద్ర ఎన్నికల కమిషన్ ఉప ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఎన్నికల తేదీలను ఖరారు చేసింది. ఈ నెల 24వ తేదీన ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు అసెంబ్లీ ప్రాంగణంలో పోలింగ్ జరుగుతుంది. అదే రోజు సాయంత్రం 5 గంటల నుండి ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభిస్తారు. రాత్రికి ఫలితాలు వెల్లడవుతాయి. పశ్చిమ బెంగాల్ నుంచి రాజ్యసభకు ఎన్నికైన ముగ్గురు సభ్యులు తమ పదవీ కాలం ముగియక ముందే రాజీనామాలు చేయడం వల్ల ఈ ఖాళీలు ఏర్పడ్డాయి. కిందటి నెల 8న సుఖేందు శేఖర్ రాయ్, 10న సుస్మితా దేవ్, 11న ప్రకాష్ చిక్ బరాక్ తమ సభ్యత్వాలకు రాజీనామాలు సమర్పించారు. అవి ఆమోదం పొందాయి. ఈ ఎన్నికల ద్వారా నూతనంగా ఎంపికయ్యే ఎంపీలు 2029 ఆగస్టు, 2030 ఏప్రిల్ వరకు సభ్యులుగా కొనసాగుతారు. పశ్చిమ బెంగాల్ రాజ్యసభ ఉప ఎన్నికల షెడ్యూల్ ప్రకారం ఈ నెల 7 మంగళవారం నోటిఫికేషన్ జారీ అవుతుంది. నామినేషన్లను దాఖలు చేయడానికి చివరి తేదీ 14. 15 నాటికి నామినేషన్లను పరిశీలిస్తారు. నామినేషన్లను ఉపసంహరించుకోవడానికి 17వ తేదీని తుది గడువుగా నిర్ణయించారు. 24 పోలింగ్ ఉంటుంది. అదే రోజు సాయంత్రం ఓట్లను లెక్కిస్తారు. 27వ తేదీ నాటికి ఉప ఎన్నికల ప్రక్రియ మొత్తం కూడా పూర్తవుతుంది. ఉప ఎన్నికలను ఎటువంటి వివాదాలు లేకుండా, అత్యంత పారదర్శక పద్ధతిలో నిర్వహించడానికి, పోలింగ్ పర్యవేక్షణ కోసం కేంద్ర ఎన్నికల సంఘం సీనియర్ అధికారులతో కూడిన ప్రత్యేక పర్యవేక్షక బృందాలను రంగంలోకి దించనుంది. నిష్పక్షపాత వాతావరణంలో ఈ కీలక ఓటింగ్ ప్రక్రియ పూర్తయ్యేలా సరిపోవు భద్రతా సిబ్బంది, ప్రత్యేక పరిశీలకులను నియమిస్తున్నట్లు అండర్ సెక్రటరీ రాజేష్ కుమార్ సింగ్ తెలిపారు.

# ఢిల్లీలో నవవధువు మృతి కలకలం..

### భర్త అరెస్ట్.. కట్న వేధింపుల కేసు నమోదు

**న్యూఢిల్లీ, జులై 6:** నవవధువు అనుమానాస్పద మృతి కేసు సంచలనంగా మారింది. పెళ్లై కేవలం 72 రోజులకే 28 ఏళ్ల అకృతి సుతార్ మృతి చెందడంతో పోలీసులు కట్న వేధింపుల కేసు నమోదు చేసి ఆమె భర్త అరస్తు సిక్కాను అరెస్ట్ చేశారు. ఈనెల 4న ఢిల్లీలోని లోధీ కాలనీ ప్రాంతంలోని పాలికా కుంజ్ అపార్ట్‌మెంట్‌లో జరిగిన ఈ హత్య కలకలం రేపింది. అపార్ట్‌మెంట్ భవనం పై అంతస్తు నుంచి కిందపడిన స్థితిలో అకృతి తీవ్రగాయాలతో కనిపించింది. వెంటనే ఆమెను ఎయిమ్స్ ఆస్పత్రికి తరలించగా, వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ప్రకటించారు. అకృతి తల్లి అను సాయ్ సుతార్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తన కుమార్తెను భర్త అరస్తు సిక్కా, అత్తింటి కుటుంబ సభ్యులు హత్య చేశారని ఆరోపించారు. అకృతి ఈ ఏడాది ఏప్రిల్ 24న తన చిన్ననాటి స్నేహితురాలు అగస్టికా సోదరుడు అరస్తు సిక్కాను ప్రేమపెళ్లి చేసుకుంది. ఛత్తర్‌పూర్‌లోని ఓ సంస్థలో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్న అకృతి, పెళ్లి తర్వాత కూడా ఉద్యోగం కొనసాగిస్తానని పెళ్లికి ముందే స్పష్టంగా చెప్పిందని ఆమె తల్లి తెలిపారు. ఆ షరతుకు అత్తింటి వారు అంగీకరించిన తర్వాతే వివాహానికి ఒప్పుకున్నామని వెల్లడించారు. పెళ్లి అనంతరం పరిస్థితి పూర్తిగా మారిపోయిందని ఆమె ఆరోపించారు. ఉద్యోగం మానేయాలని, త్వరగా గర్భం దాల్చాలని భర్తతో పాటు కుటుంబ సభ్యులు ఒత్తిడి తెచ్చారని, ఇంటి పనులతో ఇబ్బంది పెట్టి ఉద్యోగాన్ని వదిలేయాలనే పరిస్థితి సృష్టించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తల్లితో ఫోన్‌లో మాట్లాడినా, పుట్టింటికి వెళ్లినా అవమానించేవారని, మానసికంగా, శారీరకంగా వేధించేవారని ఆమె తెలిపారు. జూన్ 17న ఫోన్ సైలెంట్‌లో ఉండటంతో కాల్ అందుకోలేదనే కారణంగా భర్త బెల్ట్‌తో కొట్టాడని అకృతి తనకు చెప్పిందని తల్లి వెల్లడించారు. మరో వ్యక్తితో అక్రమ సంబంధం ఉందంటూ భర్త తరచూ అనుమానాలు వ్యక్తం చేసేవాడని ఆరోపించారు. జూన్ 29న తనను చంపే అవకాశం ఉందని అకృతి భయపడుతూ ఫోన్‌లో చెప్పిందని తల్లి పేర్కొన్నారు. అదే రోజు తాను వండిన భోజనం వేడి చేయలేదనే కారణంతో మరోసారి భర్త దాడి చేశాడని ఆరోపించారు. ఆ తర్వాత అకృతి తన స్నేహితురాలు, మరదలు అయిన అగస్టికా ఇంటికి వెళ్లి జరిగిన విషయాన్ని చెప్పిందని, అక్కడికి వచ్చిన అరస్తు మరోసారి దాడి చేసేందుకు ప్రయత్నించగా కుటుంబ సభ్యులు సర్దిచెప్పి ఇద్దరినీ ఇంటికి పంపించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.




# ఆర్మీ ట్రయల్స్‌పరీక్షల్లో ఉగ్రమ్ రైఫిల్ సక్సెస్

### హైదరాబాద్ స్టార్టప్ డ్వీపా డిఫెన్స్ రైఫిల్‌కు రక్షణ కొనుగోళ్లు

**న్యూఢిల్లీ,జులై 6:** రక్షణ తయారీ సంస్థ డ్వీపా డిఫెన్స్ దేశీయ రక్షణ తయారీలో కీలక మైలురాయిని చేరుకుంది. సంస్థ అభివృద్ధి చేసిన ఉగ్రం 7.6251 మి.మీ. బ్యాటిల్ రైఫిల్ భారత సైన్యం, కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ నిర్వహించిన కీలక పరీక్షలను విజయవంతంగా పూర్తి చేసింది. ప్రస్తుతం ఈ రైఫిల్‌ను పలు కేంద్ర సాయుధ పోలీసు బలగాలు కొనుగోలు చేసే ప్రక్రియ కొనసాగుతోంది డీఆర్‌డీవోకు చెందిన ఆర్మమెంట్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్‌తో కలిసి ఈ రైఫిల్‌ను అభివృద్ధి చేశారు. కేవలం 100రోజుల్లోనే దీని రూపకల్పన, తయారీ పూర్తి కావడం విశేషం. ఇది దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చేసిన స్వదేశీ ఆయుధ ప్రాజెక్టులలో ఒకటిగా నిలిచింది. డ్వీపా డిఫెన్స్ మేనేజింగ్ డైరెక్టర్ సిబు జోసెఫ్ మాట్లాడుతూ 2021లోసంస్థకు తయారీ లైసెన్స్ లభించిందని, తెలంగాణ ప్రభుత్వం కేటాయించిన 13 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో హైదరాబాద్‌లో అత్యాధునిక తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 2021లో ప్రారంభమైన తమ ప్రయాణంలో ఇప్పటివరకు 100కు పైగా స్వదేశీ ఆయుధ వ్యవస్థలు, వాటి వేరియంట్లు అభివృద్ధి చేశామని, అందులో ఉగ్రామ్‌తమ ప్రధాన ఉత్పత్తిగా నిలిచిందని సిబు జోసెఫ్ పేర్కొన్నారు. భారత భద్రతా బలగాల కోసం ప్రపంచ స్థాయి రక్షణ ఉత్పత్తులను దేశంలోనే తయారు చేయాలన్నదే తమ లక్ష్యమని ఆయన చెప్పారు. ఉగ్రామ్ రైఫిల్ విశ్వసనీయత, మన్నికకు సంబంధించిన విస్తృత పరీక్షలను విజయవంతంగా పూర్తిచేసింది. ప్రస్తుతం సీఆర్‌పీఎఫ్, ఐటీబీపీ, ఎస్ఎస్‌బీ, ఎన్ఎస్‌జీ కోసం కొనుగోలు ప్రక్రియ ముందుకు సాగుతోంది.

గ్యాస్ ఆపరేటెడ్ రొటేటింగ్ బోల్ట్ వ్యవస్థతో రూపొందించిన ఈ రైఫిల్ బరువు నాలుగు కిలోల కంటే తక్కువ. దీని ప్రభావవంతమైన కాల్పుల పరిధి 500 మీటర్లు.డ్వీపా డిఫెన్స్ ప్రస్తుతం అసాల్ట్ రైఫిళ్లు, కార్బైన్లు, సబ్ మెషిన్ గన్స్, అల్ట్రా లైట్ మెషిన్ గన్స్, యాంటీ డ్రోన్ వ్యవస్థలతో కూడిన స్వదేశీ ఆయుధాల శ్రేణిని కూడా అభివృద్ధి చేస్తోంది. ఆర్మీ ట్రయల్స్ విజయవంతంగాపూర్తికావడం, కొనుగోలు ప్రక్రియ ప్రారంభం కావడంతో స్వదేశీ రక్షణ తయారీ కేంద్రంగా హైదరాబాద్ మరింత బలోపేతం అవుతుందని సంస్థ భావిస్తోంది.

# 9న ఆఖరి కార్యాచరణ: పాకిస్థాన్‌కు పిఓకె నేతల తుది హెచ్చరిక



**ముజఫరాబాద్, జులై 6:** పాకిస్థాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పాక్ ఆక్రమిత కాశ్మీర్ (పిఓకె)లో నిరసనలు రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతున్నాయి. తమ డిమాండ్లను నెరవేర్చకపోతే ఈ నెల 9న ఫైనల్ యాక్షన్‌ను ప్రారంభిస్తామని జమ్మూకాశ్మీర్ జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ (జెఎఎసి) పాక్ సర్కారుకు అల్టిమేటమ్ ఇచ్చింది. తమ నిరసనల్లో భాగం కావాలని పిఓకె ప్రజలు, ప్రవాస కాశ్మీరీలకు పిలుపునిచ్చింది. ఆ రోజున పిఓకెలో పర్యటించాలని ఇస్లామిక్ కోఆపరేషన్ ఆర్గనైజేషన్, ఐరాస ప్రతినిధులు, అంతర్జాతీయ మీడియా, మానవ హక్కుల సంఘాలను ఆహ్వానించింది. ఆ డెడ్‌లైన్ గడువు వరకు క్రమశిక్షణతో వ్యవహరించాలని తన మద్దతుదారులను కోరింది. పాకిస్థాన్ ప్రభుత్వ అణచివేతలు, పౌరుల హత్యలను అంతర్జాతీయ సమాజం గమనించాలని జెఎఎసి అభ్యర్థించింది. నిరసనల్లో భాగంగా ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులు అర్పించింది. సమాచార వ్యవస్థను పునరుద్ధరించాలని, ఆహారం, మందుల సరఫరాను అడ్డుకోవద్దని, నిర్బంధంలో ఉన్న తమ నాయకులను విడిచిపెట్టాలని, 38 పాయింట్ల ఒప్పందాన్ని అమలు చేయాలని జెఎఎసి డిమాండ్ చేస్తోంది. ప్రజల డిమాండ్లకు తూటాలతో స్పందిస్తే.. తమ కు ఇతర మార్గాలు ఉన్నాయని పాక్ ప్రభుత్వాన్ని మరోసారి హెచ్చరించింది.

**భారత్ సహాయం కావాలి:** కాగా.. జెఎఎసి నేత సర్దార్ అమన్ ఖాన్ మాట్లాడినట్లు ఉన్న ఓవిడియో ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది.' మాకు భారత్ సహాయం కావాలి. ఆహారపదార్థాలు, నిత్యావసరాల కొరతఉంది. మానవతా సాయం అందించండి' అని ఆయన కోరినట్లుగా ఆవిడియోలో ఉండటం గమనార్హం. నిరసనలను కఠినంగా అణచివేస్తోన్న పాక్ ఆర్థిక దిగ్బంధనాన్ని విధించిందని అందులో ఆరోపించారు.

# సంక్షిప్త వార్తలు

## అణ్వస్త్రరహిత ప్రాంతంలో చైనా బాలిస్టిక్ క్షిపణి పరీక్ష



**బీజింగ్, జులై 6:** దక్షిణ పసిఫిక్ మహాసముద్రంలోని అణ్వస్త్ర రహిత మండలంలో అణుశక్తి జలాంతర్గామి నుంచి చైనా దీర్ఘశ్రేణి బాలిస్టిక్ క్షిపణిని సోమవారం పరీక్షించింది. ఈ ప్రయోగం పలు ప్రాంతీయ దేశాల్లో ఆందోళనకు దారితీసింది. దీనిపై ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. అయితే, ఈ ప్రయోగం సైనిక వార్షిక శిక్షణలో భాగమే నని చైనా తెలిపింది. అంతర్జాతీయ చట్టాలు, నిబంధనలకు అనుగుణంగానే నిర్వహించామని, ఏ దేశాన్ని లేదా లక్ష్యాన్ని ఉద్దేశించి చేయలేదని పేర్కొంది. అందులో నిజమైన అణు వార్‌హెడ్‌కు బదులుగా డమ్మీ వార్‌హెడ్‌ను ఉపయోగించినట్లు వెల్లడించింది. ఇదే తరహా పరీక్షను రెండేళ్ల కిందట కూడా నిర్వహించినట్లు చైనా తెలిపింది.

## కీవ్‌పై రష్యా భారీ డ్రోన్ దాడి



**కీవ్, జులై 6:** ఉక్రెయిన్ రాజధాని కీవ్‌లోని అనేక ప్రాంతాలపై రష్యా భీకర దాడులు చేసింది. బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్లతో మాస్కో విరుచుకుపడటంతో అనేక భవనాలు ధ్వంసమయ్యాయని, 12 మంది ప్రాణాలు కోల్పోయారని కీవ్ అధికారులు వెల్లడించారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించడానికి సహాయక చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. నాటో శిఖరాగ్ర సదస్సులో భాగంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ భేటీ కానున్న వేళ ఈ దాడులు చోటుచేసుకోవడం గమనార్హం. కీవ్‌లోని సైనిక–పారిశ్రామిక సౌకర్యాలు, ఇంధన, శక్తి కేంద్రాలను లక్ష్యంగా చేసుకున్నట్లు రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది.

## తేజ్‌ప్రతాప్ పార్టీనుంచి వీణామాన్వీ బంకిపూర్ నుంచి పోటీ




**పాట్నా,జులై 6:** బీహార్‌లో బంకీపూర్ ఉప ఎన్నిక హాట్ టాపిక్‌గా మారింది. తేజ్ ప్రతాప్ యాదవ్ నేతృత్వంలోని జన్ శక్తి జనతా దళ్ కూడా బరిలో దిగింది. సామాజిక కార్యకర్త వీణా మాన్వీని తమ అభ్యర్థిగా ప్రకటించింది. తేజ్ ప్రతాప్ యాదవ్ తన పార్టీ ఫారమ్‌ను ఆమెకు అధికారికంగా అందజేశారు. అనంతరం వీణా మాన్వీ సోషల్ మీడియా వేదికగా కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచినందుకు పార్టీకి ధన్యవాదాలు తెలియజేశారు. బంకిపూర్ ప్రజల గొంతుకగా నిలుస్తానని, పార్టీ అంచనాలకు అనుగుణంగా పనిచేస్తానని ఆమె హామీ ఇచ్చారు.

## శ్రీలంక జైలులో రక్తపాతం..మృతుల సంఖ్య 25కు పెరుగుదల

**కొలంబో, జులై 6:** శ్రీలంక పశ్చిమ తీరంలోని నెగోంబో జైలులో జరిగిన ఘర్షణలు తీవ్ర విషాదానికి దారితీశాయి. ఖైదీల మధ్య చెలరేగిన హింసలో మృతుల సంఖ్య 25కు చేరింది. ఈ విషయాన్ని సోమవారం అక్కడి అధికారులు అధికారికంగా వెల్లడించారు. రెండు ప్రత్యర్థి ఖైదీ వర్గాల మధ్య ప్రారంభమైన ఘర్షణలు క్రమంగా హింసాత్మకంగా మారాయి. సోమవారం కూడా పరిస్థితి ఉద్రిక్తంగానే కొనసాగింది. కొందరు ఖైదీలు జైల్లోని ఆయుధాలను స్వాధీనం చేసుకోవడంతో భద్రతా పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారింది.స్థానిక మీడియా కథనాల ప్రకారం.. ఈ ఘర్షణల్లో ఇప్పటివరకు 19 మంది మృతి చెందగా, వంద మందికిపైగా గాయపడ్డారు.

## మోహన్‌లాల్‌ను వెంటాడుతున్న ఏనుగుదంతాల కేసు




**తిరువనంతపురం,జులై 6:** మలయాళ సూపర్ స్టార్, పద్మభూషణ్ మోహన్‌లాల్‌ను సుదీర్ఘకాలంగా వేధిస్తున్న ఏనుగుదంతాల అక్రమనిల్వ కేసు కేరళ హైకోర్టులో కొత్త మలుపు తిరిగింది. గతంలో ఆయన ఆదాయపు పన్ను శాఖకు సమర్పించిన వాలంటరీ డిస్క్లోజర్ స్కీమ్ నివేదిక ఇప్పుడు న్యాయస్థానం ముందుకు వచ్చింది.ఆ పత్రాల ప్రకారం మోహన్‌లాల్ వద్ద కేవలం నాలుగు మాత్రమే కాకుండా, మొత్తం 10 ఏనుగు దంతాలతోపాటు దంతాలతో చేసిన మరో 1 కళాఖండాలు ఉన్నాయి. 2011 జూన్ నెలలో మోహన్‌లాల్‌కు చెందిన ఇళ్లు, ఆఫీసులపై ఆదాయపు పన్ను శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో కొచ్చిలోని సొంత నివాసంలో నాలుగు ఏనుగు దంతాలు దొరికాయి.

## దలైలామాకు ప్రధాని మోడీ జన్మదిన శుభాకాంక్షలు

**న్యూఢిల్లీ,జులై 6:** ప్రముఖ బౌద్ధ గురువు దలైలామా 91వ పుట్టిన రోజును పురస్కరించుకుని భారత ప్రధాని నరేంద్ర మోడీ శుభాకాంక్షలు తెలియజేశారు.ప్రపంచ శ్రేయస్సు పట్ల ఆయనకున్న నిబద్ధత ప్రశంసనీయమన్నారు. ఈ మేరకు సోమవారం తన ఎక్స్ ఖాతాలో ఓ పోస్టు పెట్టారు.

# అఖండ భారత్ సాధనకు శ్యాంప్రసాద్ ముఖర్జీ జీవితాంతం కృషి



సోమవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో డాక్టర్ శ్యాంప్రసాద్‌ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

## కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో నాటకాలు ఆడుతున్న బిఆర్ఎస్, కాంగ్రెస్

### బిజెపి కార్యాలయంలో శ్యాంప్రసాద్‌ముఖర్జీ జయంతి వేడుకల్లో పార్టీ రాష్ట్ర చీఫ్ ఎన్.రాంచందర్‌రావు

**హైదరాబాద్, జులై 6, ప్రభాతవార్త:** ఏక్ దేశ్.. ఏక్ విధాన్.. ఏక్ ప్రధాన్ అనే మహోన్నత సంకల్పంతో అఖండ భారత సాధన కోసం జీవితాంతం కృషి చేసిన భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు నాంపల్లిలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై, శ్యామా ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవినీతిపై అటు కాంగ్రెస్ ప్రభుత్వం, బిఆర్ఎస్ పార్టీలు ఆడుతున్న రాజకీయ నాటకంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో జియో టెక్నికల్ రిపోర్టులు, ఇతర సాంకేతిక పరీక్షల ద్వారా డ్యాం సేఫ్టీ చర్యల్లేవని నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ స్పష్టం చేసినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు రిపేర్ పనులు ప్రారంభించక పోవడం వారి ఘోర నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టును ఒక ఏటిఎంలా మార్చుకుని, కేవలం డబ్బు, అహంకారంతోనే తరతరాలుగా రాజకీయం చేయొచ్చని భావించిందని విమర్శించారు. ఇప్పుడు అధికారంలో ఉన్న సిఎం రేవంత్ రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన భారీ అవినీతిని పూర్తిగా మర్చిపోయారని, అక్కడ జరిగిన అవినీతిపై ఎలాంటి కఠిన చర్యలు లేవని, కేవలం కొందరు అధికారులపై నామమాత్రంగా చర్యలు తీసుకుని చేతులు దులుపుకున్నారని మండిపడ్డారు. కాళేశ్వరం అవినీతిపై రేవంత్ రెడ్డికి ఉన్న ఈ హఠాత్తు మమకారం వెనుక రహస్యం ఏంటో ప్రజలకు సమాధానం చెప్పాలని, ఇరు పార్టీలు కలిసి నాటకాలు ఆడుతూ ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్నాయని ఆరోపించారు. మరోవైపు హైదరాబాద్ నగరంలో హైడ్రా వ్యవహరిస్తున్న తీరుపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలో హైడ్రా పేరుతో పేదవాళ్ల ఇళ్లను నిర్ధాక్షిణ్యంగా కూలగొడుతున్న ప్రభుత్వం.. ఎంఐఎం పార్టీకి సంబంధించిన అక్రమ కట్టడాల జోలికి ఎందుకు వెళ్లడం లేదని ప్రశ్నించారు. ఎంఐఎంకు సంబంధించిన ఫాతిమా విద్యాసంస్థల విషయంలో స్పష్టంగా నిబంధనలను ఉల్లంఘించిందని, అదేవిధంగా స్వయంగా విద్యాశాఖ కూడా అనుమతులే లేవని కోర్టుకు తెలపడాన్ని ఆయన గుర్తుచేశారు. అంతేకాకుండా హైకోర్టు సైతం తప్పు పట్టిందని గుర్తుచేశారు. స్వయంగా హైడ్రా కూడా ఇది ఆక్రమణే అని అంగీకరించినప్పటికీ, అంత స్పష్టంగా కనబడుతున్న ఆ స్కూలును, భవనాలను ఎందుకు కూల్చివేయడం లేదని నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎంఐఎంతో ఉన్న దోస్తానా వల్లే ఈ వివక్ష కొనసాగుతున్నారని, హైడ్రా అంటే కేవలం పేదవాళ్ల ఇళ్లను కూల్చడానికి ఉందా అని దుయ్యబట్టారు. ఎంఐఎం అన్ని రూల్స్ ఉల్లంఘించి చెరువుల పక్కన కట్టడాలు కడితే హైడ్రా పర్మిషన్లు ఇస్తుందా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైడ్రా అనేది నిష్పక్షపాతంగా పనిచేయాలని, పేదవాళ్లకు ఒక న్యాయం, ఎంఐఎంకు ఒక న్యాయం ఉండటానికి వీల్లేదని స్పష్టం చేశారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం ఎంఐఎంకు చెందిన అక్రమ ఇన్‌స్టిట్యూషన్స్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కాంగ్రెస్, ఎంఐఎం, హైడ్రా పక్షపాత వైఖరిపై భారతీయ జనతా పార్టీ పెద్ద ఎత్తున ప్రజాపోరాటం చేస్తుందని రాంచందర్‌రావు హెచ్చరించారు.

## వైద్యమంత్రి దామోదర రాజనర్సింహతో మహిళా కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి భేటీ

**హైదరాబాద్, జులై 6, ప్రభాతవార్త:** రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను సోమవారం ఆల్ ఇండియా మహిళా కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జి మ యూరిసింగ్ హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో సోమవారం మ ర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సిం హతో ప్రభుత్వం మహిళా సాధికారత, సంక్షేమం, మహిళల ఆరోగ్యం, అభివృద్ధి కోసం చేపట్టిన కార్యక్రమాలపై చర్చిం చారు. మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమం కోసం చేపట్టిన కార్యక్రమాలను ప్రజల్లోకి



పెద్దఎత్తున తీసుకెళ్లేందుకు మంత్రి దామోదర రాజనరసింహతో చర్చించారు. వైద్య, ఆరోగ్య, కుటుంబసంక్షేమ శాఖల్లో మహిళా సాధికారత కోసం అనేక కార్యక్ర మాలను అమలు చేస్తున్నామన్నారు. నర్సింగ్ ఆఫీసర్ల నియామకాలు, వైద్య విద్య, ఆరోగ్య మహిళా, సెల్ఫ్‌హెల్ప్ గ్రూప్‌ల బలోపేతానికి ప్రభుత్వం తీసుకున్న మహిళ ప్రాధాన్యత అంశాలపై చర్చించారు. రాష్ట్రంలో మహిళా కాంగ్రెస్ పటిష్టతకు కృషి చేస్తున్నామని మంత్రి దామోదర రాజనర్సింహ ఆమెకు వివరించి చెప్పారు.

## విద్యుత్ పంపిణీ సంస్థలో పునర్వ్యవస్థీకరణ

### ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు

**హైదరాబాద్, జులై 6, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని మూడో రైతు ఉచిత విద్యుత్ పంపిణీ సంస్థ (ఆర్పీడీసీఎల్) పరిధిలోకి ఉద్యోగుల బదిలీలు, కేటాయింపుల ప్రక్రియ వేగం పుంజుకుంది. ఈ నేపథ్యంలో దక్షి ణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్) లోని సిబ్బంది నిర్మాణాన్ని పునర్వ్యవస్థీకరించేందుకు ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తూ ఆ సంస్థ సీఎండీ జితేష్ వి పాటిల్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీలో మొత్తం 11 మంది అధికారులతో కూడిన ఈ ఉన్నత స్థాయి కమిటీకి డైరెక్టర్ (కమర్షియల్ అండ్ హెచ్‌ఆర్డీ) చైర్మన్ గా డైరెక్టర్ (ఆపరేషన్), డైరెక్టర్ (ఫైనాన్స్)తో పాటు, ఐదుగురు సీఈలు, జీఎం (అడ్మిన్), డీఈ (ఎంపీపీ), ఈఈ (క్వాలిటీ) సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ సంస్థలోని ప్రస్తుత సిబ్బంది స్థితిగతులను క్షుణ్ణంగా అధ్యయనం చేసి, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సిబ్బంది పునర్వ్యవస్థీకరణపై సమగ్ర నివేదికను సమర్పించనుంది. కాగా రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ, దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థతో పాటు, ఉచితానికి సంబంధించి మూడో విద్యుత్ పంపిణీ సంస్థగా ఆర్పీడీసీఎల్ ఏర్పాటుకు ప్రభుత్వం గతంలోనే ఆమోదం తెలిపింది. ఈ కొత్త డిస్కంకు ఆస్తులు, అప్పులు, వినియోగదారుల కేటగిరీలు, సిబ్బంది బదిలీకి సంబంధించిన విధివిధానాలను సైతం ఖరారు చేసింది. దీని ప్రకారం దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థకు చెందిన వివిధ కేడర్ల నుంచి పెద్ద సంఖ్యలో ఉద్యోగులను కొత్త డిస్కంలో ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్, అడ్మినిస్ట్రేటివ్, టెక్నికల్ విధులను నిర్వహించేందుకు బదిలీ/కేటాయింపు చేస్తున్నారు. ఈ విధంగా భారీ సంఖ్యలో సిబ్బంది కొత్త డిస్కాంకు వెళ్తుండటంతో, ప్రస్తుతం దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలో ఉన్న ఉద్యోగుల పరిస్థితిని సమీక్షించేందుకు ప్రభుత్వం ఈ కమిటీని నియమించింది.

## మరో ఏడు సహకార సంఘాలకు పర్సన్ ఇన్‌చార్జ్‌ల కమిటీలు

### ఎన్నికలు జరిగేంత వరకూ పర్యవేక్షణ

**హైదరాబాద్, జులై 6, ప్రభాతవార్త:** రాష్ట్రంలో మరో 7 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (పిఎసిఎస్)లకు ప్రత్యామ్నాయ పర్సన్‌ఇన్ చార్జ్ కమిటీలను నియమిస్తూ సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ సహకార సంఘాల చట్టం ప్రకారం ఈ కమిటీ ఆరు నెలలపాటు లేదా ఆయా సంఘాలకు ఎన్నికలు నిర్వహించే వరకు లేదా ప్రభుత్వం తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకు, ఏది ముందైతే అది వర్తించే విధంగా నియమించడం జరిగిందని సోమవారం విడుదల చేసిన ఉత్తర్వుల్లో వెల్లడించింది. ఈ ఏడు సహకార సంఘాల్లో కరీంనగర్ జిల్లాలోని దేవంపల్లి, గట్టుదుద్దెనపల్లి, జిల్లా కేంద్రం భువనగిరితో పాటు, జిల్లాలోని చందుపట్ల బీబీనగర్, వరంగల్ జిల్లాలోని నల్లబెల్లి, వికారాబాద్ జిల్లాలోని పూడూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు ప్రత్యామ్నాయ నాన్ అఫీషియల్ పర్సన్‌ఇన్‌చార్జ్ కమిటీలను నియమించింది. ఇప్పటికే రాష్ట్రంలోని 20 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు ప్రత్యామ్నాయంగా నాన్‌అఫీషియల్ పర్సన్‌ఇన్‌చార్జ్ కమిటీలను నియమిస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది. ఈ కమిటీలు వెంటనే బాధ్యతలు స్వీకరించి ఆయా సహకార సంఘాల నిర్వహణను పర్యవేక్షి ంచనున్నాయి. ఉత్తర్వుల అమలుకు అవసరమైన తదుపరి చర్యలు చేపట్టాలని సహకార సంఘాల ప్రత్యేక కమిషనర్ ను ప్రభుత్వం ఆదేశించింది. కాగా సంఘాల పరిధిలోని రైతులకు ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా, వారి సేవలకు ఎక్కడా అంతరాయం ఏర్పడకుండా ఉండేందుకే ప్రభుత్వం ఈ తాత్కాలిక ఏర్పాట్లు చేసింది. పీఏసీఎస్‌ల పూర్తి స్థాయి పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ పూర్తయ్యే వరకు ఈ నూతన పర్సన్‌ఇన్‌చార్జ్ కమిటీలు బాధ్యతల్లో ఉంటాయి. ఎన్నికలు నిర్వహించి కొత్త పాలకవర్గం కొలువుదీరే వరకు ఇవి సహకార సంఘాలకు సంబంధించిన రోజువారీ కార్యకలాపాలు, ఆర్థిక లావాదేవీలు, మరియు రైతులకు అందే రుణాల పంపిణీ వంటి వ్యవహారాలను పర్యవేక్షిస్తాయి.

## సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

# ప్రశ్న రావణ్‌పై ఉపా చట్టప్రయోగం భావప్రకటనా స్వేచ్ఛపై దాడి

**హైదరాబాద్, జులై 6, ప్రభాతవార్త:** ప్రశ్న రావణ్ అనే యూట్యూబర్‌పై అత్యంత కఠినమైన చట్టవ్యతిరేక కార్యకలాపాల నివారణ (ఉప)చట్టం చట్టాన్ని ప్రయోగించడాన్ని సిపిఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తోందనీ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ఒక ప్రకటనలో తెలిపారు. దేశ సమగ్రతను, భద్రతను కాపాడటానికి ఉద్దేశించిన ఈ చట్టాన్ని, ప్రభుత్వ విధానాలను విమర్శించిన ఒక సామాన్య యూట్యూబర్‌పై ప్రయోగించడం అత్యంత దుర్మార్గం. ఇది భావప్రకటనా స్వేచ్ఛపై జరుగుతున్న దాడని సిపిఐ(ఎం) భావిస్తున్నది. తక్షణమే రావణ్‌పై నమోదు చేసిన అక్రమ కేసులను, "ఉప"సెక్షన్లను ఎత్తివేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని సిపిఐ(ఎం) డిమాండ్ చేస్తోంది. రావణ్‌పై నమోదైన కేసుల్లో కోర్టులు ఏకంగా నాలుగుసార్లు బెయిల్ ఇచ్చినప్పటికీ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అతనిపై పగబట్టి ఐదవసారి అత్యంత కఠినమైన, ప్రమాదకరమైన ఉప చట్టాన్ని ప్రయోగించడం కక్షసాధింపులో భాగమే. ఉపముఖ్యమంత్రి పర్యటనలో మాట్లాడిన మాటలనే అనుకరించి మాట్లాడితే రావణ్‌పై ఉపచట్టం పెడితే, ఉపముఖ్యమంత్రిపై కేసు పెడతారా? ఇది చట్టాన్ని, న్యాయ వ్యవస్థను ధిక్కరించడమే అని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. ఉప చట్టాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రాజకీయ కక్షసాధింపులకు ప్రజా గొంతుకలను నొక్కడానికి ఆయుధంగా వాడుకోవడం రాజ్యాంగ స్ఫూర్తికే విరుద్ధం. సమాజంలో జరుగుతున్న పరిణామాలపై, ప్రభుత్వ వైఫల్యాలపై ప్రశ్నలు అడిగే వారిని ఉగ్రవాదులతో సమానంగా ప్రజలలో భయాందోళనలను వ్యక్తం అవుతున్నాయనీ ఆవేదన చెందారు. ప్రజాస్వామ్యబద్ధంగా ప్రశ్నించే హక్కును ఎవరూ కాలరాయలేరని, ఇటువంటి నిరంకుశ చర్యలకు వ్యతిరేకంగా ప్రజలు గొంతెత్తాలని సిపిఐ(ఎం) విజ్ఞప్తి చేస్తున్నది.

# ఫీడర్, స్ట్రక్చర్ కోడ్ బిల్లింగ్ పరిశీలన

### ఎస్పీడిసిఎల్ సిఎండి జితేష్

**హైదరాబాద్, జులై 6, ప్రభాతవార్త:** ఫీడర్ వారీగా విద్యుత్ నిర్మాణాలు, స్ట్రక్చర్ కోడ్ ఆధారంగా వినియోగదారుల సేవల బిల్లింగ్ ప్రక్రియపై ఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్ క్షేత్రస్థాయిలో విస్తృత తనిఖీ నిర్వహించారు. హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాల్లో సోమవారం ఆయన ఆపరేషన్ మెయింటెనెన్స్ సిబ్బంది, ఆర్టిజన్లు ప్రైవేట్ మీటర్ రీడర్లతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి విధుల నిర్వహణ, బిల్లింగ్ విధానం, ఫీల్డ్ స్థాయిలో ఎదురవుతున్న సమస్యలపై వివరాలు తెలుసుకున్నారు. వినియోగదారులకు జారీ చేసే స్పాట్ బిల్లులు తప్పనిసరిగా సంబంధిత స్ట్రక్చర్ కోడ్ ఆధారంగానే నమోదు కావాలని, తద్వారా బిల్లింగ్ ప్రక్రియలో ఖచ్చితత్వం పెరిగి విద్యుత్ వ్యవస్థ నిర్వహణ మరింత సమర్థవంతంగా మారుతుందని ఈ సందర్భంగా అధికారులకు సూచించారు. పలు డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్‌లను సందర్శించి వినియోగదారుల సర్వీసుల మ్యాపింగ్ విధానం, బిల్లింగ్ సమయంలో డేటా నమోదు ప్రక్రియ, ఫీల్డ్ స్థాయిలో ఎదురవుతున్న సవాళ్లు వాటి పరిష్కార మార్గాలపై సమీక్ష నిర్వహించారు. డీటీఆర్ స్థాయిలో వినియోగదారుల సేవల ఖచ్చితమైన మ్యాపింగ్ ద్వారా విద్యుత్ నెట్‌వర్క్‌కు సంబంధించిన సమగ్ర సమాచారం అందుబాటులోకి వస్తుందని, దీని ద్వారా లోపాలను వేగంగా గుర్తించడం, విద్యుత్ అంతరాయాల విశ్లేషణ, సాంకేతిక మరియు వాణిజ్య నష్టాల నియంత్రణ, వినియోగదారుల సేవల మెరుగుదల వంటి అనేక ప్రయోజనాలు సాధ్యమవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని నాణ్యతతో పాటు వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. అనంతరం నిర్వహించిన లైన్‌మెన్‌ల భద్రతా అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న సీఎండీ గారు, విద్యుత్ ఉద్యోగుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తున్నట్లు వెల్లడించారు. విద్యుత్ వ్యవస్థలో పనిచేసే ప్రతి ఉద్యోగి భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. పని ప్రారంభానికి ముందు తప్పనిసరిగా లైన్ క్లియర్ పొందడం, వ్యక్తిగత భద్రతా పరికరాలు ధరించడం, సరైన ఎర్తింగ్ ఏర్పాటు చేయడం, ఆమోదిత భద్రతా పరికరాలు, సాధనాలను వినియోగించడం వంటి అంశాల్లో ఎటువంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని స్పష్టం చేశారు. విద్యుత్ సేవల నాణ్యత, బిల్లింగ్ ఖచ్చితత్వం, వినియోగదారుల సేవల మెరుగుదలతో పాటు, ఉద్యోగుల భద్రతను సమాన ప్రాధాన్యతతో ముందుకు తీసుకెళ్లేందుకు కట్టుబడి ఉన్నట్లు స్పష్టం చేశారు.

# రెండు లక్షల ఉద్యోగాలపై శ్వేతపత్రం విడుదల చేయాలి

### సిఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాసిన బిజెఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

**హైదరాబాద్, జులై 6, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ ఒక్క హామీని పూర్తిస్థాయిలో నెరవేర్చలేదని బిజెఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మండిపడ్డారు. రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాల హామీపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాసారు. ఇప్పటివరకు ఎన్ని ఉద్యోగాలు భర్తీ చేశారో ప్రభుత్వం వెల్లడించాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులపై నమోదు చేసిన అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణలో దాదాపు 20 వేల పోలీస్ ఖాళీలు ఉన్నప్పటికి....ప్రభుత్వం కేవలం 7,437 పోస్టులకే నోటిఫైడ్ చేసి ఆర్థిక శాఖ అనుమతి ఇవ్వడం సరికాదన్నారు. నిరుద్యోగ యువతకు ఇది తీవ్ర అన్యాయం అన్నారు. అన్ని ఖాళీలను వెంటనే భర్తీ చేయాలన్నారు. జీఓ 46 వల్ల గ్రామీణ ప్రాంత అభ్యర్థులకు అన్యాయం జరుగుతుందని, ప్రాంతాల వారీగా కటాఫ్ విధానం వల్ల ప్రతిభ ఉన్న అభ్యర్థులు నష్టపోతున్నారని అన్నారు. ఎన్నికల ముందు జీఓ 46ను రద్దు చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. కానీ ఇప్పటి వరకు సదరు జిఓను రద్దు చేయాలన్నారు.

# జగ్జీవన్‌రామ్ ఆశయాల ఆచరణే ఘన నివాళి

### పిసిసి ఎస్సీ విభాగం రాష్ట్ర చీఫ్ కవ్వంపల్లి సత్యనారాయణ

**హైదరాబాద్, జులై 6, ప్రభాతవార్త:** అణగారిన వర్గాలు మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ ఆశయాలను నిబద్ధతతో ఆచరించి దేశంలో ప్రజాస్వామిక విలువలు ఓట్‌చోరీ,సీట్ చోరీతో కొల్లగొట్టకుండా అప్రమత్తతతో ఉండటమే ఆ మహానేతకు ఘనమైన నివాళి ఇవ్వడం అవుతుందని టిపిసిసి ఎస్సి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డా.కవ్వంపల్లి సత్యనారాయణ పిలుపు నిచ్చారు.

భారత రత్న, సామాజిక సమతావాది, మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో సోమవారం తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ విభాగం ఆధ్వర్యంలో ఘన స్మారక సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు బాబూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, అణగారిన వర్గాల అభ్యున్నతి, సామాజిక న్యాయం, సమానత్వం కోసం బాబూ జగ్జీవన్ రామ్ చేసిన విశిష్ట సేవలు భారతదేశ చరిత్రలో చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని, రాజ్యాంగ విలువలను పరిరక్షిస్తూ సమసమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో టిపిసిసిఎస్ సి విభాగం అధికార ప్రతినిధి హెచ్.ఆర్. మోహన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు అడ్వకేట్ నరేన్ రాజా అనేరాలి, రాష్ట్ర వైస్ చైర్మన్ ముంజగళ్ల విజయకుమార్, ఉపాధ్యక్షులు జీవన్ జ్యోతి, రాష్ట్ర కార్యదర్శి బారా రాజ్ కుమార్, ఖైరతాబాద్ జిల్లా చైర్మన్ బైండ్ల శ్రీనివాస్, హైదరాబాద్ జిల్లా చైర్మన్ నిఖిల్, అలాగే దబెట రమేష్, ఇంజామూరి, యాదగిరి, తిప్పర్తి శ్రీధర్ తదితర నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాబూజీ చూపిన మార్గంలో నడుస్తూ సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తామని నాయకులు పునరుద్ఘాటించారు.

కార్యక్రమంలో పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని బాబూ జగ్జీవన్ రామ్‌కు ఘన నివాళులర్పించారు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

## రాముడి పేరుతో విరాళాలు.. కోట్ల స్కాంపై బిజెపి సమాధానం చెప్పాలి

### రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**హుస్నాబాద్ రూరల్, జులై 6, ప్రభాతవార్త:** అయోధ్య రామ మందిరం నిర్మాణం కోసం దేశవ్యాప్తంగా భక్తులు ఇచ్చిన విరాళాల్లో కోట్ల రూపా యల స్కాం జరిగిందని, దీనిపై బీజేపీ నాయకులు దేశ ప్రజలకు సమా ధానం చెప్పాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. హుస్నాబాద్ మండలం జెల్లెలగడ్డలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.రామ జన్మభూమిలో రామ మందిర నిర్మాణానికి దేశంలోని కోట్లాది మంది ప్రజలు తమ స్థోమతకు తగ్గట్టుగా విరాళాలు అందించారని మంత్రి గుర్తు చేశారు. అయితే భక్తుల విశ్వాసంతో సమకూరిన ఆ నిధుల్లో కోట్ల రూపాయల అవినీతి జరిగిందనే ఆరోపణలు వెలుగులోకి రావడం అత్యంత దురదృష్టకరమన్నారు. రాముడి పేరు మీద, అక్షింతల పేరు మీద ప్రజల వద్దకు వెళ్లి విరాళాలు సేకరించిన బీజేపీ నాయకులు ఇప్పుడు ఈ వ్యవహారంపై నోరు విప్పాలని డిమాండ్ చేశారు. అయోధ్య ప్రజలు బీజేపీ నాయకుల అసలు స్వరూపాన్ని ముందుగానే గుర్తించారని, అందుకే అక్కడ బీజేపీ ఎంపీ అభ్యర్థిని ఓడించారని వ్యాఖ్యానించారు. అవినీతి విషయంలో బీజేపీ నాయకులు దేశ ప్రజలందరికీ క్షమాపణ చెప్పాలని అన్నారు. భక్తి పేరు మీద, రాముడి పేరు మీద రాజకీయాలు చేసే వారి నిజస్వరూపాన్ని ప్రజలు గుర్తించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో అక్షింతలు పంచి, విరాళాల పేరుతో ప్రజల నుంచి డబ్బులు సేకరించిన నాయకులు ఇప్పుడు ఈ ఆరోపణలపై తమ వైఖరిని వెల్లడించాలని అన్నారు.ఈ సందర్భంగా కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డిపై కూడా మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర విమర్శలు చేశారు. 'మజ్లిస్ పేరు ప్రస్తావించకుండా కిషన్ రెడ్డి రాజకీయాలు చేయలేరు. ఎన్నికల్లో గెలవాలంటే మజ్లిస్‌ను తిట్టాల్సిందే అన్నట్టుగా వారి రాజకీయాలు సాగుతున్నాయి' అని వ్యాఖ్యానించారు. మంత్రి చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

## 8న ప్రజలతో ముఖాముఖికి మంత్రి వివేక్ గాంధీభవన్‌కు రాక

### విన్నపాల పరిష్కారానికి సంగిశెట్టి, గాల్‌రెడ్డి కమిటీ కృషి

**హైదరాబాద్, జులై 6, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ముఖ్య ప్రకటతెలంగాణ రాష్ట్ర ప్రజల సమస్యలను సత్వరంగా పరిష్కరిం చేందుకు, ప్రజలకు ప్రభుత్వం-పార్టీ మధ్య ప్రత్యక్ష వేదికగా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి బుధవారం నిర్వహిస్తున్న 'ప్రజలతో ముఖాముఖి' కార్యక్రమంలో ఈ వారం కార్మిక, ఉపాధి, శిక్షణ కర్మాగారాల శాఖ, గనులు భూగర్భ శాస్త్ర శాఖల మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి పాల్గొని ప్రజల నుండి వినతులు స్వీకరిం చనున్నారు. గాంధీభవన్‌లో జూలై8న ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంటల వరకు మంత్రి ప్రజలకు అందుబాటులో ఉంటారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలు అవసరమైన ఆధార పత్రాలతో రావాలని కోరడమైనది.ప్రజలు సమర్పించిన వినతులను సంబంధిత ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసి, వీలైనంత త్వరగా పరిష్కారం లభించేలా 'ప్రజలతో ముఖాముఖి' కమిటీ నిరంతరం కృషి చేస్తోంది. టిపిసిసి ఉపాధ్యక్షులు సంగిశెట్టి జగదీశ్వర్‌రావు, గాల్‌రెడ్డి కమిటీకి నేతృత్వం వహిస్తున్నారని తెలిపారు.

## 'ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి'

**హైదరాబాద్, జులై 6, ప్రభాతవార్త:** యూనిఫైడ్ సర్వీస్ రూల్స్ విషయంలో రాజ్యాంగబద్ధమైన చిక్కులు తొలగించాలని ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని సోమవారం కలిసిన తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు,ప్రధాన కార్యదర్శి ఓడ్నాల రాజశేఖర్, తెల్కలపల్లి పెంటయ్య, సంఘటన కార్యదర్శి హనుమంతరావు,ఎబిఆర్‌ఎస్‌ఎం ప్రతినిధి సూరం విష్ణువర్ధన్ రెడ్డి, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి దుబాసి భాస్కర్ మెమోరాండం ఇచ్చారు. పిఆర్‌సి డిఎ పెండింగ్ బిల్లు ల తో పాటు కెజిబివి ఉపాధ్యాయనిలకు 29 రోజుల సమ్మె శాలరీ చెల్లించాలని డిమాండ్ చేవారు. ఎంటిఎస్ అమలు చేయాలని, 2003 డిఎస్‌సి ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపచెయ్యాలని, సిపిఎస్ రద్దు చేయాలనీ తెలిపారు. 190 జీవో ప్రకారం అప్పీల్ చేసిన ప్రతి ఉపాధ్యాయునికి ఉత్తర్వులు ఇవ్వాలి. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 పద్దు కిందనే సాలరీలు చెల్లించాలనీ కోరారు. అన్ని రకాల గురుకుల, ఆశ్రమ, ఏయిడెడ్ విద్యాలయ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తూ,జూలై 14 న జిల్లా కలెక్టరెట్ల వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు మంత్రికి ఉపాధ్యాసంఘాలు తెలిపారు. ఉపా ధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొంటారని దానికి మంత్రి రావాలని కోరారు.

## ఎస్సీ ఉపకులం మాంగ్ కులపత్రాలకు కీలక సవరణలు

**హైదరాబాద్, జులై 6, ప్రభాతవార్త:** ఎస్సీ ఉపకులాల్లో మాంగ్ సామాజిక వర్గానికి చెందిన ప్రజలు క్యాస్ట్ సర్టిఫికెట్లు పొందేందుకు ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక సవరణలు చేసింది. ఈ మేరకు దీనికి సంబంధించి సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి విజయేంద్ర బోయి ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఉన్న నిబంధనల ప్రకారం మాంగ్ సామాజిక వర్గానికి కుల ధృవీకరణ పత్రాలు జారీ చేసే అధికారం కేవలం రెవెన్యూ డివిజనల్ అధికారి, సబ్ కలెక్టర్, అసిస్టెంట్ కలెక్టర్ స్థాయి అధికారులకు మాత్రమే ఉండేది. తాజా సవరణ ప్రకారం రాష్ట్రంలోని అందరూ తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లకు మాంగ్ సామాజిక వర్గలకు ఈ ధృవీకరణ పత్రాలను జారీ చేసే అధికారాన్ని కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఇక రాష్ట్రంలో మాంగ్ జనాభా సుమారు 30 వేల మంది ఉన్నట్లు తెలుస్తోంది. ఈ కొత్త నిబంధనలను వెంటనే తెలంగాణ రాష్ట్ర గెజిట్లో ప్రచురించాలని, మీసేవ కేంద్రాలు, ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ విభాగాలకు సమాచారం అందిం చాలని ప్రభుత్వం ఆదేశించింది.

# అత్యల్ప పెన్షన్‌తో ఇబ్బందులు పడుతున్న సిపిఎస్ ఉద్యోగులు

### రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి సంజయ్‌జాజును కలిసిన రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ యూనియన్

**హైదరాబాద్, జులై 6, ప్రభాతవార్త:** అత్యల్ప పెన్షనతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్న సిపిఎస్ ఉద్యోగులకు సామాజిక భద్రత కల్పించాలని సిపిఎస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు స్థితప్రజ్ఞ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సుమారు 2.6 లక్షల మంది ఉద్యోగులు, ఉపాధ్యాయుల తరఫున సిపిఎస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు స్థితప్రజ్ఞ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్ లు సోమవారం రాష్ట్ర చీఫ్ సెక్రటరీ సంజయ్‌జాజును కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఎస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు స్థిత ప్రజ్ఞ మాట్లాడుతూ, 2004 సెప్టెంబర్ 1 నుంచి అమల్లోకి వచ్చిన సిపిఎస్ విధానం ఉద్యోగుల పదవీ విర మణ అనంతర సామాజిక భద్రతను పూర్తిగా దెబ్బ తీసిందన్నారు. ఇప్పటికే పదవీ విరమణ చేసిన 2 వేల మంది సిపిఎస్ ఉద్యోగులు అత్యల్ప పెన్షన్‌తో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

అందువల్ల సిపిఎస్‌ను రద్దు చేసి వెంటనే పాత పెన్షన్ విధానం ను పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని కోరారు.అలాగే, 2023 సంవత్సరం నుంచి పెండింగ్‌లో ఉన్న డిఎ బకాయిలను సిపిఎస్ ఉద్యోగులందరికీ ఒకే విడతలో విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. పెరుగుతున్న ద్రవ్యోల్బణం నేపథ్యంలో ఈ బకాయిలు ఉద్యోగులకు ఎంతో అవసరమని స్థితప్రజ్ఞ పేర్కొన్నారు.ఇటీవల విడుదలైన ఈహెచ్‌ఎస్ జి.ఓ. ఎంఎస్. నెం.79లో పదవీ విరమణ చేసిన సిపిఎస్ ఉద్యోగుల నుంచి చివరి బేసిక్ పే ఆధారంగా 1.5 శాతం చందా వసూలు చేయాలనే నిబంధన తీవ్ర అన్యాయమని తెలిపారు. ప్రస్తుతం వారికి వస్తున్న స్వల్ప పెన్షన్‌తో పోలిస్తే ఈ చందా భారం భరించలేనిదిగా ఉందని, కొన్ని సందర్భాల్లో ఆ చందా మొత్తం నెలవారీ పెన్షన్‌కన్నా ఎక్కువగా ఉండే పరిస్థితి ఏర్పడుతోందన్నారు.అందువల్ల పదవీ విరమణ చేసిన సీపీఎస్ ఉద్యోగుల ఈహెచ్‌ఎస్ చందాను చివరి బేసిక్ పే ఆధారంగా కాకుండా, ఉచిత వైద్య సౌకర్యం కల్పించేలా జి.ఓ. ఎంఎస్. నెం.79లో తక్షణ సవరణలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.రాష్ట్రంలోని 2.6 లక్షల మంది సీపీఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సామాజిక, ఆర్థిక, ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ మూడు ప్రధాన డిమాండ్లపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుంటుందనే విశ్వాసాన్ని నాయకులు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ మల్లికార్జున్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు నరేందర్ రావు లు పాల్గొన్నారు.

## రైతుల ఖాతాల్లో రూ.7,490.72 కోట్లు జమ

### వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, జులై 6, ప్రభాతవార్త:** రైతు భరోసా కింద రాష్ట్రంలోని 68.37 లక్షల మందికి రూ.7,490.72 కోట్లను వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు. వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. అరో రోజు సోమవారం 6 నుంచి 7 ఎకరాల వరకు భూమి కలిగిన రైతులకు జమ చేసినట్లు ఒక ప్రకటనలో వెల్లడించారు. ఇప్పటికే ఐదు విడతల్లో 6 ఎకరాల వరకు సాగుభూమి కలిగిన రైతులకు రైతు భరోసా సాయం అందించామన్నారు.



## బసవతారకం కేన్సర్ ఆస్పత్రిని సందర్శించిన బాలీవుడ్ నటుడు సంజయ్‌దత్

**హైదరాబాద్, జులై 6, ప్రభావార్త:** బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ హాస్పిటల్, రీసెర్చి ఇన్స్టిట్యూట్ ను సందర్శించిన బాలీవుడ్ నటుడు సంజయ్‌దత్ సోమవారం సందర్శించి అక్కడి వైద్యులు, రోగులతో సంభాషించారు. ఆంధ్రప్రదేశ్ ఎమ్మెల్యే బసవతారంక ఆసుపత్రి చైర్మన్ నందమూరి బాలకృష్ణతో పాట ట్రస్టు బోర్డు సభ్యులు నారా బ్రాహ్మణి, జెయస్ ఆర్ ప్రసాద్ లు బ్హాలీవుడ్ నటుడు సంజయ్ దత్‌ను సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం హాస్పిటల్ ఆవరణలో ఉన్న స్వర్గీయ నందమూరి బసవతారకం, నందమూరి రామారావు విగ్రహాలకు పుష్పాంజలి ఘటించారు. స్వయంగా ఊపిరితిత్తుల క్యాన్సర్ తో పోరాడిన సంజయ్ దత్ నేటి ఈ పర్యటనలో భాగంగా హాస్పిటల్ లోని పలు కీలక విభాగాలైన పెట్ సిటి, రేడియేషన్ విభాగం, బోన్ మారో ట్రాన్స్ ప్లాంట్ విభాగం, చిన్న పిల్లల వార్డులను సందర్శించి నిపుణులైన వైద్యుల ద్వారా అన్ని విషయాలను అడిగి తెలుసుకొన్నారు. రోగులతో సంభాషించి యోగ క్షేమాలు విచారించడమే కాకుండా పీడియాట్రిక్ వార్డులో ఉన్న చిన్నారులకు బహుమతులు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం హాస్పిటల్ ఆవరణలోని ఆడిటోరియంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో సంజయ్ దత్ ను నందమూరి బాలకృష్ణ శాలువా కప్పి సత్కరించారు. తర్వాత హాస్పిటల్ మొమెంటోతో పాటు వెంకటేశ్వరస్వామి ప్రతిమను ఆయనకు బహూకరించారు.

## కాళేశ్వరంపై సిబిఐ విచారణ జరగకుండా బిజెపితో బిఆర్ఎస్ కుమ్మక్కు

### ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**హైదారబాద్, జులై 6,ప్రభాతవార్త:** కాళేశ్వరంపై సిబిఐ విచారణ జరకుండా బిజెపితో బిఆర్ఎస్ కుమ్మక్కైందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆరోపించారు. సోమవారం సిఎల్‌పిలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయిన రోజు అధికారంలో ఉన్న కెసిఆర్ కనీసం విచారణ కు ఆదేశించలేదనీ మహదేవపూర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి వదిలేశారని ఆవేదన చెందారు. వారం రోజుల్లో నీళ్లు ఇచ్చే తెలివి ఉన్న కెసిఆర్ ఎలా నీళ్లు ఇస్తాడో ప్రతిపక్ష నేతగా అసెంబ్లీకి వచ్చిచెపితే మేం కూడా విని నేర్చుకుంటాం అని ఆది శ్రీనివాస్ అన్నారు. పిల్ల బచ్చాలను రోడ్ల పైకి పంపించి హడావుడి చేసి కెసిఆర్ ప్రభుత్వానికి సలహాలు ఇచ్చే ప్రతిపక్షనేత బాధ్యత నుంచి తప్పించుకుంటున్నాడనీ దుయ్యబట్టారు. ప్రతి యేడాది 240 టిఎంసిఎత్తిపోయాలన్న లక్ష్యంతో కాళేశ్వరం ప్రాజెక్టు ను నిర్మించి నా ఆ లక్ష్యం చేరుకోలేదని అన్నారు. కాళేశ్వరం నుంచి రిజర్వాయర్లు నిర్మించడం తప్ప ఎక్కడా కెనాల్స్ కట్టలేదనీ, డిస్టిబ్యూషన్ సిస్టిం ఏర్పాటు చేయలేదనీ ఇరిగేషన్ లో కీలకమైన కాలువలు కూడా తొవ్వకుండా ప్రాజెక్టు కట్టిన మేధావులు మీరనీ ఆరోపించారు. రాష్ట్రంలో ఏ పంట పండినా అది కాళేశ్వరం నీళ్లేనని కెటిఆర్, హరీష్ రావు ఊరూరా డప్పు కొట్టారనీ ఎద్దేవా చేశారు. కాళేశ్వరం కూలేశ్వరం అయ్యాక కూడా మా ప్రభుత్వ హయాంలో రికార్డు స్థాయిలో పంటలు పండించారనీ వివరించారు. ప్రాజెక్టులను ఎలా మెయింటెన్ చేయాలి, ఎప్పుడు నీళ్లు ఇవ్వాలన్నది మాకు తెలుసని అన్నారు.



ధర్నాలో అభివాదం చేస్తున్న వామపక్ష నేతలు

## ఇల్లులేని ప్రతి పేదవానికి ప్రభుత్వం ఇల్లు కట్టించాలి

### వామపక్ష నేతల డిమాండ్

**హైదరాబాద్ (ధర్నాచౌక్), జులై 6, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఇల్లులేని ప్రతి పేదవానికి ప్రభుత్వం ఇల్లు కట్టించి ఇవ్వాలని వామపక్ష నేతలు డిమాండ్ చేశారు. సోమవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో ప్రతి గుడిసెకు పట్టా, అర్హులైన ప్రతి పేదవానికి ఇల్లు అనే నినాదంతో వామపక్షాల ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హాజరై మాట్లాడుతూ పేదవాడి శ్రమ, చెమట బొట్ల నుంచే సంపద సృష్టించబడుతుందని, అలాంటి పేదల జోలికి వస్తే ఏ ప్రభుత్వం బతికి కట్టదని హెచ్చరించారు. ప్రభుత్వాలు మారినా, పేదల బతుకులు మారటం లేదని, కేవలం రేషన్‌కార్డులు, పెన్షన్లు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని విమర్శించారు. పోలీస్ యంత్రాంగం బుల్డోజర్లు చేతిలో ఉన్నాయని, పేదల గుడిసెలు నిర్దాక్షిణయంగా కూలుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భూదాన్ భూములు, ప్రభుత్వ భూములను ల్యాండ్ మాఫియా దోచుకుంటూ ఉంటే చోద్యం చూస్తున్న ప్రభుత్వం, పేదలు తలదాచుకోటానికి గుడిసె వేసుకుంటే మాత్రం కూల్చేస్తున్నారని ధ్వజమెత్తారు. ల్యాండ్ మాఫియా నుంచి ప్రభుత్వం ఎన్ని వేల ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. హైడ్రా పేరుతో పేదలను ఇబ్బంది పెట్టకుండా, పెద్ద పెద్ద కబ్జాకోరులను పట్టి జైల్లో పెట్టాలని డిమాండ్ చేశారు. సీపీఐ, సీపీఎం, న్యూడెమోక్రసీ, మావోయిస్టులు, అడవిలో ఉన్నా నగరాల్లో ఉన్నా ఎర్రజెండాలన్నీ ఒక్కటేనని, పేదల కోసం ఎంతటి త్యాగానికైనా సిద్ధమని ప్రకటించారు. ప్రభుత్వం భేషజాలకు పోకుండా కమ్యూనిస్టు పార్టీలను చర్చలకు పిలవాలని, ప్రభుత్వం స్పందించకపోతే డిమాండ్ల సాధనకోసం ఉద్యమ కార్యాచరణ ఉంటుందని స్పష్టం చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ మాట్లాడుతూ రాష్ట్రంలో ఇల్లు లేని పేదలందరికీ ఇళ్లు, ఇల్ల స్థలాలు ఇస్తామని కాంగ్రెస్ ఇచ్చిన హామీని అమలుచేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 30లక్షల మంది పేదలకు ఇల్లు లేక, అద్దె ఇళ్లల్లో జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో సీపీఐ నేతలు ఈటి నరసింహా, పశ్య పద్మ, కొత్తగూడెం మేయర్ మూడ్ గణేష్, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.డి.అబ్బాస్, సీపీఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాధినేని వెంకటేశ్వరరావు, ఎంసీపీఐ నాయకులు వనం సుధాకర్, న్యూడెమోక్రసీ నాయకులు కే.గోవర్ధన్, సీపీఐఎంఎల్ మాస్‌లైన్ నాయకులు హన్మేష్, ఎంసీపీఐ(యు) నేత గాదగోని రవి, ఎస్‌యుసిఐ(సి) రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ మురహరి, సీపీఎం నేత టి.జ్యోతి, పీఓడబ్ల్యూ సంధ్య తదితరులు పాల్గొన్నారు.

# నాటో సదస్సుకు అంకారాలో అపూర్వ భద్రతా ఏర్పాట్లు

### 70 వేల మంది భద్రతా సిబ్బంది మోహరింపు

**అంకారా, జులై 6:** నాటో శిఖరాగ్ర సదస్సు జులై 7,8 తేదీల్లో జరగనున్న నేపథ్యంలో టర్కీ రాజధాని అంకారాలో భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. దాదాపు 60 లక్షల జనాభా ఉన్న నగరంలో పదివేలల సంఖ్యలో పోలీసులు, సాయుధబలగాలను మోహరించడంతో పాటు వైమానిక రక్షణ వ్యవస్థలను అత్యంత అప్రమత్త స్థితిలో ఉంచింది. నగరవ్యాప్తంగా రహదారి ఆంక్షలు, ప్రజా సమావేశాలపై నిషేధం, కీలక ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రత అమలు చేస్తున్నారు. ఈ సదస్సుకు నాటోలోని 32 సభ్య దేశాల అధినేతలు హాజరుకానున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా పాల్గొననున్నారు. నాటోపై అమెరికా నిబద్ధతను తగ్గించవచ్చన్న ట్రంప్ వ్యాఖ్యలు, మిత్రదేశాలపై ఆయన విమర్శల నేపథ్యంలో ఈ సదస్సు రాజకీయంగా అత్యంత కీలకంగా మారింది. సదస్సు జరిగే అధ్యక్ష భవనం పరిసరాలతో పాటు విమానాశ్రయాలు, విదేశీ ప్రతినిధులు బస చేసే హోటళ్లు, అంకారాలోని ప్రధాన రహదారుల వద్ద కఠిన ఆంక్షలు అమలు చేస్తున్నారు. నాటో నేతల రాక కోసం పాత సైనిక విమానాశ్రయాన్ని విఐపీ విమానాశ్రయంగా అభివృద్ధి చేశారు. రన్‌వేలను విస్తరించి, ఆధునిక సదుపాయాలు కల్పించిన ఈ విమానాశ్రయం సదస్సు అనంతరం కూడా విఐపీ వినియోగానికే కేటాయించనున్నట్లు అధికారులు తెలిపారు. నగరంలో నిరసనలు, సంగీత కార్యక్రమాలు, పట్టభద్రుల వేడుకలను తాత్కాలికంగా నిషేధించారు. ట్రాఫిక్ రద్దీ తగ్గించేందుకు అత్యవసరం కాని ప్రభుత్వ ఉద్యోగులకు సెలవులు ప్రకటించారు. తీవ్రవాద సంస్థలతో సంబంధాలున్న అనుమానంపై 200 మందికి పైగా వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ఇస్లామిక్ స్టేట్‌కు అనుబంధంగా అనుమానితులు ఉన్నారని పేర్కొన్నారు. టర్కీ మాజీ రాయబారి, ప్రతిపక్ష ఎంపీ నామిక్ టాన్ మాట్లాడుతూ, 'నాటో చరిత్రలో ఆతిథ్య నగరంలో ఇంత కఠినమైన, విస్తృతమైన భద్రతా ఏర్పాట్లు గతంలో ఎన్నడూ చూడలేదు' అని వ్యాఖ్యానించారు. నాటో సదస్సును విమర్శిస్తూ ప్రచురణలు చేస్తున్న కొన్ని వెబ్‌సైట్లపై టర్కీ కోర్టు నిషేధం విధించింది. భద్రత, ప్రజా శాంతి దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. ప్రతిపక్ష మీడియాకు చెందిన పలువురు జర్నలిస్టులకు సదస్సు కవరేజ్‌కు అనుమతి నిరాకరించడంతో మీడియా హక్కుల సంస్థలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ నాటో సదస్సులో కూటమి ఐక్యత, రక్షణ వ్యయం, అమెరికా భవిష్యత్ పాత్ర వంటి అంశాలపై ప్రధానంగా చర్చ జరగనుంది.



# ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ నేటితో పూర్తి చేయాలి

### కలెక్టర్లకు సిఇఒ సుదర్శన్‌రెడ్డి ఆదేశం




**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై6:** తెలంగాణలో ఇప్పటి వరకు 3కోట్ల 10లక్షల (91.85శాతం) ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ జరిగిందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సిఇఒ) సి. సుదర్శన్ రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన రాష్ట్రంలో ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్రంలో కొనసాగుతున్న ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ కార్యక్రమ పురోగతిపై కలెక్టర్లతో సమీక్షి ంచారు. ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ కార్యక్రమం 7వ తేదీ(మంగళవారం) నాటికి ఎట్టిపరిస్థితులలో పూర్తి చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. ముఖ్యంగా హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాలతో పాటు పట్టణ ప్రాంతం కలెక్టర్లు దీనిపై శ్రద్ధవహించి వందశాతం ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ అయ్యేలా చూడాలన్నారు. ఎన్యూమరేషన్ ఫారాలను పూరించడంలో సూపర్ వైజర్ల ముఖ్య పాత్ర పోషించాలన్నారు. ఎక్కడైతే బిఎల్ఒలు బలహీనంగా ఉన్నారో వారిని గుర్తించి ఎన్యూమరేషన్ ఫారాలను పూరించడంలో వారికి సూపర్ వైజర్లు సహకరించాలన్నారు. ఎన్యూమరేషన్ ఫారాలను పూరించడంలో స్థానికంగా వాలంటీర్లను గుర్తించి వారి ద్వారా పూరించేందుకు ఓటర్లకు సహకరించాలని సూచించారు. సంబంధిత సూపర్ వైజర్ల ఫోన్ నెంబర్లను మీడియా ద్వారా తెలియజేయాలని కలెక్టర్లను ఆదేశించారు.

హైదరబాద్‌లో ఇప్పటికే ప్రారంభమైన 16 హెల్ప్ డెస్క్ లతో పాటు అవసరమైన చోట అదనంగా హెల్ప్ డెస్క్ లను ఏర్పాటు చేయాలని కలెక్టర్లను సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు. పూర్తయిన ఎన్యూమరేషన్ ఫారాలలో సదరు ఓటరు, బిఎల్ఒ సంతకాలు ఉండేలా చూడాలని దీంతో పాటు ఫోటోలు ఉండేలా చూడాలని సిఇఒ ఆదేశించారు. ఇఆర్ఒలు, ఎఇఆర్ఒలు విస్తృతంగా క్షేత్రస్థాయిలో పర్యటించి సర్ ప్రక్రియను వేగవంతం చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. పూర్తి చేసిన ఎన్యూమరేషన్ ఫారాలకు సంబంధించి డిజిటలైజేషన్ ప్రక్రియను ప్రారంభించాలన్నారు. పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియను కూడా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బిఎల్ఒలు తప్పనిసరిగా రాజకీయ పార్టీలతో సమావేశాలు జరిగేవిధంగా చూడాలని, సర్ ప్రక్రియపై వారికి అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సిఇఒ ఆదేశించారు.

## ప్రజాసేవే దైవసాక్షాత్కారానికి ఉత్తమ మార్గం

### గవర్నర్ శివప్రతాప్‌శుక్లా

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై6:** పజాసేవే దైవసాక్షాత్కారానికి ఉత్తమ మార్గమని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. ఆధ్యాత్మికత అనేది కేవలం పూజలు, ఆరాధనలతో పాటు అహంకారాన్ని విడిచిపెట్టడం ద్వారా పరిపూర్ణతను చేరుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర మందిర్ విశ్వ రామాయణ ఆశ్రమం, త్రివేణి సేవా మిషన్ వ్యవస్థాపకుడు, ఆధ్యాత్మిక నాయకుడు అజయ్ భాయ్ జీ నేతృత్వంలో, 108 మంది భక్తుల బృందం శ్రీశైలం మల్లికార్జున జ్యోతిర్లింగ పుణ్యక్షేత్రాన్ని దర్శించిన అనంతరం హైదరాబాద్ లోని లోక్ భవన్ లో సోమవారం సాయంత్రం గవర్నర్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లా డుతూ ప్రతి వ్యక్తి తన బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తిస్తే నాయకుడేనని, విధిని సమర్థంగా నిర్వర్తిస్తే అధికారిగా, ఆధ్యాత్మిక భావనతో జీవిస్తే సాధువుగా ఎదుగుతాడని అన్నారు. సాధువుల సంప్రదాయం లో అజయ్ జీకి ప్రత్యేక స్థానం ఉందని, ఆయన అహంకారాన్ని పూర్తిగా విడి చిపెట్టి ప్రజాసేవను జీవిత ధ్యేయంగా స్వీకరించారని కొనియాడారు.

## గవర్నర్ శివప్రతాప్‌శుక్లాను కలిసిన పలువురు ప్రముఖులు



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై6:** తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను సోమవారం లోక్‌భవన్‌లో వివిధ రంగాలకు చెందిన ప్రము ఖులు, ప్రజాప్రతినిధులు, సంస్థల ప్రతినిధులు కలిశారు. కర్ణాటక ఎమ్మెల్యే ఎస్. ఆర్. విశ్వనాథ్ గవర్నర్‌ను కలిశారు. అనంతరం గ్లోబల్ ఇండియా బిజినెస్ ఫోరం అధ్యక్షుడు డాక్టర్ జితేంద్ర జోషి భేటీ అయ్యారు. పద్మ అవార్డు గ్రహీత, స్వీకార్ మల్టీ స్పెషాలిటీ రిహాబిలిటేషన్ సెంటర్ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ పి. హనుమంత రావు తన ప్రతినిధి బృందంతో గవర్నర్‌ను కలిశారు. ఫిక్కీ-ఫ్లో హైదరాబాద్ చైర్‌పర్సన్ సీతారెడ్డి గడ్డం, ఇండియన్ పోల్ట్రీ ఎక్విప్‌మెంట్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉదయ్ సింగ్ బయాస్, టెలిమెడిసిన్ సొసైటీ ఆఫ్ ఇండియా-తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు రామచంద్ర విష్ణుభట్ట, ఉస్మానియా విశ్వవిద్యాలయం సైకాలజికల్ కౌన్సెలింగ్ అండ్ వెల్‌నెస్ సెంటర్ డైరెక్టర్ (ఇన్‌చార్జ్) ప్రొఫెసర్ బీనా చింతలపురి గవర్నర్‌ను కలిశారు. భారతీయ మజ్దూర్ సంఘ్ జాతీయ ఆర్గనైజింగ్ కార్యదర్శి బి. సురేంద్రం, భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్) చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ డి.వి. శ్రీనివాస్ రావు, కేశవ మెమోరియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి డాక్టర్ అన్నదానం వెంకట సుబ్రహ్మణ్యం లోక్ భవన్‌లో గవర్నర్‌ను కలిశారు.

## హమాలీల సంక్షేమమే బిఆర్ఎస్ లక్ష్యం: మాజీమంత్రి కెటిఆర్

**హైదరాబాద్ (నాచారం), జులై 6, ప్రభాతవార్త:** హమాలీల సంక్షేమమే బీఆర్ఎస్ లక్ష్యం అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ అన్నారు. రెండేళ్లలలో కేసీఆర్‌ను మళ్లి సీఎంను చేద్దాం అన్నారు. సోమవారం ఉప్పల్ నియోజక వర్గం మల్లాపూర్‌లోని విఎస్ఆర్ గార్డెనెల్లో తెలంగాణ పౌర సరఫరాల సంస్థ 18వ హమాలీ కార్మిక సంఘం మహాసభకు భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హమాలీ కార్మికులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, హమాలీల సంక్షేమానికి భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం ఎల్లప్పుడూ పెద్దపీట వేసిందని అన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై విమర్శలు గుప్పించిన కేటీఆర్, "మీరు వడ్ల బస్తాలు మోసి కష్టపడ్డారు. కానీ ఇప్పుడు రేవంత్ రెడ్డి కూడా కష్టపడుతున్నాడు. అయితే ఆయన ఏ సంచులు మోస్తున్నాడో, ఆ మూటలను ఎక్కడికి మోస్తున్నాడో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసు" అని వ్యాఖ్యానించారు. ప్రజల కోసం పోరాడుతున్న తమపై కేసులు నమోదు చేస్తున్నారని ఆరోపించారు. అయినా ప్రజా సమస్యలపై పోరాటం ఆపబోమని స్పష్టం చేశారు. భారత రాష్ట్ర సమితి ప్రభుత్వ హయాంలో హమాలీల కూలీ రేట్లను రూ.8 నుంచి రూ.26కు పెంచామని, గతంలో ఐదేళ్లకు ఒకసారి మాత్రమే రేట్లు పెరిగేవని, కేసీఆర్ నాయకత్వంలో రెండేళ్లకోసారి రేట్ల సవరణ చేపట్టి హమాలీలకు మేలు చేశామని తెలిపారు. హమాలీ కార్మికులకు ఆరోగ్య భద్రతతో పాటు అన్ని రకాల సంక్షేమ చర్యలు అమలు చేశామని గుర్తు చేశారు. తెలంగాణలో కేసీఆర్ పాలనలో వ్యవసాయం గణనీయంగా అభివృద్ధి చెందిందని, సాగు విస్తీర్ణం పెరగడంతో రైతులతో పాటు హమాలీ కార్మికులకు కూడా ఉపాధి అవకాశాలు విస్తరించాయని పేర్కొన్నారు. ఈ మహాసభలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఉప్పల్ శాసన సభ్యుడు బండారి లక్ష్మారెడ్డి, సీనియర్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి, బందం జోస్న, ప్రబాకర్ రెడ్డి, మేడల మల్లికార్జున్ గౌడ్, కరిపె ప్రవీణ్, భారత రాష్ట్ర సమితి సీనియర్ నాయకుడు క్యామ మల్లేష్, మాజీ కార్పోరేటర్లు పన్నాల దేవేందర్ రెడ్డి, శాంతి సాయిజన్ శేఖర్, సింగి రెడ్డి సోమన్న, బన్నాల గీత ప్రవీన్ ముదిరాజ్, హమాలీ సంఘం నాయకులు, కార్మికులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



సభలో ప్రసింగిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రిసెండ్ కెటిఆర్

# భూగర్భ విద్యుత్ కేబులింగ్‌కు నిధుల అడ్డంకి

### రూ.14,725 కోట్ల ప్రాజెక్టు మరింత జాప్యం

**హైదరాబాద్, జులై 6, ప్రభాతవార్త:** హైదరాబాద్‌తో సహా రాష్ట్రంలోని పలు నగరాల్లో ప్రతిపాదించిన భూగర్భ విద్యుత్ కేబులింగ్ కు నిధుల అవాంతరాలు ఏర్పడినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేయతలపెట్టిన ఈ ప్రాజెక్టు నిధుల కొరత, అమలు సవాళ్ల కారణంగా ఆటంకాలు ఎదురవుతున్నట్లు అధికవర్గా ద్వారా తెలియవచ్చింది. గత ఏడాది నవంబరులో, హైదరాబాద్ వ్యాప్తంగా భూగర్భ విద్యుత్ పంపిణీ నెట్వర్క్‌ను ఏర్పాటు చేసే ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. గత ఏడాది మే నెలలో డిప్యూటీ సీఎం విక్రమార్క బెంగళూరు పర్యటనకు వచ్చి, అక్కడి భూగర్భ కేబులింగ్ వ్యవస్థను అధ్యయనం చేసిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ ప్రతిపాదనను సిద్ధం చేసే ముందు అధికారులు ఇతర రాష్ట్రాలలో అనుసరిస్తున్న ఉత్తమ పద్ధతులను కూడా పరిశీలించారు. ఈ అధ్యయనాల ఆధారంగా, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో భూగర్భ విద్యుత్ కేబులింగ్ నెట్‌వర్క్‌ను అమలు చేయడానికి రూ.14,725 కోట్ల పెట్టుబడి అవసరమని అధికారులు అంచనా వేశారు. దశలవారీ అమలు కోసం నగరాన్ని మూడు కార్యాచరణ జోన్‌లుగా విభజించాలని ప్రతిపాదించారు. విద్యుత్ లైన్లతో పాటు, టిఫైబర్ మరియు ఇతర కమ్యూనికేషన్ కేబుళ్లను కూడా భూగర్భంలో వేయాలని ఈ ప్రాజెక్టులో ఉద్దేశించారు.

మొదటి దశలో భాగంగా, మెట్రో జోన్‌లో ఓవర్‌హెడ్ విద్యుత్ లైన్లను భూగర్భ కేబుళ్లగా మార్చేందుకు దక్షి ణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎస్‌పీడీసీఎల్) సుమారు రూ. 4,051 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలను సిద్ధం చేసింది. బంజారా హిల్స్, సికింద్రాబాద్, హైదరాబాద్ సెంట్రల్, సౌత్ సర్కిళ్లను కవర్ చేసే ఈ ప్రతిపాదనకు, గత ఏడాది నవంబర్‌లో జారీ చేసిన జీవో ఎంఎస్. నెం. 43 ద్వారా ప్రభుత్వ ఆమోదం లభించింది. ఈ ప్రాజెక్టు ప్రారంభంలో అంతర్గత వనరుల ద్వారా లేదా అప్పుల ద్వారా నిధులు సమకూర్చాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. అలాగే, వ్యయ భాగస్వామ్య యంత్రాంగం ద్వారా టెలికాం ఆపరేటర్లు, ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్లు మరియు టీ ఫైబర్‌లను ఈ ప్రాజెక్టులో భాగస్వాములను చేయాలని కూడా ప్రణాళిక వేసింది. అనంతరం, గుర్తించిన మెట్రో జోన్ అంతటా ఓవర్‌హెడ్ లైన్లను భూగర్భ కేబుల్స్‌గా మార్చేందుకు ఎస్‌పీడీసీఎల్ రాష్ట్ర ప్రభుత్వానికి వివరణాత్మక ప్రాజెక్ట్ నివేదిక (డీపీఆర్)ను సమర్పించింది. అయితే, ప్రస్తుతం ఈ ప్రాజెక్టు కు నిధుల సమస్య తలెత్తినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో మొత్తం నెట్‌వర్క్ యొక్క అమలు, నిర్వహణ మరియు పర్యవేక్షణను ఒకే ఏజెన్సీకి అప్పగించాలా లేక వేర్వేరు ఏజెన్సీలు వేర్వేరు భాగాలను నిర్వహించాలా అనే దానిపై ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోవాల్సి ఉన్నట్లు తెలుస్తోంది.



అవ్వకు స్వయంగా ప్రసాదం అందిస్తున్న టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర

# ఈ జన్మకు ఇది చాలు స్వామీ!

### విఐపి బ్రేక్ దర్శనంతో పులకించిన 116 యేళ్ల అవ్వ

### అంతటి వృద్ధాప్యంలోను కాలినడకన తిరుమలపైకి

**తిరుమల,జులై 6ప్రభాతవార్తప్రతినిధి:** సాధారణంగా రాజ్యాంగహోదా లోని ప్రముఖులకు లభించే విఐపి ప్రోటోకాల్ బ్రేక్ దర్శనం తరహాలో ఎలాంటి ఆర్భాటంలేకుండా 116ఏళ్ళ అవ్వకు ఆమె కుటుంబానికి దక్కడం సాక్షాత్తు ఆ దేవదేవుడు ఇచ్చిన అరుదైన అవకాశం. శతాధిక వయస్సు దాటినా ఆ అవ్వకు ఏడుకొండల వేంకటేశ్వరస్వామిపై అచం చలమైన భక్తివిశ్వాసాలు కలిగి ఉండటమే ఇందుకు నిదర్శనం. 116 ఏళ్ల వయస్సులోనూ మూడురోజుల క్రిందట అలిపిరి మెట్లదారిలో కాలినడకన తమిళనాడుకు చెందిన నవనీతమ్మ సోమవారం ఉదయం విఐపి బ్రేక్‌లో ఆ స్వామిని ప్రత్యేక దర్శనం చేసుకుని పులకించి పోయింది. ఈ జన్మకు ఇది చాలుస్వామీ అంటూ అవ్వ మనస్సు లోనే ఉత్సాహం చూపింది. నవనీతమ్మ కాలినడకన తిరుమలకు రావడం, ఆ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో ఆమె భక్తికి పలువురు ప్రశంసలు కురిపించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన సోషియల్ మీడియా ఖాతాల్లో భక్తికి వయస్సు అడ్డురాలేదని, శ్రీవారిపై భక్తులకు ఉన్న విశ్వాసానికి ఈ వృద్ధురాలే నిదర్శనమని పోస్ట్ చేశారు. ఈ క్రమంలో వృద్ధురాలు, ఆమె కుటుంబ సభ్యుల వివరాలు తెలియజేయాలని టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు కూడా ఆదివారం ఎక్స్ వేదికగా విజ్ఞప్తి చేశారు. చైర్మన్ సూచనలతో టిటిడి విజిలెన్స్ అధికారులు వెంటనే చర్యలు చేపట్టి, తమిళనాడు చెన్నైకు చెందిన నవనీతమ్మ తిరుపతిలో ఉన్నట్లు కనుగొన్నారు. చైర్మన్ ఆదేశాల మేరకు సోమవారం ఉదయం నవనీతమ్మతోపాటు ఆమె కుటుంబ సభ్యులకు విఐపి బ్రేక్ దర్శనం కల్పించారు. చైర్మన్ కార్యాలయం సిబ్బంది స్వయంగా ఆమెను బయోమెట్రిక్ కేంద్రం నుండి ఆనందనిలయం వరకు వెంట ఉండి అన్ని ఏర్పాట్లు చేశారు. అనంతరం రంగనాయకుల మండపంలో టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర శతాధిక వృద్ధ భక్తురాలికి వేదపండితులతో వేదాశీర్వచనం చేయించి, పట్టువస్త్రం కప్పి, శ్రీవారి తీర్థప్ర సాదాలను అందజేశారు. అనంతరం నవనీతమ్మ మనవడు దిక్పతి మాట్లాడుతూ ఆ దేవదేవునిపై అచం చల భక్తివిశ్వాసాలే శ్రీవారి రూపంలో టిటిడి అధికారులు తమ అమ్మమ్మతో పాటు కుటుంబ సభ్యులకు ఎంతో గొప్ప దర్శనభాగ్యాన్ని కల్పించారని ఆనందం వ్యక్తం చేశారు. ఆలయం వెలుపల టిటిడి సిబ్బం దికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఆలయం వెలుపలకు వచ్చిన తరువాత 116 యేళ్ల అవ్వ తిరుమలలో భక్తులకు చేతులెత్తి నమస్కరిస్తూ అభివాదం చేస్తూ ముందుకు కదిలారు.

## జైలు నుంచి తప్పించుకున్న పోక్సో నిందితుడు

### నానో యూరియా మందు తాగి ఆత్మహత్యాయత్నం

### వనపర్తి జిల్లా దవాఖానలో చికిత్స

**వనపర్తి, జులై 6:** పోక్సో కేసులో నిందితుడు మహబూబ్‌నగర్ జైలు నుంచి తప్పించుకోవడం సంచలనంగా మారింది. వివరాల్లోకి వెళ్తే.. వనపర్తి జిల్లా అమరచింత మండలానికి చెందిన ఓ మైనర్ బాలికను ప్రేమించి కిషోర్ కుమార్ రెడ్డి వివాహం చేసుకున్నాడు. ఈ మేరకు బాలికల తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఇదే నెలలో 15న కిషోర్ కుమార్ రెడ్డి పై ఫోక్సో కేసు నమోదు చేశారు. మహబూబ్నగర్ జైలులో శిక్ష అనుభవిస్తున్న కిషోర్ కుమార్ రెడ్డి సోమవారం తెల్లవారుజామున తప్పించుకోవడంతో పోలీసు అధికారులు తలలు పట్టుకున్నారు. అయితే జైలు నుంచి తప్పించుకున్న కిషోర్ కుమార్ తన వ్యవసాయ పొలానికి చేరుకొని కుటుంబ సభ్యులకు విషయాన్ని తెలియజేశాడు. అయితే అప్పటికే అపస్మారక స్థితిలో ఉన్న అతడిని చూసి పోలీస్ అధికారులకు సమాచారం ఇచ్చారు. కిషోర్ కుమార్ రెడ్డి ని హుటాహుటిన వనపర్తి జిల్లా దవాఖానకు తరలించారు. కిషోర్ సమాచారం తెలియడంతో జిల్లా పోలీస్ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. జైలు నుంచి నిందితుడు తప్పించుకున్నాడు అనే వార్త బయటకి తెలియడంతో సోషల్ మీడియాలో చెక్కర్లు కొట్టింది. కిషోర్ ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వనపర్తి జిల్లా దవాఖాన వైద్యులు తెలిపారు.

## ఎప్పుడు ఎన్నికలొచ్చినా రేవంత్ ఓడిపోతాడు

### ఇది జనం మాట : బిజెపి ఎంపి ఈటల

**హైదరాబాద్, జులై 6, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చాలా క్లారిటి ఉందని, కానీ లేనిది ప్రజలకు మనకే అని ఎంపి ఈటల రాజేందర్ అన్నారు. అమెరికా గడ్డమీద నిలబడి అబద్దాలు చెప్తేనే ప్రజలు ఇష్టపడతారు.. అబద్ధాలు చెప్పే నాయకులనే ప్రజలు బలపరుస్తారు అని చెప్పారు. దానికి పరాకాష్ట.. హైడ్రా అనే పదం నేను హిట్లర్ నుంచి తీసుకున్నాను అని ఆయన చెప్పడమే. దానినిబట్టే ఆయన నైజం అర్థం చేసుకోవాలి. గతంలో ఉన్న ప్రభుత్వాలు పేదవాళ్లకు ఇంటి జాగాలను ఇళ్లను ఇచ్చారు. కానీ రేవంత్ రెడ్డి విధానం వేరు. పేదవాళ్ల ఇళ్లను కూలగొట్టడం, ఆనాటి ప్రభుత్వాలు ఇచ్చిన జాగాలు గుంజుకొని పెద్దవాళ్లకు అంటగట్టడమే ఆయన ఎజెండా. హిట్లర్‌కు వారసత్వం అని చెప్పుకుంటున్న హైడ్రా ప్రజలకు న్యాయం చేస్తుందనుకోవడం మన తప్పు అన్నారు. తాను హైడ్రాను వ్యతిరేకించిన మొదట్లో చాలామంది ఈటల రాజేందర్ ఏంటి ఈ విధంగా చేస్తున్నారని ప్రశ్నించారు.. కానీ ఒంటరిగా నాలుగు నెలల పాటు కొట్లాడిన తర్వాత.. హైడ్రా నిజస్వరూపం అందరికీ తెలిసిందన్నారు. ఇప్పుడు కోర్టు కూడా అదే చెప్పింది. ప్రభుత్వ యంత్రాంగం రాజ్యాంగానికి అనుకూలంగా పనిచేయాలన్నారు.

# ఎమ్మెల్సీ సీటుపై తమ్ముళ్ల గంపెడాశలు!




● త్వరలో గవర్నర్ నామినేటెడ్ కోటాలో 2 స్థానాలు భర్తీ ● పార్టీ అధిష్టానానికి దరఖాస్తు ● అగ్రనేతల చుట్టూ ఆశావహుల చక్కర్లు

**విజయవాడ, జులై 6 ప్రభాతవార్త ప్రతినిధి:** శాసన మండలిలో గవర్నర్ నామినేటెడ్ కోటాలో ఎమ్మెల్సీ సీట్లు కోసం టిడిపి నేతలు పార్టీ అధిష్టానానికి దరఖాస్తు చేసుకున్నారు. గతంలో వివిధ పదవులకు పోటీ భంగపడిన నేతలు ఈ పర్యాయం అధిష్టానం తమను కరుణిస్తుందనే ఆశాభావంతో ఉన్నారు. శాసనమండలిలో గవర్నర్ నామినేటెడ్ కోటాలోని 2 స్థానాలు ఈ నెల 28తో ఖాళీ అవుతున్నాయి. మండలి డిప్యూటీ చైర్మన్ జాకియా ఖానం, వైసిపి ఎమ్మెల్సీ పండుల రవీంద్రబాబు పదవీకాలం ముగియనుంది. ఇందులో ఒకటి టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్యకు ఇస్తారని అంటున్నారు. ఇటీవల జరిగిన రాజ్య సభ ఎన్నికల్లో ఆయనకు అవకాశం దక్కలేదు. దీనితో సీనియర్ అయిన ఆయనకు కనీసం ఎమ్మెల్సీ పదవి అయినా ఇవ్వడం ధర్మం అని చంద్రబాబు భావిస్తున్నట్టు తెలిసింది. 2027 జూన్ నెలలో మరో 23 స్థానాలు ఖాళీ అవుతాయి. అప్పుడు రామయ్యకు శాసన మండలి చైర్మన్ పదవి ఇస్తారని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. లేదా మంత్రి వర్గంలోకి తీసుకునే అవకాశం ఉందంటున్నారు. 4 రాజ్యసభ స్థానాల్లో రెండు కమ్మ, బలిజ, బిసి వర్గాలకు ఒక్కోటి ఇచ్చారు. రెడ్డి, ఎస్సీలకు ఒక అవకాశం ఇవ్వలేదు. అలాగే రాయలసీమ ప్రాంతానికి ప్రాతినిధ్యం కల్పించలేదు. ఈ నేపథ్యంలో ఎస్సీ నుంచి రామయ్యకు, రాయలసీమ నుంచి ఒక రెడ్డికి అవకాశం కల్పించవచ్చు అనుకుంటున్నారు. తిరుపతికి చెందిన టిడిపి రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్‌బి సుధాకర్ రెడ్డి ఎమ్మెల్సీ పదవి ఆశిస్తున్నారని తెలిసింది. సైకాలజిస్ట్‌గా పేరున్న ఆయన 2020 నుంచి గత ఏప్రిల్ వరకు అధికార ప్రతినిధిగా పనిచేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన మాజీ మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్‌కె రోజా, కె.నారాయణస్వామి తదితరులపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. సీనియర్ జర్నలిస్ట్ కూడా అయిన తనకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ అవకాశం కల్పించాలని కోరుతున్నారు. కడప నుంచి మాజీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాస రెడ్డి కూడా రేసులో ఉన్నారు. ఆయన రాజ్యసభ సీటు ఆశించి విఫలం అయ్యారు. ఆయన భార్య మాధవీ రెడ్డి కడప ఎమ్మెల్యేగా ఉన్నారు. పార్టీలో సీనియర్ నేతలు, గత ఎన్నికల్లో సీట్లు త్యాగం చేసిన వారికి, వివిధ సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించే ఉద్దేశంతో చాలా మంది నాయకులు పోటీ పడుతున్నారు. దేవినేని ఉమామహేశ్వర రావు, టిడి జనార్దన్, పీతల సుజాత, జవహర్, కెఇ ప్రభాకర్. పిఠాపురం నుంచి ఎస్‌విఎస్ఎన్ వర్మ, పర్చూరు నుంచి ఏలూరి సాంబశివరావు, వంగవీటి రాధా, బుద్ధా వెంకన్న, కొమ్మాలపాటి శ్రీధర్ దువ్వారపు రామారావు, మోపిదేవి వెంకటరమణ రేసులో ఉన్నారు.

## ఏపి సిఆర్‌డిఏ అధికారిక వెబ్‌సైట్‌లో యూనిట్ ఆఫీసుల వద్ద వార్షిక కౌలు వివరాలు

**విజయవాడ, జులై 6 ప్రభాతవార్త ప్రతినిధి:** అమరావతి నిర్మాణానికి భూ సమీకరణ కింద భూములు ఇచ్చిన రైతుల సౌకర్యార్థం, ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఏపి సిఆర్‌డిఏ) కీలక సమాచారాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. రైతులకు అందించే వార్షిక కౌలు చెల్లింపుల స్థితిగతులను పారదర్శకంగా తెలియజేసే ఉద్దేశంతో పూర్తి వివరాలను అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. అలాగే రాజధాని గ్రామాలలోని కాంపిటెంట్ అథారిటీ కార్యాలయాలవద్ద కౌలు చెల్లింపు వివరాలను ప్రదర్శించారు. రైతుల సౌకర్యార్థం ప్రతి యూనిట్ ఆఫీస్ వద్ద హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేసి రైతులకు వార్షిక కౌలు చెల్లింపుపై తలెత్తిన సందేహాలను సీఆర్డీఏ అధికారులు, సిబ్బంది వివరించడం జరుగుతోంది. అదే విధంగా సోమవారం రాయపూడిలోని ప్రధాన కార్యాలయంలో రైతుల ఎన్‌పిసిఐ, బ్యాంక్ లింకేజ్ సంబంధిత సమస్యలను పరిష్కరించేందుకుగాను హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. హెల్ప్ డెస్క్ ద్వారా సీఆర్డీఏ సిబ్బంది పలువురు రైతులకు లింకేజ్ ప్రక్రియ పూర్తి చేశారు. వెబ్‌సైట్‌లో పొందుపరిచిన సమాచారంలో వార్షిక కౌలు జమ అయిన రైతుల వివరాలతో పాటు, ఇంకా కౌలు జమ కాని రైతుల వివరాలు, చెల్లింపులు నిలిచిపోవడానికి గల కారణాలను సైతం వెల్లడించారు. ఇనాక్టివ్‌గా ఉన్న బ్యాంకు ఖాతాలను కలిగిన రైతుల జాబితాను సైతం అందుబాటులో ఉంచారు. రాజధాని రైతులకు కౌలు చెల్లింపులు నేరుగా బ్యాంకు ఖాతాలకు జమ చేయబడుతున్న నేపథ్యంలో, ఎన్‌పిసిఐ లింకేజీ సక్రమంగా లేకపోవడం లేదా బ్యాంకు ఖాతాలు ఇనాక్టివ్‌గా ఉండటం వంటి కారణాల వల్ల కొందరి ఖాతాలకు చెల్లింపులు జమ కావడం లేదు. అలాంటి రైతులు తమ ఖాతా ఉన్న బ్యాంకును సంప్రదించి ఖాతాలను యాక్టివ్ చేసుకోవాలని ఏపి సిఆర్‌డిఏ సూచించింది.

**క్యూఆర్ కోడ్ ద్వారా సులభంగా వివరాలు:** రైతులు తమ వార్షిక కౌలు చెల్లింపు స్థితి సులభంగా తెలుసుకునేందుకు సిఆర్‌డిఏ నుంచి క్యూఆర్ కోడ్‌ను విడుదల చేసింది. ఈ కోడ్‌ను స్కాన్ చేస్తే సంబంధిత వెబ్‌పేజీలో రాజధాని రైతులు తమ వివరాలను చెక్ చేసుకోవచ్చు. దీంతో కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ఇంటి వద్ద నుండే కౌలు లబ్ది సమాచారం తెలుసుకునే సౌకర్యం కల్పించింది. కౌలు లబ్ది పొందని రైతులు తమ పేర్లు, ఖాతా వివరాలు, ఏ కారణం చేత కౌలు జమ కాలేదోనన్న అంశాలను సైతం చెక్ చేసుకోవచ్చు. ఆధార్ ఇనాక్టివ్‌గా ఉన్న బ్యాంక్ ఖాతాలలో కౌలు నగదు జమ చేయుట సాధ్యపడదు కనుక ఆధార్ ఇనాక్టివ్‌గా ఉన్న బ్యాంకు ఖాతాలు కలిగిన రైతులు వెంటనే ఆ ఖాతాలను యాక్టివేట్ చేసుకోవాలని కోరింది.

## ఏపి సచివాలయంలో ఎస్ఐఆర్ ప్రత్యేక శిబిరం

**విజయవాడ, జులై 6 ప్రభాతవార్త ప్రతినిధి:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)పై ఈనెల 6వ తేదీ నుండి 8వ తేదీ వరకు సచివాలయ ఉద్యోగుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరాన్ని సోమవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ ప్రారంభించారు. ఏపి సచివాలయం మూడవ భవనం అప్సా (ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘం) హాల్లో ఏర్పాటు చేసిన ఈశిబిరాన్ని ఆయన ప్రారంభించి ఉద్యోగుల ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ నిర్వహిస్తున్న తీరును ఆయన పరిశీలించారు. ఉద్యోగులందరూ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ సూచించారు. ఈ ప్రత్యేక క్యాంపులో ఎన్యుమరేషన్ ఫారాలు ఆన్‌లైన్ సబ్మిషన్, కొత్త ఓటర్ల ఎన్‌రోల్‌మెంట్, ఓటర్ల జాబితా నుండి చనిపోయిన వారి పేర్లు తొలగింపు, చిరునామా మార్పు తదితర అంశాలపై ఉద్యోగులకు అవగాహన కల్పిస్తున్నారు. ఉద్యోగులు 2002 నాటి ఓటరు వివరాలు, తాజా ఫొటో, ప్రస్తుత ఓటరు గుర్తింపు కార్డు (ఎపిక్ కార్డు) ఆధార్ కార్డు, రెసిడెన్షియల్ అడ్రస్ ప్రూఫ్ వివరాలతో వచ్చి వారి ఓటరు వివరాలు నమోదు చేసుకుంటున్నారు. అనంతరం ఈ ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియలో ఓటరు వివరాలు పూర్తి చేసుకున్న ఉద్యోగులకు సిఇఓ వివేక్ యాదవ్ ఓటరు గుర్తింపు ప్రొసీడింగ్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ, గుంటూరు ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, జాయింట్ సిఇఓ ఇ.వెంకటేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు రామకృష్ణ, సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ బస్సులు ఆర్‌టిసినే కొనుగోలు చేపట్టాలి

● ఆర్‌టిసి ఉద్యోగుల ఐకాస డిమాండ్



**విజయవాడ, జులై 6 ప్రభాతవార్త ప్రతినిధి:** విద్యుత్ బస్సుల కొనుగోలు ఆర్‌టిసి ద్వారానే చేపట్టాలని ప్రధాన డిమాండ్‌తో ఆ సంస్థ ఉద్యోగుల ఐక్యకార్యాచరణ సమితి (జెఎసి) డిమాండ్ చేసింది, ఆర్‌టిసి సిబ్బందితోనే ఈబస్సుల నిర్వహణ చేయాలని కోరింది. ప్రైవేట్ ఆపరేటర్లతో బస్సులు నడుపుతామంటే అంగీకరించలేమని ఉద్యోగ సంఘాలు తేల్చిచెప్పాయి. ఉద్యోగుల సమస్యలపై ఆర్‌టిసి జెఎసి నేతలతో యాజమాన్యం చర్చలు జరిపింది. ఇడిలు బ్రహ్మానందరెడ్డి, వర్మతో వివిధ అంశాలపై మాట్లాడారు. ఉద్యోగసంఘాల నేతలతో ఇడి ఆపరేషన్స్ నాగేశ్వరరావు పలు కీలక అంశాల గురించి చర్చలు జరిపారు. అనంతరం స్పెషల్ సిఎస్, ఎండిలకు ఇడిలు వివరాలను తెలిపారు. మరోవైపు 'స్త్రీ శక్తి' పథకానికి అవసరమైన మేర బస్సుల సంఖ్య పెంచాలని విజ్ఞప్తి చేసింది. స్త్రీ శక్తి పథకం వల్ల ప్రయాణికులు సంఖ్య బాగా పెరిగిందని, ఆర్‌టిసికి రావాల్సిన బకాయిలు వసూలు చేసి బస్సులు కొనాలని సూచించారు. ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయటం సహా 30 డిమాండ్లను ఆర్‌టిసి ఐకాస అధికారుల ముందుంచారు. ప్రకటించిన కార్యాచరణ ప్రకారం నిరసన కార్యక్రమాలు ఉంటాయని ఉద్యోగ సంఘాలు స్పష్టం చేశాయి. తమ అజెండాపై ఇంకా స్పష్టత రాలేదని ఉద్యోగ సంఘాల కన్వీనర్ శ్రీనివాసరావు మీడియాకు తెలిపారు. వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేలా కృషి చేస్తామన్నారు. ఆర్‌టిసి ద్వారానే విద్యుత్ బస్సులు కొనాలని చెప్పగా దానిపై వారికి స్పష్టమైన హామీ ఇవ్వలేదన్నారు. ఆపరేటర్లతో విద్యుత్ బస్సుల కొనుగోలు ఆర్‌టిసిని ప్రైవేట్‌పరం చేయడమే అవుతుందని ఆయన అసహనం వ్యక్తం చేశారు. సమావేశం మొక్కుబడిగా జరిగిందని ఉద్యోగ సంఘాల కన్వీనర్ దామోదర్‌రావు వివరించారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఇడిలు చెప్పారు. ప్రైవేట్ వ్యక్తులతో విద్యుత్ బస్సుల కొనుగోలు నిర్ణయం వెనక్కి తీసుకోవాలి. మూసివేసిన డిపోలు పునరుద్ధరించాలి. పరిష్కరించాల్సిన సమస్యలపై 10 రోజుల్లో సమావేశం పెడతామన్నారు. మా పోరాటం వ్యక్తిగతం కాదు, ఆర్‌టిసిని రక్షించుకోవడమే అని ఉద్యోగ సంఘాలు స్పష్టం చేసాయి.

## త్వరితగతిన విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు

● ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి



**తిరుపతి, జులై 6 ప్రభాతవార్త ప్రతినిధి:** వినియోగదారుల విద్యుత్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు. వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. వ్యవసాయ విద్యుత్ సర్వీసుల మంజూరు, విద్యుత్ స్తంభాల మార్పు, వేలాడే విద్యుత్ తీగలు, లోఓల్టేజ్ తదితర సమస్యలను ఈ కార్యక్రమం ద్వారా అధికారుల దృష్టికి తీసుకువచ్చారని తెలియజేశారు. సోమవారం తిరుపతి కార్పొరేట్ కార్యాలయంలో డయల్ యువర్ ఎస్‌పిడిసిఎల్ సిఎండి కార్యక్రమం నిర్వహించారు. తొమ్మిది జిల్లాల నుండి 52 మంది తమ సమస్యలు తెలిపారు. డైరెక్టర్లు కె.గురవయ్య, కె.రామమోహన్ రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు కె.ఆదిశేషయ్య, ఆర్.పద్మ, ఎం.మురళి కుమార్, ఎన్.శోభా వాలెంటీనా, సిహెచ్ రామచంద్రరావు, కె.సంపత్‌కుమార్, ఎస్.రమణ, జనరల్ మేనేజర్లు శ్రీకాంత్, చక్రపాణి, జగదీష్, లత, పిఆర్ఒ తోట మధుసూదన పాల్గొన్నారు.




## చంద్రగిరి ఎమ్మెల్యే పులిపర్తి నానిని అరెస్టు చేయాలి

**తిరుపతి, జులై 6 ప్రభాతవార్త ప్రతినిధి:** చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని రోత పనులు చేస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ ఆయనపై వెంటనే కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని వైసిపి నేతలు డిమాండ్ చేశారు. సోమవారం చంద్రగిరి నియోజకవర్గ వైసిపి ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి నేతృత్వంలో భారీ సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎస్పీకి ఫిర్యాదు చేయడానికి ర్యాలీగా వచ్చారు. ప్రజాస్వామ్యంగా ఫిర్యాదు చేయడానికి వస్తున్న వారిని పోలీసులు అడ్డుకుని ఎక్కడికక్కడ బ్యారికేడ్లు ఏర్పాటు చేసి ముందుకు వెళ్లనీయలేదు. పోలీసుల అడ్డంకులను దాటుకుని ఎస్పీ కార్యాలయం వద్దకు చేరుకున్న తర్వాత కూడా ప్రధాన గేట్లు మూసివేసి లోపలికి వెళ్లకుండా నిలువరించారు. దీంతో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ప్రధాన ద్వారం ఎదుటే రోడ్డుపై బైఠాయించడంతో అక్కడ పరిస్థితి ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారింది. ప్రజాస్వామ్యబద్ధంగా ఫిర్యాదు చేసే హక్కును కూడా కాలరాస్తున్నారని చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి మండిపడ్డారు. ఆయనతో పాటు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు గేటు ఎదుటే నిరసనకు దిగగా, పోలీసులు వారిని చెదరగొట్టేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో రెండు వర్గాల మధ్య తోపులాట చోటుచేసుకుంది. బైఠాయింపును విరమింపజేసేందుకు పోలీసులు బలవంతంగా ప్రయత్నించగా పరిస్థితి మరింత ఉద్రిక్తమైంది. కార్యకర్తలను చెదరగొట్టేందుకు యత్నించడంతో చంద్రగిరి డిఎస్పీ ప్రసాద్ ఆధ్వర్యంలో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి, శివశంకర్‌రాజుతో పాటు పలువురు నాయకులను పోలీసులు అరెస్టు చేసి ఎస్వీ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టులను అడ్డుకునేందుకు పార్టీ కార్యకర్తలు పోలీసు వాహనాలను అడ్డుకోవడంతో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. చివరకు ఎస్పీని కలవనీయకుండా పోలీసులు అడ్డుకున్నారు.

# తిరుమల సమాచారం



## శ్రీవారి సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి

**తిరుమల, జులై 6 ప్రభాతవార్త ప్రతినిధి:** కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని సోమవారం ఉదయం సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విపుల్ మనుభాయ్ పంచోలి కుటుంబంతో కలసి దర్శించుకున్నారు. ఆలయం వద్దకు విచ్చేసిన న్యాయమూర్తికి ఆలయ అధికారులు స్వాగతం పలికారు. విఐపి బ్రేక్‌లో శ్రీవారిని దర్శించుకుని ఆశీస్సులందుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## శ్రీవారి సేవలో 'లెనిన్' చిత్రబృందం



**తిరుమల, జులై 6 ప్రభాతవార్త ప్రతినిధి:** సినీనటుడు అక్కినేని నాగార్జున, అక్కినేని అఖిల్, అమల కుటుంబంతో సహా "లెనిన్" చిత్రం బృందం సోమవారం ఉదయం కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఈనెల 10వ తేదీ విడుదల కానున్న ఈ చిత్రానికి సంబంధించి ఆదివారం తిరుపతిలో ప్రి రిలీజ్ వేడుకలు జరిగాయి. అనంతరం సోమవారం తిరుమలకు చేరుకున్న చిత్ర బృందం నాగార్జున, అఖిల్‌తోబాటు సునీల్, ఫిలిం ప్రొడ్యూసర్ నాగవంశీ, నటి భాగ్యశ్రీ, కమెడియన్ సునీల్ విఐపి బ్రేక్ దర్శనంలో ఆలయంలోనికి వెళ్ళారు. తొలుత ధ్వజస్తంభానికి నమస్కరించారు. ఆనందనిలయం చేరుకుని శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకుని కానుకలు సమర్పించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయం వెలుపలకు వచ్చిన నటుడు నాగార్జున, అఖిల్‌ను చూసి అభిమానులు కరచాలనం, సెల్ఫీలు తీసుకునేందుకు ఉత్సాహం చూపారు.

## శ్రీవారి సేవలో ప్రముఖులు



**తిరుమల, జులై 6 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని సోమవారం ఉదయం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఉదయం విఐపి బ్రేక్‌లో సినీనటుడు మాధవన్, తెలంగాణ మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, మధ్యప్రదేశ్ మంత్రి గోవింద్ సింగ్ రాజ్‌పుత్, ఉత్తరప్రదేశ్ ఎంపి గణేష్ సింగ్ కుటుంబసభ్యులతో ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. ఆలయ అదికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

## దేశ విదేశాల నుండి 'శ్రీవారి వైద్యసేవ్ల కు ముందుకొస్తున్న వైద్యులు



**తిరుమల, జులై 6 ప్రభాతవార్త ప్రతినిధి:** శ్రీవారి సేవ ప్రతి భక్తుడి జీవితంలో లభించే మహాభాగ్యమని, అదే స్ఫూర్తితో టిటిడి ప్రారంభించిన "శ్రీవారి వైద్యసేవ్ల కార్యక్రమానికి దేశ వ్యాప్తంగా, విదేశాల్లోని నిపుణ వైద్యుల నుంచి విశేష స్పందన లభిస్తోందని టిటిడి జెఇఒ ఎ.శరత్ తెలిపారు. భక్తుల సేవలో విజయవంతంగా కొనసాగుతున్న శ్రీవారి సేవ కార్యక్రమాన్ని ఆదర్శంగా తీసుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనల మేరకు వైద్య, పశువైద్య, ఇతర వృత్తి నిపుణులను స్వచ్ఛంద సేవలో భాగస్వాములను చేయాలనే లక్ష్యంతో శ్రీవారి వైద్యసేవ కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు, ఇఒ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి మార్గదర్శకత్వంలో స్విమ్స్, బర్డ్, ఆయుర్వేద కళాశాల, గోశాల, వైద్య విభాగం తదితర సంస్థల అధిపతులతో పలు సమావేశాలు, వీడియో కాన్ఫరెన్సులు నిర్వహించి సమగ్ర కార్యాచరణ రూపొందించిన అనంతరం ప్రత్యేక మొబైల్ అప్లికేషన్ ద్వారా ఈ కార్యక్రమాన్ని మూడు నెలల ట్రయల్ రన్‌గా అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. సోమవారం ఎస్వీ గోసంరక్షణ శాలలో జరుగుతున్న వైద్యసేవలను ఆయన నిపుణ వైద్యులతో కలిసి పరిశీలించారు. జూన్ 20 నుండి స్లాట్ బుకింగ్ ప్రారంభం కాగా ఇప్పటికే 488 మంది స్పెషలిస్టు వైద్యులు, వివిధ విభాగాల నిపుణులు తమ పేర్లు నమోదు చేసుకున్నారని తెలిపారు. స్పెషలిస్టు వైద్యులకు మూడు రోజుల సేవా అవకాశం, ఇతర వైద్యులకు ఏడు రోజుల సేవా వ్యవధిని కల్పించామని చెప్పారు. ఆసక్తి ఉన్నవారు నెల రోజులు, ఆరు నెలలు లేదా ఏడాది పాటు కూడా సేవలందించే అవకాశాన్ని కల్పించామని తెలిపారు. ఆసుపత్రుల అవసరాలకు అనుగుణంగా ఆయా విభాగాధిపతుల ద్వారా సేవా స్లాట్లు కేటాయిస్తున్నట్లు వివరించారు.

**గోసేవకు అపూర్వ స్పందన:** శ్రీవారి వైద్యసేవలో భాగంగా ప్రారంభించిన గోసేవ కార్యక్రమానికి విశేష ఆదరణ లభిస్తోందని జెఇఒ శరత్ తెలిపారు. ఇప్పటివరకు మూడు బ్యాచ్‌ల సేవా స్లాట్లు పూర్తిగా భర్తీ కావడం ఈ కార్యక్రమానికి లభిస్తున్న విశ్వాసానికి నిదర్శనమన్నారు. వారం రోజుల పాటు సేవలందించిన డాక్టర్ నరేంద్రరెడ్డి, డాక్టర్ జి.పద్మ నాభన్ తదితరులు ఈ సేవ తమ జీవితంలో మరపురాని ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించిందని, ఈ అవకాశం దక్కడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నామని చెప్పినట్లు తెలిపారు. గోశాలను రాష్ట్ర వెటర్నరీ కౌన్సిల్ ఛైర్మన్ డాక్టర్ పి.వి. లక్ష్మయ్య సందర్శించి గోవులకు అందుతున్న వైద్యసేవలను పరిశీలించి హర్షం వ్యక్తం చేశారు. గోసేవలో పాల్గొంటున్న నిపుణ వైద్యులను ఘనంగా సన్మానించారు. వైద్యులకు టిటిడి కల్పిస్తున్న వసతి, భోజనం, ఇతర సౌకర్యాలపై ఆరా తీయగా, వారు పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎస్వీ గోశాల డైరెక్టర్ డాక్టర్ శివకుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పార్థసారధి, డాక్టర్ భువన, డాక్టర్ అనిల్ పాల్గొన్నారు.

## ఎస్వీ గోసంరక్షణశాలకు చాఫ్ కట్టర్ల కొనుగోలుకు ఇ-టెండర్ల ఆహ్వానం

తిరుమల, జులై 6 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుపతిలోని టిటిడి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎస్.వి. గోసంరక్షణశాల డెయిరీ ఫామ్ అవసరాల కోసం రెండు చాఫ్ కట్టర్ల కొనుగోలుకు ఇ టెండర్లను టిటిడి ఆహ్వానిస్తోంది. ఆసక్తి గల సంస్థలు, సరఫరాదారులు హెచ్‌టిటిపిఎస్://టెండర్. ఎపిఇప్రొక్యూర్‌మెంట్. జివొవి. ఇన్ వెబ్‌సైట్‌లో లాగిన్ అయి కరెంట్ టెండర్స్ విభాగంలో ఎస్వీ గోసంరక్షణ శాల డైరీ ఫామ్‌ను సర్కిల్/ డివిజన్‌గా ఎంపిక చేసి టెండర్ పత్రాలను డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. టెండర్ పత్రాల డౌన్‌లోడ్ ప్రక్రియ సోమవారం సాయంత్రం 5గంటల నుండి ప్రారంభమైంది. టెండర్ పత్రాలను జులై 21 సాయంత్రం 5.05 గంటల లోపు సమర్పించాలి. టెండర్‌కు సంబంధించిన పూర్తి వివరాల కోసం 92814 13626 నంబర్‌లో సంప్రదించాలని టిటిడి కోరింది.

## తిరుమలలో గోగుల కుటుంబ సభ్యులపై పిడి యాక్ట్

### ఇద్దరిని కడప సెంట్రల్ జైలుకు తరలింపు

**తిరుమల, జులై 6 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల పుణ్యక్షేత్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ, భక్తులను, స్థానిక వ్యాపారులను, విధుల్లో ఉన్న పోలీసు భద్రతా సిబ్బందిని భయభ్రాంతులకు గురిచేస్తూ వరుస నేరాలకు పాల్పడుతున్న గోగుల కుటుంబానికి చెందిన నేరస్థులపై తిరుపతి జిల్లా పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. సాధారణ చట్టాల ద్వారా వీరి ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఉత్తర్వుల మేరకు ప్రివెంటివ్ డిటెన్షన్(పిడి) యాక్ట్ అమలు చేశారు. గోగుల కోటయ్య(22), గోగుల శ్రీనివాసులు(20)లను అరెస్ట్ చేసి, శ్రీకాళహస్తి సబ్ జైలు నుంచి కడప సెంట్రల్ జైలుకు తరలించారు. గోగుల శ్రీకాంత్ (25) ప్రస్తుతం పరారీలో ఉండగా, అతడిని అరెస్ట్ చేసేందుకు ప్రత్యేక గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని పోలీసులు తెలిపారు. అతనిపై కూడా పిడి యాక్ట్ అమలు చేసేందుకు చర్యలు చేపట్టారు. గోగుల నాగేష్ (44)తో కలిసి గత కొంతకాలంగా తిరుమలలో వివిధ నేరకార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు విచారణలో వెల్లడైంది. తిరుమలలో అక్రమ హాకింగ్ నిర్వహించడం, భక్తులకు నామాలు పెట్టే పేరుతో బలవంతపు వసూళ్లకు పాల్పడడం, నిత్యావసర వస్తువులు, ఆహార పదార్థాలను అధిక ధరలకు విక్రయించడం, తోటి వ్యాపారులను బెదిరించడం, ఎదిరించిన వారిపై దాడులకు పాల్పడడం వంటి చర్యలకు పాల్పడుతున్నారు. పోలీసులు భద్రతా సిబ్బంది అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేసిన సమయంలో బ్లేడ్లతో తమను తాము గాయపరుచుకోవడం, గోడలకు తలలు బాదుకుని స్వీయ గాయాలు చేసుకోవడం ద్వారా పోలీసులపై తప్పుడు ఆరోపణలు చేసే విధానాన్ని అనుసరిస్తూ విధుల్లో ఉన్న సిబ్బందిని భయభ్రాంతులకు గురిచేయడం వీరి నేరశైలిగా గుర్తించారు.

గత రెండేళ్లలో తిరుమల వన్ టౌన్, టూ టౌన్, రేణిగుంట, యెర్పేడు పోలీస్ స్టేషన్లలో హత్యాయత్నం, దొంగతనం, దౌర్జన్యం, ప్రభుత్వ ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగించడం తదితర కేసులు నమోదయ్యాయి. బెయిల్‌పై విడుదలైన ప్రతిసారి తిరిగి నేరాలకు పాల్పడుతూ, పోలీసు అధికారులను ఫోన్ల ద్వారా బెదిరింపులకు గురిచేస్తున్న నేపథ్యంలో వీరిపై పిడి యాక్ట్ అమలు చేసినట్లు తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు తెలిపారు.

## ఎర్రచందనం ముద్దాయి నాసర్ బాయ్‌పై పిడియాక్ట్



**తిరుపతి, జులై 6 ప్రభాతవార్త ప్రతినిధి:** శేషాచలం అటవీప్రాంతం నుండి ఎర్రచందనం అక్రమ రవాణా చేసిన పలు కేసుల్లో ముద్దాయిగా ఉన్న కేరళకు చెందిన నాసర్ బాయ్(53)పై టాస్క్‌ఫోర్స్ అధికారులు పిడి యాక్ట్ అమలు చేశారు. టాస్క్‌ఫోర్స్ చీఫ్ ఎల్.సుబ్బారాయుడు ప్రత్యేక కార్యాచరణ అమలులో భాగంగా టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎఎస్పీ జె.కులశేఖర్ ఆధ్వర్యంలో ఎర్రచందనం అక్రమ రవాణా వృత్తిగా చేసుకుని, ముఠాగా ఏర్పడి స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న వారిపై పిడి యాక్ట్‌లు అమలు చేస్తున్నారు. తాజాగా కేరళకు చెందిన నాసర్ కెఎన్ అనే నాసర్ బాయ్ తమిళనాడులోని కోయంబత్తూరు జిల్లా మెట్టుపాలయంలో ఉంటూ ఎర్రచందనం స్మగ్లింగ్‌కు పాల్పడుతున్నట్లు గుర్తించారు. తిరుపతి జిల్లా కలెక్టరు, జిల్లా మెజిస్ట్రేట్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఇతనిపై పిడి యాక్ట్ అమలుకు ఉత్తర్వులు జారీ చేశారు. నిందితుడిపై ఆరు ఎర్రచందనం కేసులు ఉన్నాయి. ఇతనిపై పిడి యాక్ట్ అమలులో భాగంగా నిందితుడ్ని కడప సెంట్రల్ జైలుకు తరలించారు.



## తిరుమలలో శ్రీవారి భక్తజనం

**తిరుమల, జులై 6 ప్రభాతవార్త ప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం కోసం తిరుమలలో మోస్తరుగా భక్తులు ఉన్నారు. వారాంతం సెలవులు ముగియడంతో సోమవారం ఉదయానికి వైకుంఠమ్-2లో 27 కంపార్టుమెంట్లలో భక్తులు నిరీక్షిస్తుండగా సాయంత్రానికి 23 కంపార్టుమెంట్లలో ఉన్నారు. సర్వదర్శనం కోసం 16గంటలు సమయం పడుతోంది. వైకుంఠం కంపార్టుమెంట్లలో ఉన్న భక్తులకు అన్నప్రసాదాలు, పాలు, మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. సోమవారం సాయంత్రం వరకు 42వేలమంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు.



## టిటిడి ట్రస్ట్‌లకు రూ.31 లక్షలు విరాళం

**తిరుమల, జులై 6 ప్రభాతవార్త ప్రతినిధి:** ధార్మికసంస్థ టిటిడి నిర్వహిస్తున్న పథకాలకు దాతలు విరాళాలు అందిస్తున్నారు. సోమవారం సాయంత్రం టిటిడికి చెందిన వివిధ పథకాలకు రూ.31 లక్షలు విరాళంగా అందింది. హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ లయన్ సాయివెంకట్ వేంకటేశ్వర సర్వ శ్రేయాస్ ట్రస్ట్‌కు స్వర్ణ విహార్ ఇన్ ఫ్రా ప్రాజెక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ తరఫున రూ.10 లక్షలు, జయహో రామానుజ సినిమా ఆగస్టు 15న విడుదల సందర్భంగా మరో రూ.10 లక్షలు విరాళంగా అందించారు. ఈ విరాళాలను టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి అందజేశారు. అలాగే గుంటూరుకు చెందిన జి.లావణ్య వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు రూ.11,11,111 లక్షలు విరాళంగా అందించారు. ఈవిరాళాలను టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి అందజేశారు. ఈకార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి ఉన్నారు.

## దలైలామా శతాధిక కాలం జీవించాలి

జన్మదిన శుభాకాంక్షలు చెప్పిన సిఎం చంద్రబాబు



**విజయవాడ, జులై 6 ప్రభాతవార్త ప్రతినిధి:** బౌద్ధమత గురువు దలైలామాకు ఆంధ్రప్రదేశ్ చంద్రబాబు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. "ఎక్స్" వేదికగా ఆయన ట్వీట్ చేస్తూ ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మందికి స్ఫూర్తిగా నిలిచారు. ప్రపంచ వ్యాప్తంగా శాంతి, కరుణ, మానవత్వాన్ని పెంపొందించే తన పవిత్రమైన ఆశయ సాధనలో ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలు చేకూరాలని, శతాధిక కాలం జీవించాలని ప్రార్థిస్తున్నా. అని సిఎం అన్నారు.



# జింక్ లోపం ఉంటే ..

జింక్ అనేది ఒక ట్రేస్ ఎలిమెంట్. ఇది చాలా ముఖ్యమైంది. థైరాయిడ్ గ్రంథి పనితీరులో క్రోమియం, జింక్, సెలీనియం వంటి మినరల్స్ ప్రధాన పాత్ర పోషిస్తుంటాయి. సాధారణంగా జింక్ స్థాయి 70 ఎంసిం/డిఎల్ నుంచి ఎంసిం/డిఎల్ వరకు ఉండాలి. జింక్ స్థాయి తక్కువగా ఉన్నప్పుడు జుట్టు రాలిపోవడం, చర్మం పొడిబారడం, తొందరగా అలసిపోవడం, నిద్ర ఎక్కువగా రావడం, బద్ధకం, చిరాకు వంటి లక్షణాలు కనిపిస్తుంటాయి. థైరాయిడ్ లక్షణాలు కూడా దాదాపు ఇదేవిధంగా ఉంటాయి. జింక్ లోపం ఉన్నవారు దానిని భర్తీ చేసుకోవడానికి జింక్ ఉన్న మల్టీ విటమిన్ మాత్రలు తీసుకోవాల్సి ఉంటుంది. అలాగే ఇతర విటమిన్ల లోపం ఏదైనా ఉండా. అనేది కూడా చెక్ చేసుకోవడం మంచిది. ముఖ్యంగా క్రోమియం, సెలీనియం, బి 12, బి 1, విటమిన్ సి, విటమిన్ డి-3 కూడా చెక్‌చేయించుకోవాలి. ఒక్కో విటమిన్ లోపం ఉన్నప్పుడు ఒక్కో సమస్య ఉంటుంది. ఉదాహరణకు బి 12 తక్కువైతే తిమ్మిర్లు, బి 1 లోపిస్తే మతిమరుపు వంటి సమస్యలు వస్తుంటాయి. కాబట్టి, మీకు ఏయే విటమిన్ల లోపం ఎక్కువగా ఉందో వాటిని భర్తీ చేసే మల్టీ విటమిన్ మాత్రలను వైద్యుని సలహాతో ప్రతి రోజూ వేసుకుంటే సమస్య నుంచి బయటపడచ్చు. అలాగే ఆయా పోషకాలు అధికంగా లభించే పదార్థాలను కూడా ఆహారంలో భాగం చేసుకోవాలి. □

# జుట్టు రాలిపోకుండా..ఇలా !



జుట్టు రాలిపోయే సమస్య ఉన్నవారికి మేలు చేసే ఆయుర్వేద మూలికలు ఇవే.. ఎలా వాడాలంటే.. జుట్టు రాలిపోవడం ప్రస్తుతం చాలా మందిని వేధిస్తున్న సాధారణ సమస్యగా మారింది. మార్కెట్లో లభించే అనేక హెయిర్ ట్రీట్‌మెంట్లు ఉపయోగించి నప్పటికీ ఆశించిన ఫలితాలు రాకపోతే, సహజ పద్ధతుల వైపు మొగ్గు చూపడం మంచిదని ఆయుర్వేదం సూచిస్తోంది. ఆయుర్వేదం ప్రకారం శరీరంలో పిత్త దోషం పెరగడం వల్ల జుట్టు రాలే సమస్య ఎక్కువవుతుంది. జుట్టు రాలిపోవడం ప్రస్తుతం చాలా మందిని వేధిస్తున్న సాధారణ సమస్యగా మారింది. మార్కెట్లో లభించే అనేక హెయిర్ ట్రీట్‌మెంట్లు ఉపయో గించినప్పటికీ ఆశించిన ఫలితాలు రాకపోతే, సహజ పద్ధతుల వైపు మొగ్గు చూపడం మంచిదని ఆయుర్వేదం సూచిస్తోంది. ఆయుర్వేదం ప్రకారం శరీరంలో పిత్త దోషం పెరగడం వల్ల జుట్టు రాలే సమస్య ఎక్కువవుతుంది. శరీరంలో అధిక వేడి, ఒత్తిడి, అసమతుల్య జీవనశైలి కారణంగా జుట్టు బలహీనపడుతుంది. ఈ నేపథ్యంలో కొన్ని సహజ మూలికలు, నూనెలు జుట్టు ఆరోగ్యాన్ని మెరుగుపరచ డంలో సహాయపడతా యని చెబుతు న్నారు. పిత్త దోషాన్ని నియం త్రించేం దుకు ధూమ పానం, మద్యం, అధికం గా కాఫీ, టీ సేవించడం తగ్గించాలి. అలాగే పుల్లని ఆహారాలను పరిమితంగా తీసుకోవడం, తగినంత నిద్ర పోవడం, ఒత్తిడిని తగ్గించు కోవడం ద్వారా జుట్టు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ఆయుర్వేద నిపుణులు సూచిస్తున్నారు.

# జలకాలాటలలో ఏమి హాయిలే.. హలా !

**ఈ నదిలా.... నా పరువం ఉరకలు వేస్తోంది !** అనుకుంటూ ఆ యౌవ్వనాల జవ్వని వొళ్లంతా తడుపుకుని ఈత కొడుతోందని అనుకుంటున్నారా ? అదేం కాదు. ఆమె నదీ పరవశంలో ఉంది. ఆ నదిని ఆమె పెళ్లి చేసుకుంది .ఇది మూడేళ్ల క్రితం మాట. తాజాగా ఆమె ఇంకా తన పెళ్లి 3వ వార్షికోత్సవం జరుపుకుంటోంది. తమ లక్ష్యం నెరవేరినట్లు లేదు. అయినా ఆమె ముందుకు సాగుతూనే ఉంది. తాను స్నేహ బృందం సాక్షి గా మను వాడిన ఎవాన్ నదికి హక్కులన్నీ దఖలు పడితే తప్ప ఆమె పట్టిన పట్టు విడిచి పెట్టేటట్లు లేదు. వాళ్లంతా నదీ ప్రక్షాళన కోసం ఎంతవరకైనా వెళ్దామను కుంటున్నారు. **ఇంతకీ ఎవరామె.?**అదేనండి! ప్రపంచంలో సాధారణంగా మనుషులు ఒకరినొకరు వివాహం చేసుకుంటారు. అయితే బ్రిటన్‌కు చెందిన పర్యావరణ ఉద్యమకారిణి మెగ్ అవన్ ఇంగ్లండ్ నైరుతి ప్రాంతంలోని 'అవన్' నదిలో వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. ఆమె అసలు పేరు మెగ్ ట్రంప్.. కానీ 'నదీ పరిణయయం' మెగ్ అవన్'గా మార్చుకున్నారు. 17 జూన్ 2023లో ..అవన్ నదితో ప్రతీకాత్మకంగా వివాహం చేసుకోవడం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఇది చట్టబద్ధమైన వివాహం కాదు. కానీ నదుల కాలుష్యం, మురుగునీటి సమస్యలు, పర్యా వరణ పరిరక్షణపై ప్రజల దృష్టిని ఆకర్షించేందుకు నిర్వహించిన ఒక సృజ నాత్మక ఉద్యమం మాత్రమే. మెగ్ అవన్ అభిప్రాయం ప్రకారం, నదులను కేవలం సహజ వనరులుగా కాకుండా జీవవ్యవస్థలో అంతర్భాగంగా చూడాలి. నదులకు కూడా చట్టపరమైన హక్కులు ఉండాలని, వాటిని కాలుష్యం నుంచి రక్షి ంచే బాధ్యత సమాజానిదేనని ఆమె ప్రచారం చేస్తున్నారు. ఈ కార్యక్రమం వల్ల మెగ్ అవన్‌కు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ఆమె ప్రచారం వార్తల్లో నిలిచింది, డాక్యు మెంటరీలు రూపొందాయి, పర్యావరణ పరిరక్షణపై మరింత మంది చర్చించడం ప్రారంభించారు. ఈ కోణంలో చూస్తే ఆమె సందేశం ఎక్కువ మందికి చేరింది. ఆమెకు



వ్యక్తి గతంగా ఎటువంటి చట్టబద్ధమైన వివాహహక్కులు, ఆర్థిక లాభాలు లేదా ప్రత్యేక చట్టపరమైన ప్రయోజనాలు లభించలేదు. ఆమె ఆశించనూ లేదు. ప్రపంచం లోని కొన్ని దేశాల్లో నదులకు చట్టపరమైన వ్యక్తిత్వ హోదా వ్వాలనే ఉద్యమాలు జరుగుతు న్నాయి. అలాంటి హోదా లభిస్తే, నది తరఫున కోర్టులో కేసులు వేయ డం, కాలుష్యానికి వ్యతి రేకంగా చట్టపరమైన చర్యలు తీసుకోవడం సులభమవుతుందని ఉద్యమ కారులు భావిస్తున్నారు. మెగ్ అవన్ కూడా ఇదే లక్ష్యంతో అవన్ నదికి బలమైన చట్టపరమైన రక్షణ కల్పించాలని కోరుతున్నారు.



# సమయం కేటాయించాలి!

ఇల్లు, ఆఫీసు, పిల్లల స్కూల్ పనులతో రోజంతా బిజీగా ఉంటాం. అయితే రాత్రి నిద్రపోయే ముందు పిల్లల కోసం కేటాయించిన సమయంలో ఆ రోజు గురించి ప్రశ్నించాలంటు న్నారు నిపుణులు. దాంతో వాళ్ల ఆలోచనాతీరును గుర్తించొచ్చు అని చెబుతున్నారు. పిల్లలు జీవితంపై ఆ రోజు ఎటువంటి ప్రభావాన్ని చూపిందో అడగాలి. ఇది వాళ్ల ఆలోచనలు, భావోద్వే గాలను బయటపడేలా చేస్తుంది. వాళ్ల అవసరాలూ గుర్తించొచ్చు. అలాగే ఆ రోజుల్లో ప్రత్యేకంగా అనిపించిన విషయమేదో అడగాలి. సానుకూల అంశాలతో పాటు ప్రతికూలంగా అనిపించినవీ చెప్పమనాలి వీటినిబట్టి పిల్లల మానసికస్థితిని అంచనా వేయొచ్చు. వారిని బాధపెట్టిన విషయాన్ని అడగాలి. ఎదుటి వారివల్ల వారు పడుతున్న ఇబ్బందు లతోపాటు వాళ్లలోని భావోద్వేగ మేధస్సునూ గుర్తించొచ్చు. చుట్టూ ఉన్న వ్యక్తులను వారెలా అర్థం చేసుకోగలుగుతున్నారో తెలుసుకోవచ్చు. అలాగే పిల్లల సమస్యలను పరిష్కరిస్తే, తమకంటూ తల్లిదండ్రులు తోడున్నారనే భరోసా, నమ్మకం వాళ్లలో కలుగుతుంది. మనసులోని విషయాలను అమ్మానాన్నతో స్వేచ్ఛగా చెప్పడం అలవరుచుకుంటారు. ఏదైనా కొత్త విషయం నేర్చుకున్నారేమో అడగాలి. వాళ్ల చెప్పేది పూర్తిగా వినాలి. నేర్చుకోవాలనే ఆసక్తి ఉన్నందుకు ప్రశంసించాలి.

ఇది వారిని మరిన్ని తెలుసుకోవాలనే జిజ్ఞాసను పెంచుతుంది. ఏదైనా విషయం ఆ రోజు పిల్లలకు ఛాలెంజ్‌గా అనిపించిందేఎలా ప్రశ్నించాలి. దాన్ని సవాల్‌గా తీసుకొని ఎలా దాటొచ్చనేది సలహా ఇవ్వాలి. సమస్య ఎదురైతే ధైర్యంగా నిలబడగలుగుతారు. కొత్త స్నేహితులతో పరిచయాలు చదివిన పుస్తకం గురించి లేదా వాళ్లకు ఆ రోజు నచ్చిన సంభాషణ వంటివన్నీ పిల్లలతోకబురు చెబుతూనే తెలుసుకోవచ్చు. స్నేహం విలువ, ప్రముఖ వ్యక్తుల గురించి తెలుసుకోవడం ద్వారా విజ్ఞానం పెంపొందించుకోవచ్చని తెలుసుకుంటారు. గడిచిన రోజుఎంత విలువైందో అలాగే మరుసటి రోజుకు మరింత ప్రాముఖ్యత ఇవ్వడమెంత ముఖ్యమో నేర్చుకుంటారు. □

# చాణక్యుడి నిజాయతీ

చంద్రగుప్తమౌర్యుడి రాజ్య సలహాదారుడు, అర్థశాస్త్ర రచయిత అయిన చాణక్యుడిని కలవడానికి ఓసారి ఒక గ్రీకు రాయబారి వెళ్లాడు. చాణక్యుడు ఓ పూరిగుడిసెలో ఉండటం చూసి 'ఇంతటి గొప్పవాడు ఈ సాధారణ గుడిసెలో ఎలా ఉంటున్నాడు? అనుకుని ఆశ్చర్యపోయాడు. ఆ ఇంట్లో దీపం వెలుగులో ముఖ్యమైన కాగితాలు చూస్తూ ఉన్నాడు చాణక్యుడు. ఆ రాయబారిని చూసిన వెంటనే.. ఉన్న దీపం ఆర్పేసి మరో దీపం వెలిగించాడు. 'రండి కూర్చోండి. మీరెవరు? ఏ పని మీద వచ్చారు? అని ప్రశ్నించాడు. అప్పుడా గ్రీకు రాయబారి 'అయ్యా! అది చెబుతా కానీ ముందు నా సందేహం తీర్చండి. ముందుననన దీపానినన ఆర్పేసి మరో దీపం ఎందుకు వెలిగించారు? అని అడిగాడు. దానికి చాణక్యుడు.. 'నేను దేశం కోసం చేసే పనులకు సంబంధించి ఆ దీపం వెలుగులో చేస్తాను. దాని నూనె ఖర్చులనురాజుగారు భరిస్తారు. ప్రస్తుతం మీరు నాతో సొంత విషయాలు మాట్లాడటానికి వచ్చారు. అందువల్ల ఆ దీపం ఆర్పేసి ఇది వెలిగించాను దీనికయ్యే నూనె నా జీతం డబ్బులతో కొన్నాను' అని బదులిచ్చాడు. ఆ సమాధానం విన్న రాయబారి చాణక్యుడి నిజాయతీ చూసి ఆశ్చర్యపోయాడు. □

# తేనీరుకు బదులు ..

వేపుడు కూరలు తినొద్దు. కాయగూరలను ఉడికించి తాలింపు పెడితే మంచిది అంటున్నారు ఆహార నిపుణులు. అలా కూరగాయల్ని ఉడికించాక.. ఆ నీటిని పారబోస్తున్నారా! ఆ నీళ్ల తాగటం వల్ల ఎన్ని ప్రయోనాలు ఉన్నాయి. కూరగాయాలు ఉడికించిన నీళ్లలో చిటికెడు ఉప్పు జోడించి తాగారంటే.. శరీరానికి అవసరమైన విటమిన్లు. ఖనిజాలు అందుతాయి. ఇంకా రుచిగా ఉండాలంటే కాస్త మిరియాల పొడి జోడిస్తే సరి. ఈ నీరు తేలిగ్గా జీర్ణమై వెంటనే శక్తి కలుగుతుంది. వెచ్చగా ఉన్నప్పుడు తాగితే.. అలసట పోయి ఉత్సాహంగా ఉంటుంది. కాఫీ ఛాయ్‌లకు బదులు ఈ నీటిని తాగటం అలవాటు చేసుకుంటే ఆరోగ్యం సురక్షితం. బరువు తగ్గాలనుకునే వారికి ఈ నీరు ఔషధంలా పనిచేస్తుంది. గోరుచిక్కుడు, క్యారెట్, క్యాబేజ్, క్యాలీఫ్లవర్, బీట్‌రూట్, దోస.. వంటివి కొద్దికొద్దిగా చేర్చి ఉడికించి తాగితే మరింత ఉపయోగం. రక్తహీనత నుంచి బయటపడొచ్చు. ఆ నీటిని అలాగే తాగటం ఇష్టం లేకపోతే.. సూప్.. పులుసు, న్యూడుల్స్, పాస్తా ఫ్రైడ్ రైస్ వంటి వాటిల్లో ఉపయోగించండి. □



# తెర

## 'లెనిన్' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో నాగార్జున



అఖిల్ అక్కినేని, భాగ్యశ్రీ బోర్సే జంటగా అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో మనం ఎంటర్‌ప్రైజెస్ ఎల్ఎల్‌పి, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ నిర్మించిన చిత్రం'లెనిన్. ఈ మూవీకి మురళి కిషోర్ అబ్బూరు దర్శకత్వం వహించారు. ఈ చిత్రాన్ని జులై 10న వరల్డ్ వైడ్‌గా గ్రాండ్ రిలీజ్ చేయబోతోన్నారు. ఈ క్రమంలో తిరుపతిలో ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కింగ్ నాగార్జున మాట్లాడుతూ.. .'నందు ముందుగా శ్రీరామపురంలో జరిగే కథ అని చెప్పారు. నాన్న శ్రీరామపురం లో అనే ఊర్లోనే పుట్టారు. నందు చెప్పిన కథ నాకెంతో నచ్చింది. ప్రతీ పాత్రలో రకరకాల కోణాలున్నాయి. సెకండాఫ్‌లో వచ్చే ట్విస్టుల్ని ఎవ్వరూ ఊహించలేరు. ప్రేమ కోసం రాజ్యాలు కూలిపోయాయి.. యుద్ధాలు జరిగాయి.. 'లెనిన్' లోనూ ఓ ప్రేమ కథ ఉంది. హీరో అఖిల్ అక్కినేని మాట్లా డుతూ.. .. 'లెనిన్'తో నేను మీ (అభిమానులు) ఇంటిలో ఒకడిని అవ్వాలని ప్రయత్నం చేశాను. సీమ బిడ్డ నందు నాకు అద్భుతమైన కథ చెప్పారు. నా జర్నీ, నా పెయిన్ అంతా కూడా ఈ కథలోనే కనిపించింది. అందుకే నేను వెంటనే ఒకే చెప్పాను. నిర్మాత సూర్య దేవర నాగవంశీ మాట్లా డుతూ.. 'లెనిన్' కోసం అఖిల్ చాలా కష్టపడ్డాడు. నేనే అఖిల్‌ను ఎక్కువ ఇబ్బంది పెట్టాను. 'లెనిన్' చాలా ఎంగేజింగ్‌గా ఉంటుంది. సినిమాలో చాలా సర్ ప్రైజ్‌లు ఉంటాయి. హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే మాట్లా డుతూ.. 'లెనిన్'లో నేను భారతి అనే పాత్రను పోషించాను. ఇలాంటి గొప్ప పాత్రను నాకు ఇచ్చిన దర్శక, నిర్మాతలకు థాంక్స్. నా కెరీర్‌లో భారతి అనే పాత్ర నిలిచి పోతుంది. నటుడు శివాజీ మాట్లాడుతూ..అన్నపూర్ణ బ్యానర్, నాగార్జునవల్లే నా సినీ కెరీర్ ప్రారంభమైంది. లెనిన్‌నా హార్ట్‌కి దగ్గరైన చిత్రం. మేం ఇప్పుడు ఎక్కువగా మాట్లాడం. రిలీజ్ అయ్యాక సినిమానే మాట్లాడుతుంది.

## అన్నీ తానై తానే అన్నీ !



ఆయన అందమైన స్వరద్రూపి కాకపోవచ్చు అలా అని ఏదో జోకర్‌లా ఉంటాడనీ కాదు. తన ముందున్న ప్రేక్షకుల్ని నవ్విస్తాడు. కవ్విస్తాడు. ఇప్పుడాయన ఒక పాన్ ఇండియా చిత్రంలో ఏకంగా 11 విభిన్న పాత్రలను పోషించేందుకు ముందుకొచ్చారు. ఆయనెవరో కాదు తమిళ హాస్య నటుడు యోగిబాబు. గతంలో అక్కినేని నాగేశ్వరరావు నవరాత్రి 'చిత్రంలో 9 పాత్రలలో కనిపించారు. కమలహాసన్ దశావతారాం చిత్రంలో దశపాత్రధారిగా అలరించారు. ఇప్పుడు యోగిబాబు ఒక ఆకు ఎక్కువ చదివి నవరసాలూరించే 11 పాత్రలను ఒకే చిత్రంలో అభినయించనున్నారు. తమిళ సినిమా చరిత్రలోనే ఒక ప్రతిష్ఠాత్మకమైన, యాక్షన్ థ్రిల్లర్‌లో ప్రముఖ హాస్యనటుడు యోగి బాబు, రాబోయే భారీ బడ్జెట్ పాన్‌ఇండియన్ చిత్రంలో 11 విభిన్న పాత్రలను పోషించి అరుదైన రికార్డు సృష్టించనున్నారు . తొలిసారిగా దర్శకత్వం వహిస్తున్న ఆర్. కిషోర్ కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ హైఆక్టేన్ కామెడీ యాక్షన్‌థ్రిల్లర్‌లో, యోగి బాబు ప్రధాన కథానాయకుడి నుండి ప్రతి నాయకుడి వరకు అన్ని పాత్రలనూ ఆయనే పోషిస్తూ సందడి చేయనున్నారు. అత్యంత కీలకమైన బ్లాక్ బాక్స్ మిషన్ చుట్టూ తిరిగే యాక్షన్ థ్రిల్లర్ యోగి బాబు హీరో, విలన్, ఇంకా తొమ్మిది విభిన్న పాత్రలలో కనిపించనున్నారు. ఈ పాత్రలు ద్విపాత్రాభినయాలు, ప్రతి పాత్రకు విభిన్నమైన రూపం, హావభావాలు, ఇంకా ప్రత్యేకమైన భాష లేదా యాస కూడా ఉంటాయి. ఇది అతని కెరీర్‌లో ఒక కీలక మలుపు. భారత సైన్యానికి చెందిన హెలికాప్టర్ గందరగోళంగా కూలిపోవడంతో కథ ప్రారంభమవుతుంది. ప్రమాదం వెనుక ఉన్న నిజానిజాలను వెలికితీయడానికి, హెలికాప్టర్‌లో పోయిన బ్లాక్ బాక్స్‌ను తిరిగి తీసుకురావాలనే సవాలుతో కూడిన ఓ పనిని బృందం చేపడుతుంది. ఈ అన్వేషణలో వారు అనేక మలుపులు, ఉత్కంఠభరితమైన యాక్షన్ సన్నివేశాలు హాస్యభరిత దృశ్యాలను చూడగలం. ఈ చిత్రంలో యోగి బాబుతో పాటు అదితి రవి, రెడిన్ కింగ్స్లీ, విటివి గణేష్, పంజు సుబ్బు ఎ. వెంకటేష్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. మొదటి షెడ్యూల్ ఇప్పటికే పూర్తయింది, తదుపరి దశ చిత్రీకరణ యునైటెడ్ కింగ్‌డమ్ , కెన్యాలో జరగనుంది.తమిళ చిత్రసీమలో అత్యంత బిజీగా ఉండే హాస్యనటుడి స్థాయి నుండి, 'ధర్మ ప్రభు', 'గుర్ఖా', 'మండేలా', 'యానై ముగత్తాన్', 'లక్కీ మ్యాన్', 'బూమర్ అంకుల్', 'తూకుదురై' వంటి విజయవంతమైన నటుడిగా యోగి బాబు ప్రేక్షకులను అలరించారు. 'కోలమావు కోకిల' వంటి చిత్రాలలో ఆయన పోషించిన సహాయక పాత్రలు కూడా ఎంతో గుర్తింపు తోచ్చాయి. ఒకే చిత్రంలో తాజా ప్రాజెక్టు ఒక ప్రత్యేకమైన వినోదాత్మక చిత్రంగా నిలుస్తుం దన్న భారీ అంచనాలు ఉన్నాయి.

## 'చెన్నై లవ్ స్టోరీ' మార్క్ క్రియేట్ చేయాలి: ఎస్‌కెఎన్



జర్నలిస్ట్‌గా కెరీర్ ప్రారంభించి కల్ట్ ప్రొడ్యూసర్‌గా ఎదిగారు ఎస్‌కెఎన్. టాక్సీవాలా, బేబి వంటి చిత్రాలు ప్రొడ్యూసర్‌గా ఆయన అభిరుచికి నిదర్శనంగా నిలు స్తాయి. రాజీ పడకుండా కథ కోరుకున్నవన్నీ సమకూర్చి సినిమా నిర్మించడమే కాదు ఆ చిత్రాన్ని ప్రేక్షకుల దగ్గరకు తీసుకెళ్లడంలో వినూత్నంగా ఆలోచిస్తుంటారు ఎస్‌కెఎన్. స్ట్రాంగ్ కంటెంట్‌తో సినిమాలు చేస్తూ బ్లాక్ బస్టర్స్ అందుకుంటున్న ఈ రైజింగ్ ప్రొడ్యూసర్.. ఇప్పుడు 'చెన్నై లవ్ స్టోరీ' సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. మన తెలుగు జంట నివసిస్తుంటారు. అందుకే చెన్నై లవ్ స్టోరీ అని సినిమా టైటిల్ పెట్టాం. బేబి సినిమా బ్లాక్ బస్టర్ తర్వాత మేకర్స్‌గా మాపై అంచనాలు పెరిగాయి. అందుకే ఒక మంచి మూవీతోనే ఆడియెన్స్ ముందుకు రావాలని ఏడాది సమయం తీసు కున్నాం. ప్రస్తుతం మా సినిమా తెలుగు రిలీజ్ వర్క్స్ స్పీడ్‌గా జరుగుతున్నాయి. తమిళ్ రిలీజ్ అదే వారం చేయాలా, ఒకట్రెండు వారాలు ఆగి చేయాలా అనేది ఆలోచించి నిర్ణయం తీసుకుంటాం. మేము అనుకున్న కథకు కిరణ్ అబ్బవరం వందశాతం న్యాయం చేశారు. ఆయన ఇప్పటిదాకా బాయ్ నెక్స్ట్‌డోర్ క్యారెక్టర్స్ చేశారు. మాస్ క్యారెక్టర్స్‌లో నటించారు. కిరణ్ నటనలోని ఒక మెచ్యూరిటీని ఈ సినిమాలో చూస్తారు. సాయి రాజేష్ కథల్లో హీరోయిన్స్‌కు మంచి ప్రాధాన్యత ఉంటుందని మీకు తెలుసు.ఈ సినిమా కథ అనుకున్నాక, ఇంత బలమైన పాత్ర ఎవరు చేస్తే బాగుంట.,? తొలిప్రేమ అయినా మలిప్రేమ అయినా మన జీవితం లో భాగమే. తొలి ప్రేమ దక్కని వారిలో మళ్లీ ప్రేమ పుట్టదని చెప్పలేం. ఏదైనా జీవితం ముందుకు సాగాల్సిందే. బేబి సినిమాను తొలి ప్రేమ నేపథ్యంగా నిర్మించాం.



## 'అమీర్ లోగ్' టీజర్ విడుదల

అవ్వల్ నంబర్ ప్రొడక్షన్స్ ఎల్ఎల్‌పి బ్యానర్ పై మాధవి రెడ్డి సోమ నిర్మాణంలో రమణారెడ్డి సోమ దర్శకత్వంలో తెరకెక్కిన సినిమా 'అమీర్ లోగ్' ఎంసీ హరి, మనోజ్, శశిధర్ హీరోలుగా నటించిన ఈ చిత్రంలో వేద జలంధర్ , రావణ్ నిట్టూరు, విశ్వేందర్ రెడ్డి, సాయి యోగి పలువురు కీలక పాత్రలు పోషించారు. ఈ సందర్భంగా నిర్వహించిన టీజర్ లాంచ్ ఈవెంట్‌లో.. వంశీ నందిపాటి మాట్లాడుతూ.. 'అమీర్ లోగ్' మూవీని నేను ఆల్రెడీ చూశాను. డబ్బు పరంగా రిచ్ అని అనుకుంటారు. కానీ స్నేహం, ప్రేమ విషయంలో రిచ్. మిడిల్ క్లాస్ జీవితాల్ని చూపించారు. సినిమాని చూస్తూ నేనెంతో ఎంజాయ్ చేశాను. దర్శ కుడు రమణా రెడ్డి మాట్లాడుతూ.. 'అమీర్ లోగ్' సినిమా ట్రైలర్ లాంచ్‌కు వచ్చిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. మా కోసం వచ్చి టీజర్‌ను రిలీజ్ చేసిన వంశీకి థాంక్స్. ..ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ సందీప్ మాట్లాడుతూ.. 'అమీర్ లోగ్' టీజర్ లాంచ్ ఈవెంట్‌కు వచ్చిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్ అని అన్నారు...కామ్రేడ్ కళ్యాణ్ నిర్మాత వెంకట కృష్ణ మాట్లాడుతూ.. .అమీర్ లోగ్ టీజర్ లాంచ్ ఈవెంట్‌కి వచ్చిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. రమణరెడ్డికి సినిమా పట్ల ఎంతో ప్యాషన్ ఉంది. ..మ్యూజిక్ డైరెక్టర్ స్మరణ్ సాయి మాట్లా డుతూ.. 'అమీర్ లోగ్' నాకెంతో ప్రత్యేకం. షూటింగ్ అంతా లంగర్ హౌజ్‌లో, మ్యూజిక్ అంతా కాచిగూడలో జరిగింది. నటుడు మనోజ్ మాట్లాడుతూ.. 'అమీర్ లోగ్'టీజర్ లాంచ్‌కి వచ్చిన వంశీకి థాంక్స్. మాకు సపోర్ట్ చేస్తున్న స్పిరిట్ మీడియాకి థాంక్స్. మా అందరినీ ఎంకరేజ్ చేసిన రమణకి థాంక్స్‌నటుడు విశ్వేందర్ రెడ్డి మాట్లాడుతూ.. .'అమీర్ లోగ్' నా మనసుకు నచ్చిన చిత్రం. ఈ కథ అంతా కూడా బిర్యానీ చుట్టూనే తిరుగుతుంది.

## 'వ్యూ: ది పాయింట్ ఆఫ్ వ్యూ' టీజర్ లాంచ్



'వ్యూ: ది పాయింట్ ఆఫ్ వ్యూ' టీజర్ లాంచ్ ఈవెంట్..... మహేష్ కాంపెల్లి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'వ్యూ: ది పాయింట్ ఆఫ్ వ్యూ' చిత్ర టీజర్‌ను చిత్రబృందం నేడు ఘనంగా విడుదల చేసింది. ఈ చిత్రం విభిన్నమైన కథనంతో తెరకెక్కుతోంది. "ది పాయింట్ ఆఫ్ వ్యూ" అనే ట్యాగ్‌లైన్‌నే కథలోని ప్రధాన అంశాన్ని ప్రతిబింబిస్తోంది. టీజర్ విడుదల సందర్భంగా హైదరాబాద్‌లో చిత్ర యూనిట్ ఘనంగా మీడియా సమావేశాన్ని నిర్వహించింది.నిర్మాత సత్య చౌదరి మాట్లాడుతూ.... "మీడియా మిత్రులందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు. నేను వృత్తిరీత్యా కాంట్రాక్టర్‌ని. కానీ సినిమాలపై ఉన్న ఆసక్తితో ఈ రంగంలోకి వచ్చాను. దాదాపు పదేళ్ల క్రితం మహేష్ ఈ కథను నాకు వినిపించారు. ఒక మహిళా ప్రధాన కథతో మంచి సందేశాన్ని అందించాలనే ఉద్దేశంతో ఈ చిత్రాన్ని నిర్మించాను" అన్నారు. హీరోయిన్ సోనియా నాయుడు మాట్లా డుతూ....స్టేజ్‌పై మాట్లాడటం ఇదే మొదటిసారి. నాకు ఈ అవకాశం ఇచ్చిన సత్యకి, మహేష్‌కి ధన్యవాదాలు. హీరోయిన్ పూజా రెడ్డి మాట్లాడుతూ.. "మా టీజర్ విడుదల కార్యక్రమానికి వచ్చిన మీడియా మిత్రులందరికీ ధన్యవాదాలు. మహేష్ కథ చెప్పిన వెంటనే ఇది నాకు మంచి అవకాశం అని భావించాను. ఈ సినిమాలో నటించడం చాలా ఆనందంగా ఉంది. ..దర్శకుడు మహేష్ కాంపెల్లి మాట్లాడుతూ.... "ఇది నా తొలి దర్శకత్వ చిత్రం. నేను ఇంతకుముందు ఏ దర్శకుడి దగ్గరా పని చేయలేదని నిర్మాత సత్యకి ముందే చెప్పాను. అయినప్పటికీ నేను రాసుకున్న కథపై పూర్తి నమ్మకం ఉంది.

## 'నాగబంధం'కు విజయాన్ని ఇచ్చిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు

థియేటర్‌లో ప్రేక్షకుల రియాక్షన్స్ చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది. సినిమా హౌస్ ఫుల్‌గా రన్ అవుతోంది: థాంక్స్ మీట్‌లో హీరో విరాట్ కర్ణ



విరాట్ కర్ణ హీరోగా అభిషేక్ నామా దర్శ కత్వంలో రూపొందిన లేటెస్ట్ బ్లాక్ బస్టర్ నాగబంధం. నిక్ స్టూడియోస్ బ్యానర్‌పై కిషోర్ అన్నపురెడ్డి, నిశిత నాగిరెడ్డి ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో ప్రతి ష్టాత్మకంగా నిర్మించారు. ఈ చిత్రంలో నభా నటేష్, ఐశ్వర్య మీనన్, జగపతిబాబు, మహేష్ మంజ్రేకర్, రిషబ్ సావ్నీ ఇతర కీలక పాత్రల్లో నటించారు. జూలై 3న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదలై ఘన విజయం సాధించి, థాంక్స్ మీట్‌లో హీరో విరాట్ కర్ణ మాట్లాడుతూ.. 'మేమందరం కొత్తవాళ్లం కలిసి ఇంత భారీ బడ్జెట్‌తో ఒక కొత్త ప్రయత్నం చేశాం. ఈ ప్రయత్నానికి ఆడియన్స్ అందరూ కూడా థియేటర్‌కు వచ్చి మమ్మల్ని ప్రోత్సహి స్తున్నారు. హీరోయిన్ నభా నటేష్ మాటా డుతూ.. మా టీమ్ రెండున్నర ఏళ్ల కష్టానికి ప్రేక్షకులు అద్భుతమైన ఫలితాన్ని ఇచ్చారు. దర్శకుడు అభిషేక్ నామా మాట్లాడుతూ.. ఇది నా మొదటి చిత్రం. నేను విమర్శకులకు, రివ్యూ రైటర్లకు అందరికీ గౌరవం ఇస్తాను. అంతిమంగా ప్రేక్షకుల నిర్ణయమే తుది నిర్ణయం. ఆడియన్స్ రెస్పాన్స్ మేరకు ఫస్ట్ హాఫ్‌లో ఒక సాంగ్ లెంగ్త్ ఎక్కువగా ఉందని భావించి దాన్ని తొలగించాం. అలాగే క్లైమాక్స్ కూడా కొంచెం ఎక్కువగా ఉందని ట్రిమ్ చేశాం. కానీ కొంతమంది సినిమా రిలీజ్ కాకముందే రివ్యూలు ఇవ్వడం నాకు ఆశ్చ ర్యంగా అనిపించిందినిర్మాత నిశిత మాట్లా డుతూ..తెలుగు ప్రేక్షకులకు కృతజ్ఞతలు. మీ రుణం ఎలా తీర్చుకోవాలో తెలియడం లేదు. ఈ సినిమాకు ఎంతో ప్రేమ, ప్రోత్సాహం అందించారు

# జింబాబ్వే టి20 సిరీస్‌కు సంజూ ఔట్, ప్రభ్‌సిమ్రన్ ఇన్
# ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌కు ఎంపికైన శివమ్ దూబే

**ముంబై, జులై 6:** ఇంగ్లండ్‌తో జరిగే మూడు వన్డేల సిరీస్‌కు, జింబాబ్వేతో జరిగేటీ 20 సిరీస్‌లకు టీమిండియా జట్లను బీసీసీఐ ప్రకటించింది. శివమ్ దూబే దాదాపు రెండేళ్ల తర్వాత భారత వన్డే జట్టులోకి వచ్చాడు. గాయంతో దూరమైన నితీశ్ కుమార్ స్థానాన్ని దూబేతో బీసీసీఐ సెలక్షన్ కమిటీ భర్తీ చేసింది. టీ20 జట్టులో కీలక సభ్యునిగా ఉన్న దూబే.. చివరివన్డే 2024 ఆగస్టులో ఆడాడు. ఇదొక్క మార్పుతోనే సరిపెట్టింది.
జూలై 23నుంచి ప్రారంభం కాబోయే జింబాబ్వేతో టీ20 సిరీస్‌కు ఊహించని మార్పులు చోటు చేసుకున్నాయి. సంజూ శాంసన్‌పై సెలక్టర్లు వేటు వేశారు. అతడి స్థానంలో ప్రభ్‌సిమ్రాన్ సింగ్‌ను ఎంపిక చేశారు. అలాగే వైభవ్ సూర్యవంశీని కొనసాగించారు. ఇంగ్లండ్ సిరీస్‌లో ఆడుతున్న అక్షర్ పటేల్, వాషింగ్టన్ , రవి బిష్ణోయ్, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్, ప్రసిద్ధ్ కృష్ణలకు విశ్రాంతినిచ్చారు. అశోక్ శర్మ, యశ్ ఠాకూర్, మయాంక్ యాదవ్‌లు జట్టులోకి రాగా, ఫినిషర్ రింకూ సింగ్ తిరిగి జట్టులోకి రీ ఎంట్రీ ఇచ్చాడు.



**ఇంగ్లండ్‌తో వన్డేలకు భారత్ జట్టు:** శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ , కోహ్లీ, శ్రేయస్ అయ్యర్, రాహుల్, ఇషాన్ కిషన్, వాషింగ్టన్, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, బుమ్రా, ప్రసిద్ధ్ కృష్ణ, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్, గుర్నూర్ బ్రార్, శివమ్ దూబే.
**జింబాబ్వేతో టీ20లకు భారత్ జట్టు:** శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, ఇషాన్ కిషన్, ప్రభ్‌సిమ్రన్, శివమ్ దూబే, సూర్యాంశ్ షెడ్గే, రింకూ సింగ్, హర్ష్ దూబే, వరుణ్ చక్రవర్తి, ప్రిన్స్ యాదవ్, యశ్ ఠాకూర్, అశోక్ శర్మ, మయాంక్ యాదవ్.

## గుండె పగిలిన బ్రెజిల్ స్టార్ నేమార్
# సాకర్‌కు అల్విదా

**న్యూజెర్సీ, జులై 6:** బ్రెజిల్ ఫుట్‌బాల్‌లో కొత్త తరానికి స్ఫూర్తిగా నిలిచిన నేమార్ జూనియర్ వీడ్కోలు పలికాడు. పీలే, రొనాల్డో, రొనాల్డిన్హో వంటి దిగ్గజాల వారసత్వాన్ని కొనసాగించి, షో మ్యాన్‌గా ఓ వెలుగు వెలిగిన నేమార్ అనూహ్యంగా సాకర్‌కు బైబై చెప్పేశాడు. ఫిఫా ప్రపంచకప్ క్వార్టర్ ఫైనల్లో నార్వే చేతిలో ఓటమితో కుంగిపోయిన బ్రెజిల్ స్టార్ నేమార్.. ఈ తీవ్ర నిర్ణయానికి వచ్చాడు. ఆ సమయంలో తీవ్ర ఉద్వేగానికి గురై, కన్నీరు పెట్టుకున్నాడు. తన కెరీర్ ఎక్కడ మొద లైందో అక్కడే ముగిసిందని వెల్లడించాడు. తన ప్రాణానికి ప్రాణమైన ఆటకు నేమార్ విచార వదనంతో అల్విదా చెప్పడం కోట్లాదిమందిని కలచివేసింది. ఈ నిర్ణయంతో నేమార్ 16 ఏళ్ల కెరీర్ ముగిసింది.
నేమార్... బ్రెజిల్ ఫుట్‌బాల్‌లో ఈ పేరు ఓ సంచలనం. బ్రెజిల్ తరపున ఆడిన దిగ్గజ ఆటగాళ్లలో ఒకడిగా గుర్తింపు పొందాడు. బ్రెజిల్ తరపున అత్యధిక గోల్స్ చేసిన ఆటగాడిగా నిలవడంతో పాటు.. జట్టు విజయాల్లో కీలకపాత్ర పోషించాడు. 130 మ్యాచ్‌లలో 80గోల్స్ సాధించాడు. 2010లో అరంగేట్రం చేసిన న్యూజెర్సీలోని మెల్‌లైఫ్ స్టేడియంలోనే యాదృచ్ఛికంగా చివరి మ్యాచ్ ఆడేశాడు.
రెండో అర్ధభాగంలో మైదానంలోకి వచ్చిన నేమార్.. పెనాల్టీని గోల్‌గా మలిచినా, బ్రెజిల్‌ను టోర్నీ నుండి నిష్క్రమించకుండా ఆపలేకపోయాడు. ఫైనల్ విజిల్ తర్వాత అతను ఏకధాటిగా ఏడుస్తున్న దృశ్యాలు అభిమానుల హృదయాలను కలచివేశాయి. అతని బ్రెజిల్ సహచరులు చాలామంది అతన్ని ఓదార్చుడానికి ప్రయత్నించారు, కానీ బార్సిలోనా మాజీ ఆటగాడైన అతను పూర్తిగా కుంగిపోయాడు. "నేను ప్రయత్నించాను, చాలా ప్రయత్నించాను. ఇప్పుడు అంతా ముగిసింది" అని నేమార్ అన్నాడు.




*నేను ప్రయత్నించాను, చాలా ప్రయత్నించాను. ఇపుడు అది ముగిసింది... నార్వే చేతిలో ఓటమితో బ్రెజిల్ నిష్క్రమించిన తర్వాత గుండె పగిలిన ఆవేదనతో ఫుట్‌బాల్ దిగ్గజం నేమార్ పలికిన మాటలు. సాకర్ ప్రపంచకప్ అందించాలన్న కలలు కల్లలయిన వేళ కన్నీళ్లతో తన ఫుట్‌బాల్ కెరీర్‌కు అల్విదా పలికాడు.*

# మెక్సికోకు ఇంగ్లండ్, బ్రెజిల్‌కు నార్వే షాక్




**న్యూజెర్సీ, జులై 6:** నార్వే సరికొత్త చరిత్ర సృష్టించింది. తొలిసారి ప్రపంచకప్ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. ప్రి క్వార్టర్ ఫైనల్లో హాట్ ఫేవరెట్ బ్రెజిల్‌పై 2-1 గోల్స్ తేడాతో గెలుపొందింది. నార్వే స్టార్ ఫార్వర్డ్, మాంచెస్టర్ సిటీ సంచలనం ఎర్లింగ్ హాలాండ్ రెండు గోల్స్‌తో నార్వేకు అద్భుత విజయాన్ని అందించాడు. ప్రారంభం నుంచి ఇరు జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. అయితే బ్రెజిల్‌కు లభించిన గోల్డెన్ ఛాయిస్‌ను చేజార్చుకుంది. ఆట ప్రారంభంలోనే పెనాల్టీ లభించగా గిమారెస్ దాన్ని గోల్‌గా మలచడంలో తడబడ్డాడు. నార్వేగోల్‌కీపర్ నైలాండ్ అడ్డుకున్నాడు. దీంతో తొలి హాఫ్ ముగిసేసరికి ఇరు జట్లు గోల్ లెస్‌గా నిలిచాయి.

### చెలరేగిన హాలాండ్

ద్వితీయార్థంలో నార్వే స్టార్ స్ట్రైకర్ ఎర్లింగ్ హాలాండ్ దూసుకుపోయాడు. ఆట 79వ నిమిషంలో నార్వే ఆటగాడు షెల్డెరప్ అద్భుతమైన క్రాస్‌ను అందించగా దాన్ని హాలాండ్ అత్యంత ఎత్తుకు లేచి బ్రెజిల్ గోల్‌పోస్ట్‌లోకి పంపాడు. దీంతో నార్వే 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. మొదటి గోల్ ఇచ్చిన షాక్ నుంచి బ్రెజిల్ కోలుకోకముందే, హాలాండ్ మరోసారి తన ప్రతాపం చూపించాడు. బ్రెజిల్ డిఫెన్స్ లోపాలను అనుకూలంగా మార్చుకుంటూ మ్యాచ్ ముగియడానికి కొన్ని నిమిషాల ముందు హాలండ్ రెండో గోల్ సాధించి నార్వే ఆధిక్యాన్ని 2-0కు పెంచాడు. ఇది ఈ సాకర్ వరల్డ్ కప్‌లో హాలాండ్‌కు ఏడో గోల్. మెస్సీ, కిలియన్ ఎంబాపేల సరసన నిలిచిన హాలాండ్... గోల్డెన్ బూట్ రేసులో నిలిచాడు.

### ఇంజ్యూరీ టైమ్‌లో బ్రెజిల్ గోల్

ఇకమ్యాచ్ ఇంజ్యూరీ టైమ్ 10వ నిమిషంలో బ్రెజిల్ ఆటగాడు కాసెమిరోను నార్వే డిఫెండర్ ఓస్టిగార్డ్ ప్రమాదకరంగా అడ్డుకోవడంతో బ్రెజిల్‌కు పెనాల్టీ లభించింది. ఈ పెనాల్టీని నేమార్ గోల్‌గా మలిచి నార్వే ఆధిక్యాన్ని 2-1కు తగ్గించాడు. ఈ ప్రపంచ కప్‌లో నేమార్‌కు ఇదే మొదటి గోల్. అప్పటికే సమయం మించిపోవడంతో బ్రెజిల్ 2-1తో ఓటమిని చవిచూడాల్సి వచ్చింది.

### బెల్లింగ్‌హామ్ డబుల్.. మెక్సికోపై విజయం

సాకర్ ప్రపంచకప్‌లో ఇంగ్లండ్ అసాధారణ ఆటతీరు కొనసాగుతోంది. మెక్సికోను దాని సొంతగడ్డపై 3-2తో ఓడించి క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. స్టార్ మిడ్‌ఫీల్డర్ జూడ్ బెల్లింగ్‌హామ్ రెండు నిమిషాల వ్యవధిలో (36, 38) రెండు గోల్స్ చేసి జట్టు విజయంలో కీ రోల్ పోషించాడు. కెప్టెన్ హ్యారీ కేన్ పెనాల్టీ ద్వారా మరో గోల్ (60వ నిమిషం) సాధించాడు. తొలి అర్ధభాగం 36వ నిమిషంలో బెల్లింగ్‌హామ్ తొలి గోల్‌తో ఇంగ్లండ్‌కు ఆధిక్యం అందించాడు. ఆ గోల్‌కు కేవలం 98 సెకన్ల వ్యవధిలోనే మరోసారి గోల్ చేసి స్కోరును 2-0కు చేర్చాడు. అతని వేగవంతమైన డబుల్‌తో మెక్సికో ఒక్కసారిగా ఒత్తిడిలో పడింది. అయినా పుంజుకుని 42వ నిమిషంలో జూలియన్ క్వినోనెస్ గోల్ చేసి ఇంగ్లండ్ ఆధికాన్ని 2-1కు తగ్గించాడు.

### కేన్ గోల్.. క్వాన్సా రెడ్ కార్డ్

రెండో అర్ధభాగం ప్రారంభమైన కొద్దిసేపటికే ఇంగ్లండ్‌కు పెనాల్టీ లభించింది. 60వ నిమిషంలో హ్యారీ కేన్ దాన్ని గోల్‌గా మలిచి జట్టుకు 3-1 ఆధిక్యంఅందించాడు. అయిదే జారెల్ క్వాన్సా రెడ్ కార్డ్ గురై మైదానం వీడడంతో ... దీన్ని అవకాశంగా మార్చుకుని మెక్సికో వరుస దాడులు చేసింది. రౌల్ జి మెనెజ్ మరో గోల్ చేసి 3-2కు తీసుకువచ్చాడు. చివరి నిమిషాల్లో మెక్సికో సమం చేసేందుకు తీవ్రంగా ప్రయత్నించినా ఫలితం లేకపోయింది.








# క్వార్టర్ ఫైనల్లో సినర్, కోకో గాఫ్

**లండన్, జులై 6:** ప్రపంచ నెంబర్‌వన్ జానిక్ సినర్.. వరుసగా ఐదో వింబుల్డన్ క్వార్టర్‌ఫైనల్లో ప్రవేశించాడు. జపనీస్ క్వాలిఫయర్ షింటారో మోచిజుకిపై 6-3, 7-6, 6-3 తేడాతో గెలుపొందాడు. డిఫెండింగ్ ఛాంపియన్ సినర్..తొలి సెట్‌ను అలవోకగానే నెగ్గాడు. అయితే రెండో సెట్‌లో షింటారో నుంచి అనూహ్య పోటీ ఎదురైంది. ఎవరి సర్వీసులు వారు నిలుపుకోవడంతో సెట్ టైబ్రేక్‌కు సాగింది. చివరకు అనుభవజ్ఞుడైన సినర్‌దే విజయం అయింది. మూడో సెట్‌ను మరింత ఈజీగా నెగ్గి క్వార్టర్‌ఫైనల్ చేరాడు. ఏడుసార్లు వింబుల్డన్ విజేత నోవాక్ జొకోవిచ్ ఈ ఘనత సాధించిన రెండో ఆటగాడిగా సినర్ నిలిచాడు. పురుషుల సింగిల్స్ మిగతా నాలుగో రౌండ్‌లో కొబొలి 7-4, 7-6, 6-3తో మినార్‌పై అతికష్టంపై గెలుపొండగా...స్టఫ్ 3-6,6-7, 7-6, 7-5, 4-2తో హుర్కాజ్‌పై గెలుపొందాడు. చివరి సెట్‌లో హుర్కాజ్ తొడకండరాల గాయంతో రిటైర్ అయ్యాడు.
కాగా అమెరికా సంచలనం కోకో గాఫ్... మహిళల సింగిల్స్‌లో తొలిసారి వింబుల్డన్ క్వార్టర్ ఫైనల్ చేరింది. నాలుగో రౌండ్‌లో బెలిండా బెన్సిక్‌ను 4-6, 6-3, 6-4 తేడాతో ఓడించింది. తొలి సెట్‌లో గాఫ్‌కు ఎదురుదెబ్బ తగిలింది. కోకో గాఫ్ సర్వీసును బెలిండా బ్రేక్ చేసి తొలి సెట్‌ను 6-4తో నెగ్గింది. అయితే వెంటనే పుంజుకున్న కోకో గాఫ్ రెండో సెట్‌ను 6-3తో ముగించి సమవుజ్జీగా నిలిచింది. ఫలితం తేల్చే మూడో సెట్‌ను కూడా ఈజీగా కైవసం చేసుకుని కోకో గాఫ్ ముందంజ వేసింది. మిగతా నాలుగో రౌండ్ మ్యాచ్‌ల్లో నొస్కోవా 6-4, 7-6తో చెమటోడ్చి 26వ సీడ్ కీస్‌పై గెలుపొందగా... మూడు సెట్ల పోరులో పావోలిని 6-4, 4-6, 6-3తో ఇలాపై, మెర్టెన్స్ 6-4, 6-4తో బౌజ్కోవాపై, కోస్ట్యుక్ 6-4, 6-4తో క్రుయేగర్‌పై నెగ్గి క్వార్టర్ ఫైనల్ చేరారు.


# ఆటో, మెటల్ షేర్ల మద్దతు




# లాభాల్లో సెన్సెక్స్, నిఫ్టీ

**ముంబయి, జులై 6:** దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా నాలుగో ట్రేడింగ్ సెషన్‌లోనూ లాభాలతో ముగిశాయి. తొలి త్రైమాసిక వ్యాపార అప్‌డేట్లు ఆశాజనకంగా ఉండటం, ముడి చమురు ధరలు తగ్గుముఖం పట్టడం, నైరుతి రుతుపవనాల పురోగతి మెరుగుపడటం, భౌగోళిక ఉద్రిక్తతలు తగ్గడం వంటి అంశాలు మార్కెట్‌కు ఊతమిచ్చాయి. ఆటో, కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఆయిల్ అండ్ గ్యాస్, మెటల్ షేర్లలో కొనుగోళ్లు జోరుగా సాగగా.. ఐటీ, పీఎస్‌యూ బ్యాంకింగ్ షేర్లు మాత్రం ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. సెన్సెక్స్ 521 పాయింట్లు లాభపడి 78 వేల 285 వద్ద ముగిసింది. నిఫ్టీ 159 పాయింట్లు ఎగిసి 24 వేల 430 వద్ద స్థిరపడింది. గత నాలుగు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్, నిఫ్టీ రెండూ దాదాపు 2.36 శాతం చొప్పున ర్యాలీ చేశాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లలో నమోదైన బలమైన కొనుగోళ్లు నిఫ్టీకి ప్రధాన బలంగా నిలిచాయి.
మరోవైపు మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు కూడా స్వల్ప లాభాలతో ముగిశాయి. భారత్ 10 ఏళ్ల ప్రభుత్వ బాండ్ యీల్డ్ 6.679 శాతానికి తగ్గింది. రూపాయి డాలర్‌తో పోలిస్తే స్వల్పంగా బలహీనపడి 95 రూపాయల 40 పైసల వద్ద ట్రేడైంది. ఎంసీఎక్స్‌లో బంగారం ఫ్యూచర్స్ ధరలు స్వల్పంగా తగ్గగా బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 71 డాలర్ల 91 సెంట్ల వద్ద కొనసాగింది. అంతర్జాతీయ మార్కెట్లలో యూరప్ సూచీలు స్వల్ప నష్టాల్లో ట్రేడవగా ఆసియా మార్కెట్లు మిశ్రమ ధోరణితో ముగిశాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ ఈనెల వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచే అవకాశాలు పెరగడంతో ఇన్వెస్టర్ల దృష్టి ఫెడ్ సమావేశపు మినిట్స్‌పై కేంద్రీకృతమైంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేరు 3.36 శాతం, ఇండస్‌ఇండ్ బ్యాంక్ 3.76, కరూర్ వైశ్యా బ్యాంక్ 4.87, బంధన్ బ్యాంక్ 4.06 శాతం లాభపడ్డాయి. డిక్సన్ టెక్నాలజీస్ దాదాపు 7 శాతం ఎగసింది. ఫెర్మెంటా బయోటెక్ 13.78 శాతం జంప్ చేసింది. మరోవైపు సుప్రియా లైఫ్‌సైన్స్ షేరు 11 శాతానికి పైగా పతనమైంది. బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర షేరు 2.29 శాతం తగ్గింది. కొత్తగా లిస్టైన ఆస్తా స్పింటెక్స్ షేరు ఇష్యూ ధర కంటే స్వల్ప ప్రీమియంతో 136 రూపాయల 45 పైసల వద్ద ముగిసింది. ఫాల్కాన్ కాన్సెప్ట్స్‌కు 101 కోట్ల 93 లక్షల రూపాయల విలువైన వర్క్ ఆర్డర్ లభించడంతో ఆ కంపెనీ షేరు 20 శాతం అప్పర్ సర్క్యూట్‌ను తాకింది.

## భారత్ మార్కెట్ల నుంచి 580 మిలియన్ డాలర్ల పెట్టుబడులు విత్‌డ్రా



**ముంబయి, జులై 6:** భారత్ ఈక్విటీ మార్కెట్ల నుంచి విదేశీ పెట్టుబడులు పెద్దమొత్తంలో విత్‌డ్రా అయ్యాయి. గతవారం భారత మార్కెట్ల నుంచి భారీగా నిధులను వెనక్కి తీసుకున్నారు. ఎలారా సెక్యూరిటీస్ నివేదిక ప్రకారం భారత ఈక్విటీ మార్కెట్ల నుంచి విదేశీ పెట్టుబడిదారులు మొత్తం580 మిలియన్ డాలర్ల పెట్టుబడులను ఉపసంహరించుకున్నారు. ఇందులో భారత్‌కే ప్రత్యేకంగా పెట్టుబడులు పెట్టే ఫండ్ల నుంచి 250 మిలియన్ డాలర్లు వెనక్కి వెళ్లగా మిగిలిన నిధులు గ్లోబల్ ఎమర్జింగ్ మార్కెట్స్, ఆసియా ఎక్స్ జపాన్ ఫండ్ల ద్వారా ఉపసంహరణకు గురయ్యాయి.
అంతకుముందు వారంలో 94 మిలియన్ డాలర్లుగా ఉన్న ఉపసంహరణలు ఇప్పుడు మరింత పెరిగాయి. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో నమోదైన భారీ విక్రయాలతో పోలిస్తే ప్రస్తుత ఉపసంహారణలు తక్కువగానే ఉన్నాయి. అమెరికా ఈక్విటీ ఫండ్ల నుంచి ఒక్క వారంలోనే 17 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వెనక్కి వెళ్లాయి. అంతకుముందు వారంలో ఈ మొత్తం 8 బిలియన్ డాలర్లుగా ఉండగా మూడు వారాల క్రితం మాత్రం రికార్డు స్థాయిలో 120 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చాయి.
మార్చి తర్వాత తొలిసారిగా ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్లలో కూడా 9 బిలియన్ డాలర్ల అవుట్‌ఫ్లో నమోదైంది. ఏప్రిల్, మే నెలల్లో కృత్రిమ మేధస్సు ఆధారిత పెట్టుబడుల ప్రభావంతో పెరిగిన ఎమర్జింగ్ మార్కెట్ పెట్టుబడుల జోరు తగ్గుముఖం పట్టిందని ఎలారా వెల్లడించింది. ఇతర అభివృద్ధి చెందుతున్న మార్కెట్లలో తైవాన్ నుంచి 766మిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడులు వెనక్కి వెళ్లాయి. ఇది గత 11 ఏళ్లలో అత్యధికం. దక్షిణ కొరియా నుంచి 283 మిలియన్ డాలర్లు బయటకు వెళ్లగా బ్రెజిల్ నుంచి గత ఏడు వారాల్లో దాదాపు 2 బిలియన్ డాలర్ల పెట్టుబడులు విత్‌డ్రా అయ్యాయి. కమోడిటీ ఫండ్ల నుంచి వరుసగా ఎనిమిదో వారంలో 1.5 బిలియన్ డాలర్ల అవుట్‌ఫ్లో నమోదైంది. ఎనర్జీ ఫండ్ల నుంచి రికార్డు స్థాయిలో 3.2 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వెనక్కి వెళ్లాయి. బంగారం ఫండ్ల నుంచి 14 వారాల్లో అత్యధికంగా 3.1 బిలియన్ డాలర్లు ఉపసంహరించుకోగా వెండి ఫండ్లలో మాత్రం పెద్దగా మార్పు కనిపించలేదు.

## స్వల్పకాలిక రుణాలతో రూ.2.53 లక్షలకోట్ల సేకరణ

**ముంబయి, జులై 6:** దేశీయ కార్పొరేట్ సంస్థలు కమర్షియల్ పేపర్లు సీపీల ద్వారా నిధుల సమీకరణలో భారీ వృద్ధికనిపిస్తోంది. అనుకూలమైన వడ్డీ రేట్లు, సీజనల్ వర్కింగ్ క్యాపిటల్ అవసరాలు, ఇప్పటికే ఉన్న రుణాల రీఫైనాన్సింగ్ కారణంగా జూన్ నెలలో సీపీల ద్వారా నిధుల సమీకరణ దాదాపు ఐదేళ్ల గరిష్ఠ స్థాయికి చేరింది. జూన్ నెలలో కంపెనీలు కమర్షియల్ పేపర్ల ద్వారా రూ.2 లక్షల 53 వేల కోట్లను సమీకరించాయి. మే నెలతో పోలిస్తే ఇది 84.6 శాతం అధికం. గత ఏడాది జూన్‌తో పోలిస్తే 59.4 శాతం వృద్ధి నమోదైంది.
2021 జూలైలో రూ.2 లక్షల 69 వేల కోట్ల సమీకరణ తర్వాత ఇదే అత్యధిక స్థాయి కావడం విశేషం. కరూర్ వైశ్యా బ్యాంక్ ట్రెజరీ విభాగాధిపతి వి. రామచంద్ర రెడ్డి మాట్లాడుతూ బ్యాంకు రుణాలతో పోలిస్తే కమర్షియల్ పేపర్ల ద్వారా నిధుల సమీకరణ తక్కువ వ్యయంతో ఉండటంతో కార్పొరేట్లు ఈమార్గాన్ని ఎక్కువగా ఎంచుకున్నారని తెలిపారు. వడ్డీ రేట్లు తగ్గుతాయనే అంచనాలు, మార్కెట్లో తగినంత నగదులభ్యత కూడా ఇందుకు దోహదపడిందని చెప్పారు. ధనలక్ష్మీ బ్యాంక్ ట్రెజరీ హెడ్ బాలసుబ్రమణియన్ మాట్లాడుతూ అధిక వడ్డీతో కూడిన బ్యాంకు రుణాలకు బదులుగా తక్కువ వ్యయంతో లభించే స్వల్పకాలిక మార్కెట్ ఫండింగ్ వైపు కార్పొరేట్లు, ఎన్‌బీఎఫ్‌సీలు మొగ్గు చూపుతున్నాయని తెలిపారు. పెట్టుబడిదారుల నుంచి మంచి డిమాండ్, స్థిరమైన క్రెడిట్ పరిస్థితులు కూడా ఈ ధోరణికి బలం చేకూర్చాయని వివరించారు.



కమర్షియల్ పేపర్లు అంటే కంపెనీలు 7 రోజుల నుంచి ఏడాది వరకు స్వల్పకాలిక నిధులు సమీకరించేందుకు ఉపయోగించే రుణ పత్రాలు. జూన్ తొలి భాగంలో కమర్షియల్ పేపర్లపై రిటర్నులు అధికంగా ఉన్నప్పటికీ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చేపట్టిన భారీ లిక్విడిటీ ఇన్ఫ్యూజన్ చర్యలతో అవి తగ్గుముఖం పట్టాయి. ఆర్బీఐ వివిధ వేరియబుల్ రేట్ రెపో వేలాల ద్వారా బ్యాంకింగ్ వ్యవస్థలో రూ.6 లక్షల కోట్లకు పైగా తాత్కాలిక లిక్విడిటీని అందించింది. ప్రస్తుతం జూలై 5 నాటికి బ్యాంకింగ్ వ్యవస్థలో సుమారు రూ.1 లక్షా 85 వేల కోట్ల అదనపు లిక్విడిటీ ఉన్నట్లు ఆర్బీఐడేటా చెపుతోంది.

## ఎన్ఎస్ఈ భారీ ఐపీవోకు రంగం సిద్ధం
## సెప్టెంబర్‌లో రూ.30 వేల కోట్ల పబ్లిక్ ఇష్యూ




**ముంబయి, జులై 6:** నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న తన భారీ ఐపీవోను ఈ ఏడాది సెప్టెంబర్‌లో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ ఐపీవో పరిమాణం సుమారు రూ.30వేల కోట్లు ఉండేఛాన్స్ ఉంది. ఈఇష్యూ విజయవంతమైతే, భారత కార్పొరేట్ చరిత్రలో అతిపెద్ద ఐపీవోలలో ఒకటిగా నిలవనుంది. ఈ ఐపీవో ద్వారా ఎన్ఎస్ఈ మార్కెట్ విలువ రూ.5 లక్షల కోట్లకు పైగా చేరే అవకాశముందని అంచనా. ఇప్పటికే ఇష్యూకు సంబంధించిన రోడ్‌షోలను ప్రారంభించేందుకు ఎన్ఎస్ఈ ఏర్పాట్లు చేస్తోంది. ఈ ఐపీవో విజయవంతమైతే, 2024 అక్టోబర్‌లో హ్యుందాయ్ మోటార్ ఇండియా చేపట్టిన రూ.27,870 కోట్ల ఐపీవో రికార్డును అధిగమించనుంది. ఈ పబ్లిక్ ఇష్యూ పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ రూపంలోనే జరుగుతుంది. ఇందులో మొత్తం 14 కోట్ల 89 లక్షల ఈక్విటీ షేర్లు విక్రయానికి రానుండగా, ప్రస్తుత వాటాదారులు కలిపి సంస్థలోని సుమారు 6 శాతం వాటాను విక్రయించనున్నారు.
ప్రస్తుతం ఎన్ఎస్ఈకి దాదాపు 1.8 లక్షల మంది షేర్‌హోల్డర్లు ఉన్నారు. వాటా విక్రయిస్తున్న ప్రధాన వాటాదారుల్లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అత్యధికంగా 2.48కోట్ల షేర్లు విక్రయించనుండగా, ఎంఎస్ స్ట్రాటజిక్ 1.60 కోట్ల షేర్లు విక్రయించనుంది. కెనడా పెన్షన్ ప్లాన్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డ్, బ్యాంక్ ఆఫ్ బరోడా, జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్, ది న్యూ ఇండియా అష్యూరెన్స్, నేషనల్ ఇన్సూరెన్స్, యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ తదితర సంస్థలు కూడా తమ వాటాలో కొంత భాగాన్ని విక్రయించనున్నాయి. అయితే ఎన్ఎస్ఈలో 10.72శాతం వాటాతో అతిపెద్ద వాటాదారైన ఎల్ఐసీ ఈ షేర్ విక్రయంలో పాల్గొనబోవడం లేదని స్పష్టం చేసింది. సెబీ నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్ఓసీ) లభించిన అనంతరం ఈ ఏడాది ఫిబ్రవరి 6న ఎన్ఎస్ఈ బోర్డు ఐపీవో ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. ఐపీవో నిర్వహణ కోసం ఎన్ఎస్ఈ ఇప్పటికే 20 మంది మర్చంట్ బ్యాంకర్లను, న్యాయ సలహాదారులు, ఇతర మధ్యవర్తులను నియమించింది. ఎన్ఎస్ఈ ఐపీవో ప్రకటన అనంతరం రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన జియో ప్లాట్‌ఫామ్‌లు కూడా సెబీకి తమ డ్రాఫ్ట్ పత్రాలను సమర్పించింది. జియో ప్లాట్‌ఫామ్‌ల ఐపీవో భారత స్టాక్ మార్కెట్ చరిత్రలోనే అతిపెద్ద పబ్లిక్ ఇష్యూగా నిలిచే అవకాశాలు ఉన్నాయని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి.

## కొచ్చిన్ షిప్‌యార్డ్‌లో కేంద్రం వాటాల విక్రయం

**కొచ్చిన్, జులై 6:** ప్రభుత్వ రంగ సంస్థ కొచ్చిన్ షిప్‌యార్డ్‌లో కేంద్ర ప్రభుత్వం తన వాటాలను విక్రయిస్తోంది. ఆఫర్ ఫర్‌సేల్ ద్వారా గరిష్ఠంగా5.04 శాతం వాటాను విక్రయించనున్నట్లు పెట్టుబడులు, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ శాఖ ప్రకటించింది. ఒక్కో షేరుకు రూ.1,400ను ఇష్యూ ధరగా నిర్ణయించారు. తొలి దశలో 2.52 శాతం వాటాను విక్రయించనుండగా పెట్టుబడిదారుల నుంచి మంచి స్పందన లభిస్తే గ్రీన్‌షూ ఆప్షన్ కింద మరో 2.52 శాతం వాటాను కూడా విక్రయించే అవకాశం ఉందని దీపమ్‌తెలిపింది. ఈఆఫర్‌లో జూలై 7న నాన్‌రిటైల్ ఇన్వెస్టర్లు, జూలై 8న రిటైల్ ఇన్వెస్టర్లు పాల్గొంటారు. రక్షణ రంగ ప్రభుత్వ సంస్థలో భారీ వాటాల విక్రయానికి కేంద్రం సిద్ధమవుతోందన్న వార్తలను ఆర్థిక మంత్రిత్వ శాఖ ఇటీవల ఖండించిన నేపథ్యంలో ఈ ప్రకటన ప్రాధాన్యత సంతరించుకుంది. మార్కెట్ అంచనాల ప్రకారం ఈ లావాదేవీ ద్వారా కేంద్రానికి రూ.16 వేల కోట్లకు పైగా సమీకరించే అవకాశం ఉందనిఅంచనా. తాజా షేర్‌హోల్డింగ్ వివరాల ప్రకారం కొచ్చిన్ షిప్‌యార్డ్‌లో ప్రమోటర్ అయిన కేంద్రానికి 67.91 శాతం వాటా ఉంది. ఎల్ఐసీ సంస్థకు 3.34 శాతం వాటా ఉంది. ప్రభుత్వ రంగ సంస్థల్లో తన వాటాను తగ్గించి ప్రజల భాగస్వామ్యాన్ని పెంచేందుకు కేంద్రం సాధారణంగా ఆఫర్ ఫర్ సేల్ విధానాన్ని అనుసరిస్తుంది. డిస్‌ఇన్వెస్ట్‌మెంట్ ద్వారా పెరుగుతున్న ఆదాయంప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో కోల్ ఇండియా, ఎన్‌హెచ్‌పీసీ, ఎన్ఎల్‌సీ ఇండియా, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ వంటి ప్రభుత్వ రంగ సంస్థల్లో వాటాల విక్రయం ద్వారా కేంద్రం ఇప్పటికే దాదాపు రూ.14 వేల కోట్లు సమీకరించింది.



## మైక్రోసాఫ్ట్‌లో భారీ ఉద్యోగాల కోత
## 4,800 మందికి ఉద్వాసన

**శాన్‌ఫ్రాన్సిస్కో, జులై 6:** ప్రపంచ దిగ్గజ టెక్నాలజీ సంస్థ మైక్రోసాఫ్ట్ మరోసారి భారీ స్థాయిలో ఉద్యోగాల కోతకు శ్రీకారంచుట్టింది. సంస్థ మొత్తం ఉద్యోగుల్లో సుమారు 2.1 శాతం, అంటే దాదాపు 4,800 మందిని తొలగించనున్నట్లు ప్రకటించింది. కృత్రిమమేధ రంగంలో భారీగా పెట్టుబడులు పెడుతూ వ్యాపార కార్యకలాపాల్లో సామర్థ్యాన్ని పెంచేందుకు ఏఐ వినియోగాన్ని విస్తరిస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాది బిగ్ టెక్ కంపెనీలు ఏఐమౌలిక సదుపాయాలపై 700 బిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడులు పెట్టనున్నాయని అంచనా. ఇప్పటికే అమెజాన్, మెటా వంటి సంస్థలు కూడా వేలాది మంది ఉద్యోగులను తొలగించాయి. 2026 తొలి ఆరు నెలల్లో మైక్రోసాఫ్ట్ షేర్ ధర దాదాపు 23 శాతం పడిపోవడం 2022 తర్వాత కంపెనీకి ఇదే అత్యంత బలహీనమైన తొలి అర్ధవార్షిక ప్రదర్శనగా నిలిచింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.